RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN
Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal



సంపుటి: 19 సంచిక:153 హైదరాబాద్, శనివారం, 14 డిసెంబర్ 2024 పేజీలు: 12 వెల: 1.00

## మహాకుంభ మేళాలో తొలిసారి ఏఐ, చాట్‌బాట్ సేవలు: మోదీ

అతిపెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనమైన మహా కుంభమేళా ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో వచ్చే ఏడాది జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్ పర్యటనకు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ



మహాకుంభమేళాకు సంబంధించి పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ ఉత్సవాల్లో తొలిసారి ఏఐ, చాట్‌బాట్ సేవలు వినియోగించుకోబోతున్నామని పేర్కొన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా రోబోటిక్ ఫైర్ టెండర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశప్రజలంతా తరలి రావాలని పిలుపునిచ్చారు.

వచ్చే ఏడాది జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు నిర్వహించనున్న మహా కుంభమేళాకు ఏర్పాట్లు చేస్తున్న కార్మికులను, అధికారులను ప్రధాని అభినందించారు. "ఈ ప్రయాగ్‌రాజ్ భూమిపై కొత్త చరిత్ర సృష్టించబోతోంది. మహా కుంభమేళాతో దేశం సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితికి చేరుకుంటుంది. ఈ వేడుకను ప్రపంచ దేశాలు చర్చించుకునే మహా యజ్ఞంగా నిర్వహిస్తాం. భారత్ అంటేనే పవిత్ర స్థలాలకు పుట్టినిల్లు" అని ప్రధాని పేర్కొన్నారు.

అత్యవసర సమయాల్లో సిబ్బంది చేరుకోలేని ప్రాంతాలకు వెళ్లేందుకు మూడు రోబోటిక్ ఫైర్ టెండర్లను ఉపయోగిస్తారని.. ఈ రోబోలు మెట్లు ఎక్కడంతో పాటు మంటలను సైతం అదుపు చేస్తాయని అధికారులు పేర్కొన్నారు. దీంతోపాటు 35 మీటర్ల ఎత్తు నుంచి నీటిని స్ప్రే చేసే ఆర్టిక్యులేటింగ్ వాటర్ టవర్‌లు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అగ్నిమాపక సేవల కోసం గత కుంభమేళాకు రూ.6 కోట్లు కేటాయించగా.. ప్రస్తుతం దాన్ని రూ.67 కోట్లకు పెంచినట్లు తెలిపారు.

## అల్లు అర్జున్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు

హైదరాబాద్: సినీ నటుడు అల్లు అర్జున్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో ఆయన అరెస్టయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అల్లు అర్జున్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం నాలుగు వారాల పాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అల్లు అర్జున్ ఏ11గా పేర్కొన్న పోలీసులు.. మధ్యాహ్నం 1.30కి అరెస్టు చేసినట్లు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. క్వాష్ పిటిషన్‌పై విచారణ అత్యవసరం కాదని.. సోమవారం వినాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) కోర్టును కోరారు. అల్లు అర్జున్ అరెస్టయినందున బెయిల్ కోసం అవసరమైతే మరో పిటిషన్ వేసుకోవాలన్నారు. క్వాష్ పిటిషన్‌లోనే మధ్యంతర బెయిల్ ఇవ్వాలని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు.

"అల్లు అర్జున్ తన ప్రతి సినిమా విడుదల రోజున థియేటర్‌కు వెళ్తారు. థియేటర్ యాజమాన్యం, నిర్మాత పోలీసులకు సమాచారం ఇచ్చారు. అల్లు అర్జున్ రాత్రి 9.40కి సంధ్య థియేటర్‌కు వెళ్లి మొదటి అంతస్తులో కూర్చున్నారు. తొక్కిసలాటలో మరణించిన మహిళ కింద అంతస్తులో ఉన్నారు" అని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు.

మధ్యాహ్నం అడగ్గానే లంచ్ మోషన్‌కు అనుమతివ్వడం తప్పుడు సంకేతం ఇస్తుందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) కోర్టుకు తెలిపారు. క్వాష్ పిటిషన్‌లో మధ్యంతర బెయిల్ ఇవ్వొచ్చా? లేదా? అనే అంశంపై వాదించాలని ఈ సందర్భంగా హైకోర్టు పీపీకి సూచించింది. థియేటర్‌కు వెళ్లొద్దని అల్లు అర్జున్‌కు పోలీసులు ముందుగానే సమాచారం ఇచ్చారని పీపీ కోర్టుకు తెలిపారు. భారీగా జనం ఉంటారని తెలిసినప్పటికీ అల్లు అర్జున్ వెళ్లారని వివరించారు. మధ్యంతర బెయిల్ ఇవ్వాలని క్వాష్ పిటిషన్‌లో ఎక్కడా కోరలేదని పీపీ వాదనలు వినిపించారు. క్వాష్ పిటిషన్‌పై అత్యవసర విచారణ



అవసరం లేదని, సోమవారం విచారించాలని కోరారు. పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ తగిన భద్రత ఇవ్వలేదని అల్లు అర్జున్ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. పోలీసులు కూడా భద్రత కన్నా అల్లు అర్జున్‌ను చూసేందుకే ఎక్కువ ఉత్సాహం చూపారని తెలిపారు. అల్లు అర్జున్ భద్రత సిబ్బంది తోయడంతోనే తొక్కిసలాట జరిగినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుదారుడి భార్య మరణించింది. కుమారుడు వెంటిలేటర్‌పై ఉన్నాడని పీపీ కోర్టుకు వివరించారు. అందుకే అల్లు అర్జున్‌కు ఎలాంటి ఊరట ఇవ్వొద్దని పీపీ తన వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. "ఎఫ్ఐఆర్‌ను పూర్తిగా కొట్టివేయాలని పిటిషన్ వేశాం. పిటిషన్‌పై విచారణ కొనసాగుతుండగానే అరెస్టు చేశారు. అందువల్ల ఈ పిటిషన్ ద్వారానే మధ్యంతర బెయిల్ ఇవ్వొచ్చని గతంలో సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నందున మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరారు. అర్ణబ్ గోస్వామి, మహారాష్ట్ర ప్రభుత్వం కేసులో బాంబే కోర్టు ఇచ్చిన తీర్పును ఉదహరించడంతో వాటి ఆధారంగా హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

## అల్లు అర్జున్ అరెస్ట్‌పై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి..

టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అరెస్ట్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లు అర్జున్ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ఇందులో తన జోక్యం ఏమీ ఉండదని.. చట్టం ముందు అందరూ సమానులేనన్నారు. చట్టపరమైన ప్రక్రియ జరుగుతుందన్నారు. తొక్కిసలాటలో ఒకరు చనిపోయిన నేపథ్యంలో పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని.. మోహన్ బాబు విషయంలో కోర్టు ఉత్తర్వులున్నాయన్నారు. ఈ నెల 4న ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య థియేటర్‌లో పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా వచ్చారు. ఆ సమయంలోనే ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ క్రమంలో రేవతి అనే మహిళ మృతి చెందింది.

ఆమె కుమారుడు గాయాలకు గురయ్యాడు. ఘటనలో మృతురాలి





కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు అల్లు అర్జున్‌తోపాటు పలువురిపై కేసులు నమోదు చేశారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో ముగ్గురిని అరెస్టు చేశారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారు. అల్లు అర్జున్‌పై బీఎన్ఎస్ 118 (1), బీఎన్ఎస్ 105, రెడ్‌విత్ 3/5 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. రేవతి మృతిపై అల్లు అర్జున్ దిగ్భ్రాంతి వ్యక్తం చేయడంతో పాటు ఆమె కుటుంబానికి రూ.25లక్షల సాయం ప్రకటించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ క్రమంలో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్టు అనంతరం గాంధీ ఆసుపత్రిలో పరీక్షలు చేశారు. ఆ తర్వాత ఆయనను కోర్టులో హాజరుపరుచనున్నారు. మరో వైపు పుష్ప స్టార్ తరఫు న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించారు.

## గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక: భట్టి విక్రమార్క

హైదరాబాద్: గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. డిసెంబర్ 14 నుంచి 20 వరకు నిర్వహించనున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా.. తెలంగాణలో విద్యుత్ పొదుపు వేడుకలు జరగనున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర పునరుత్పత్తి విద్యుత్ అభివృద్ధి సంస్థ అధికారులు రూపొందించిన విద్యుత్ పొదుపు క్యాలెండర్-2025ను శుక్రవారం ప్రగతిభవన్‌లో డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు.

"2035 నాటికి 40 గిగావాట్ల పునరుత్పత్తి విద్యుత్ స్థాపన లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తోంది. విద్యుత్ పొదుపు, విద్యుత్ సమర్థత సాధనకు అన్ని రంగాల్లో టెక్నాలజీ ఆధారిత చర్యలు తీసుకుంటున్నాం. విద్యుత్ సంరక్షణ మీద విద్యార్థుల్లో చైతన్యం కల్పించేందుకు 168 ఎనర్జీ క్లబ్‌లు ఏర్పాటు చేశాం. ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ అమలులో దేశంలోనే మొదటి



స్థానంలో తెలంగాణ ఉంది. మూడుసార్లు జాతీయ విద్యుత్ పొదుపు అవార్డులు తెలంగాణ అందుకుంది" అని భట్టి వెల్లడించారు.



భారత శక్తి
VOICE OF INDIAN

# పట్టణాభివృద్ధికి గొడ్డలిపెట్టు

దేశీయంగా సాగురంగంలో సంక్షోభంతో గ్రామీణుల జీవితాలు ఒడుదొడుకులకు లోనవుతున్నాయి. వ్యాపార వాణిజ్యాల విస్తరణతో పట్టణాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతున్నాయి. దాంతో ఉద్యోగ ఉపాధి అవకాశాల అన్వేషణలో నగరాల బాట పడుతున్నవారి సంఖ్య సైతం అధికమవుతోంది. పట్టణ భారత జనాభా రాబోయే కాలంలో 90 కోట్లకు చేరుతుందని పరిశీలనలు వెల్లడిస్తున్నాయి. పోటెత్తుతున్న వలసలతో నగరాల్లో నివాసాలకు గిరాకీ ఎగబాకుతోంది. ఇదే అదనుగా కుంటలు, చెరువులు, నాలాలను మింగేస్తూ అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఆకాశహర్మ్యాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. స్థానిక అధికారులకు తెలియకుండా అవేవీ ఉన్నపళంగా ఊడిపడవు. లంచాలకు అర్రులుచాస్తున్న అధికారగణం నిర్మాణాలకు అడ్డగోలుగా అనుమతులిస్తోంది. ఆపై కూల్చివేతలంటూ హడావుడి చేస్తోంది. అలాంటి నీతి తప్పిన అధికారుల ఆస్తుల జప్తునకు ఆదేశాలిచ్చి, కూల్చివేతలకు వారే పరిహారం చెల్లించేలా ఉత్తర్వులు ఇవ్వాల్సి వస్తుందని తెలంగాణ హైకోర్టు తాజాగా హెచ్చరించింది. అక్రమార్కులపై ఆ మేరకు కఠిన చర్యలు తీసుకుంటేనే పట్టణ భారతానికి పెనుశాపమవుతున్న సమస్య కాస్తంతైనా అదుపులోకి వస్తుంది!

అందుబాటులో ఉన్న భూమిని సమర్థంగా వినియోగించుకుంటూ, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పించడం పుర ప్రణాళికల ప్రాథమిక లక్ష్యం కావాలి. కానీ, దేశీయంగా సగం పట్టణాలకు బృహత్ ప్రణాళికలు లేవు. ఈ దారుణావస్థకు ప్రధాన కారణం... ప్రభుత్వ యంత్రాంగం అవినీతి, అసమర్థతలేనన్నది వాస్తవం. పర్యవసానంగా ఎక్కడికక్కడ అక్రమ నిర్మాణాలు మొలుచుకొస్తున్నాయి. హైదరాబాద్‌లో అలాంటివి లక్షన్నర దాకా ఉంటాయని పాత అధ్యయనాలు చెబుతున్నాయి. ఏపీలోని వందకుపైగా పట్టణాలు, నగర పంచాయతీల్లో 2020 నాటికి నిర్మాణంలో ఉన్న 53వేల భవంతుల్లో అనుమతులు లేనివి 34 వేల వరకు ఉన్నాయని సర్కారీ సర్వేనే వెల్లడించింది. దిల్లీలో గడిచిన ఆరేళ్లలో 55 వేలకు పైగా అనధికార కట్టడాలను గుర్తించారు. ప్రతి రాష్ట్రంలో ప్రతి పట్టణంలో ఇదే దుస్థితి దాపురించింది. అక్రమ నిర్మాణాలను తొలుత ఉపేక్షించి, ఆపై వాటిపైకి బుల్డోజర్లను దౌడు తీయిస్తుండటంతో విలువైన వనరులు గంగపాలవుతున్నాయి. నిర్మాణ వ్యర్థాలతో పర్యావరణానికీ చేటు కలుగుతోంది. బిల్డర్లు, అధికారుల అనైతిక బంధంలోంచి పుట్టుకొచ్చే ఇళ్లూ ఫ్లాట్లను తెలిసీ తెలియక కొనుగోలు చేసే మధ్యతరగతి ప్రజలు చివరికి రోడ్డున పడాల్సి వస్తోంది!



## ట్రినిటీ ఇంజనీరింగ్ లో ప్లేస్ మెంట్ ఫర్ రెడీనెస్ ప్రోగ్రాం

పెద్దపల్లి, డిసెంబర్ 13 : పట్టణంలోని స్థానిక ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో "మెంటార్ టుగెదర్ ఆర్గనైజేషన్" సహకారంతో బీటెక్ మూడవ, నాలుగవ సంవత్సరం చదువుతున్న మహిళా విద్యార్థులకు "మెంటార్ టుగెదర్ ఫర్ ప్లేస్మెంట్ రెడీనెస్" అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జూనియర్ ప్రోగ్రాం అసోసియేట్ మెంటార్ టు గెదర్ ఆర్గనైజేషన్ ప్రతినిధి స్వాతి పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేష్ మాట్లాడుతూ విద్యార్థులందరికి ప్రముఖ బహుళ జాతీయ కంపెనీలో పనిచేస్తున్న 60 కంపెనీల ప్రతినిధులు, ఎంప్లాయిస్ ముగ్గురు విద్యార్థులకి ఒక మెంటార్ గా వ్యవహరిస్తూ వారికి నాలుగు నెలల పాటు ఆన్లైన్ ద్వారా 16 సెషన్స్ నిర్వహించి ఈ సెషన్స్ లో టెక్నికల్ స్కిల్స్, రెస్యూమ్ రైటింగ్, సాఫ్ట్వేర్ నాలెడ్జ్, అప్డేటెడ్ నాలెడ్జ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రోగ్రామింగ్ నాలెడ్జ్, ప్రాబ్లం సాల్వింగ్ వంటి అంశాలపై విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించినట్లు తెలిపారు. అలాగే ట్రైనింగ్ అందించి అనంతరం వారికి కోర్స్ కంప్లేషన్ సర్టిఫికెట్ మంజూరు చేసి తద్వారా వారు రానున్న కాలంలో ఉద్యోగ అవకాశాలు పొందడం కొరకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అంతేకాకుండా టాస్క్, వారి అనుసంధానం అయిన కంపెనీలు ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించిన ఈ కోర్స్ కంప్లీట్ చేసిన విద్యార్థులకి మొదటి ప్రాధాన్యత అందజేసి వారికి ఉద్యోగ అవకాశాలు పొందడం కొరకు సహకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేష్ , ఏఓ సురేష్, టాస్క్ కళాశాల కోఆర్డినేటర్ మధు శేఖర్, రిసోర్స్ పర్సన్ ఏ స్వాతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలి: ఆర్జీ-3 జి.యం.

కమాన్ పూర్, డిసెంబర్ 13 : ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అన్నారు.

సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తునటువంటి మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలలో భాగంగా ఆర్జీ-3 ఏరియాలోని ఓ.సి-1 ఉపరితలగని సైట్ ఆఫీస్ నందు శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాన్ని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడానికి, యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి, భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించడానికి కృషి చేయాలని అన్నారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని, కావున ఎవరి స్థాయిలో వారు సాధ్యమైనంత వరకు వ్యయాన్ని తగ్గించుకోవాలని కోరారు. అంతే కాకుండా నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ, అంకిత భావంతో పని చేయాలని అన్నారు. భద్రత పట్ల అశ్రద్ధ వహించకుండా అధికారులు, సూపర్వైజర్లు సంబంధిత ఉద్యోగులకు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఉద్యోగి సక్రమంగా పని చేస్తూ వ్యక్తిగతంగా అభివృద్ధి చెందుతూ, సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఏ ఇతర ప్రభుత్వ సంస్థలో లేని విధంగా సింగరేణి సంస్థలో ఉద్యోగుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, కావున ఉద్యోగులందరూ దీనిని గమనించి, సమిష్టి కృషితో నాణ్యత, ఉత్పత్తి, ఉత్పాదకత పెంచుతూ సంస్థను మరింత ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు రూపొందించే ప్రణాళికలకు అనుగుణంగా పని చేసేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. సంస్థ పై వినియోగదారుడు పెట్టుకున్న నమ్మకాని వమ్ము చేయకుండా చూడటం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ సమావేశంలో భాగంగా సింగరేణి సాధిస్తున్నటువంటి ప్రగతి, నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడానికి చేసినటువంటి ప్రణాళికల గురించి సంబంధిత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్



ద్వారా అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా సంస్థ అభివృద్ధికి సంబంధించి పలువురు ఉద్యోగులు ఇచ్చినటువంటి సలహాలు, సూచనలను సంబంధిత అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వై.వి.రావు, డి.టి.రావు, జి.వెంకటస్వామి, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖరబాబు, ఎస్వోటుజియం జి.రఘుపతి, ఫైనాన్స్ ఎజియం పి.శ్రీనివాసులు, ఐఈ డిజిఎం కె.చంద్రశేఖర్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ ఉదయ్ భాస్కర్, మేనేజర్ ఉదయ్ హరిజన్, డివైపియం వి.సునీల్ ప్రసాద్, సంక్షేమ అధికారి సాయి కృష్ణ, ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి సిపిఎం ఖమ్మం డివిజన్ సెక్రటరీ వై విక్రమ్

ఖమ్మం, డిసెంబర్ 13 : అసెంబ్లీ పరిధిలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందే విధంగా అధికారులు, మంత్రి చర్యలు తీసుకోవాలి అని సి పి ఎం పార్టీ ఖమ్మం డివిజన్ సెక్రటరీ వై విక్రమ్ పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం అర్బన్ సి పి ఎం పార్టీ మండల కమిటీ సమావేశం సుందరయ్య భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీ ఆర్ స్ పరిపాలన కాలంలో నిజాయితీగా ఇండ్లు స్థలాలు లేని వారికి న్యాయం జరగలేదు అని, ఇప్పుడు కొత్త కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా అర్హులకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి వారికి న్యాయం చేయాలని కోరారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు పేరుతో 10 సంవత్సరాలు కాలయాపన చేశారని, ఖమ్మం అసెంబ్లీ పరిధిలో 15 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి చివరికి 3 వేల ఇళ్లు ఇవ్వలేదు అని ఆరోపించారు. ఇప్పుడు ఖమ్మం పరిదిలో 20 వేల మంది ఇండ్లు స్థలాలు లేని వారు వున్నారు అని, సర్వే చేస్తే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది అని తెలిపారు. రఘునాథ్ పాలెం లో ఇండ్లు స్థలాలు ఇస్తామని చెప్పి చివరికి ఆ స్థలాలు కోర్టు పరిధిలో వున్నాయి అని చెప్పి అధికారులు చేతులు దులుపుకున్నారు అని విమర్శించారు. ఇప్పుడు వెంటనే ఇంటి స్థలాలు లేని వారికి ఇంటి స్థలాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఐదు లక్షల పథకం పకడ్బందీగా సర్వే నిర్వహించి అర్హులకు న్యాయం చేయాలని, రాజకీయాలకు అతీతంగా పేదలకు ఈ పథకం వర్తింపు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమాజంలో జిల్లా నాయకులు రాజ మీరా సాహిబ్, మండల కార్యదర్శి బి ఉపేంద్ర, నాయకులు గోవిందా, నాగేశ్వరరావు, మధు, శ్రీనివాసురావు తదితరులు పాల్గొన్నారు

## తాండూరు గిరిజన హస్టల్ విద్యార్థిని నిమ్స్ కు తరలింపు

వికారాబాద్, డిసెంబర్ 13 : తాండూర్ గిరిజన సంక్షేమ హాస్టల్ లో అస్వస్థత గురైన విద్యార్థి లీలావతి పరిస్థితి విషమంగా వుండడంతో మెరుగైనా చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అధికారులు గుట్టు చప్పుడు కాకుండా తరలించడం బయటపడింది. ఎమ్మెల్సీ చీప్ విప్ మహేందర్ రెడ్డి శుక్రవారం హాస్టల్ ను పరిశీలించారు. లీలావతి విద్యార్థి ఆరోగ్యం పై అరా తీసారు.

## పేద ప్రజలకు అండగా నిలుస్తున్న రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

మంథని, డిసెంబర్ 13 : పేద ప్రజలకు అండగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిలుస్తున్నారు.అనారోగ్య బాధితులకు



మంత్రి శ్రీధర్ బాబు భరోసా కల్పిస్తున్నారు. మంథని నియోజకవర్గ పరిధిలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహా ముత్తారం మండలనీలోని మీనాజిపేట గ్రామానికి చెందిన గంగవేణి శ్రీనివాస్ అనారోగ్య వైద్య చికిత్సకు సంబంధించి నిమ్స్ ఆసుపత్రి లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నట్లు సహాయం కొరకు తెలంగాణ రాష్ట్ర ఐటి,పరిశ్రమల మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కు తెలుపగా వెంటనే స్పందించిన మంత్రి ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తనీ వీరికి 2 లక్షల 50వేల ఎల్వోసి మంజూరు చేయించారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు శుక్రవారం వారికి హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్వోసి పత్రాలను

అందజేశారు. 2 లక్షల 50 వేల రూపాయలు మంజూరు చేపించి అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబు కు గంగవేణి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## బెడ్ రూమ్ లోకి వచ్చేస్తారా : అల్లు అర్జున్

హైదరాబాద్, డిసెంబర్ 13 : ఇదేం అరెస్ట్ చేసే విధానం? నేరుగా బెడ్ రూమ్ లోకి వచ్చేస్తారా? చేయని తప్పుకు అరెస్ట్ చేస్తున్నారు! డ్రెస్ మార్చుకోవడానికి కూడా టైం ఇవ్వలేదు. ఇది మంచి పద్ధతి కాదు అని అల్లు అర్జున్ పోలీసులతో అన్నారు. భార్య స్నేహారెడ్డి కంట తడిపెట్టగా, ఆందోళన వద్దు ఏం కాదు అంటూ ఓదార్చారు. పోలీస్ కారులో అల్లు అరవింద్ కూడా కూర్చోగా, అర్జున్ తనను దింపేశారు. ఏం జరిగినా నేనే ఎదుర్కొంటా, నేనే ఫేస్ చేస్తా, మీరు దిగండి అంటూ తండ్రిని దించేసారు అల్లు అర్జున్. ఆయన తరువాత సొంత కారులో ఫాలో అయ్యారు

# చంద్రబాబుకు ఒక న్యాయం.. బన్నీకి ఒక న్యాయమా

హైదరాబాద్, డిసెంబర్ 13 : సినీ నటుడు అల్లు అర్జున్ ను హైదరాబాద్ చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన్ను కోర్టులో ప్రవేశ పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తు?న్నారు. పుష్పా-2 మూవీ రిలీజ్ సందర్భంగా ఆర్టీసీ క్రాస్ సంధ్యా థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట జరిగి మహిళ మృతి చెందింది. ఈ కేసుకు సంబంధించిన పోలీసులు అల్లు అర్జున్ ను అరెస్ట్ చేశారు.దీంతో అల్లు అర్జున్ అరెస్టును సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు ఖండిస్తున్నారు. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సైతం ఖండించారు. అయితే పుష్కరాల సమయంలో ఏపీలో జరిగిన ఘటనలు, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మీటింగ్లో జరిగిన తొక్కలాటను గుర్తు చేస్తూ పోలీసులపై ప్రశ్నలు సంధించారు. చంద్రబాబు నాయుడు కందుకూరు వెళ్ళినపుడు తొక్కిసలాటలో 8 మంది, గుంటూరులో ముగ్గురు, పుష్కరాల్లో 23 మంది చనిపోయారని గుర్తు చేశారు. మరి చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేశారా? అని ప్రశ్నించారు. రాజకీయ నాయకులకు ఒక న్యాయం.. నటులకు, సామాన్య ప్రజలకు ఒక న్యాయమా? అని కేఏ పాల్ నిలదీశారు.

============

# కేటీఆర్ అరెస్ట్‌కు లైన్ క్లియర్...? గవర్నర్ ఆమోదం..

హైదరాబాద్, డిసెంబర్ 13 : తెలంగాణలో అధికారం పోయి బీఆర్ఎస్ ఏడాది గడిచింది. కాకపోతే తొలి ఏడాది ఆ పార్టీకి ఎలాంటి చిక్కులు రాలేదు. అసలు సమస్యలు రెండు లేదా మూడో ఏడాదిలో ఉంటాయని అంటున్నారు కొందరు నేతలు. ఎందుకుంటే బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతి ఆరోపణలపై విచారణ జరుగుతోంది.మిగతా కేసు విషయం కాసేపు పక్కనబెడితే, ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్ అడ్డంగా ఇరుక్కున్నారన్నది అధికార పార్టీ నేతల మాట. లేటెస్ట్‌గా కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు గవర్నర్ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్టు పొలిటికల్ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారం సాగుతోంది.ప్రభుత్వం పంపిన దస్త్రానికి రెండు రోజుల కిందట గవర్నర్ ఆమోద ముద్ర వేశారట. దీంతో కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు మార్గం సుగమమైంది. కేటీఆర్‌తోపాటు అప్పటి పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఇందులో ఇరుక్కునే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయటఅసలేం కేసు వ్యవహారం ఏంటి? బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేస్ నిర్వహించారు. దీనికి సంబంధించి నిధుల అవకతవకలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి గానీ, ఆర్బీఐ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఓ విదేశీ కంపెనీకి అప్పటి ప్రభుత్వం నిధులు చెల్లించింది.దాదాపు 46 కోట్ల రూపాయలు విదేశీ కరెన్సీ రూపంలో చెల్లించింది అప్పటి మున్సిపల్ శాఖ. అయితే చెల్లింపుల్లో ఇటు హెచ్ఎండీఏ బోర్డు నుంచి అనుమతి పొందలేదు. అలాగే అప్పటికే కేసీఆర్ కేబినెట్ లో ప్రస్తావించలేదు.



ఒక విదేశీ సంస్థకు నిధులు ఇవ్వాలంటే ఆర్బీఐ నుంచి ఖచ్చితంగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.ఆ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చేసింది అప్పటి కేసీఆర్ సర్కార్. కొత్తగా వచ్చిన రేవంత్ సర్కార్ దీనిపై ఫోకస్ చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో అక్టోబరులో ఏసీబీ.. ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడం జరిగిపోయింది. గవర్నర్‌ను రేవంత్ సర్కార్ సంప్రదించడం జరిగిపోయింది. లేటెస్ట్‌గా గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు అంతర్గత సమాచారం. రేపో మాపో ఆ కేసు స్పీడ్ అందుకోనుంది. మొత్తానికి రాబోయే రోజుల్లో కేటీఆర్‌కు ఇబ్బందులు తప్పవన్నమాట.

# కేబినెట్ విస్తరణకు అడగడుగునా అడ్డంకులు

హైదరాబాద్, డిసెంబర్ 13 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయ్యింది. అప్పటి నుంచి బుగ్గ కారు కోసం కొందరు నేతలు కంట్లో వత్తులేసుకుని ఎదురు చూస్తున్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లడం ఏదో శుభవార్త తెస్తారని ఎదురుచూడడం.. ఢిల్లీ నుంచి వచ్చి విస్తవరణపై పెదవి విప్పకపోవడంతో డీలా పడిపోవడం సర్వ సాధారణమైపోయింది. ఈ నిశబ్ద వాతావరణంతో కొండంత ఆశ పెట్టుకున్న ఆశావహుల గుండెలు గుభేల్‌మంటున్నాయి. అసలు విస్తరణ ఉంటుందా? ఉంటే ఎప్పుడు ఉంటుంది? అంటూ గుర్రుగా పోతోందని తెలుస్తోంది. దీనంతటికీ కారణం ఒక్కటే.. అనుకున్న శాఖలు రాకున్నా.. మంత్రి పదవి దక్కకున్నా అసంతృప్తి జ్వాలలు రగిలే అవకాశముంది. అందుకే ఎప్పటికికప్పుడు వాయిదాలు వేస్తూ వస్తోందని ఆ పార్టీ ఇన్‌సైడ్ టాక్..అంతేకాదు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రుల సిఫారసులు కూడా హైకమాండ్‌కు తలనొప్పిగా మారాయంట.. కొందరు కర్ణాటక సర్కార్ పెద్దలతో కూడా సిఫార్సులు చేయిస్తున్నారని సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరి రికమండేషన్‌ను పరిగణలోకి తీసుకోవాలో తెలియక హైకమాండ్ పెద్దలు



ఉన్నారట ఎమ్మెల్యేలుగతేడాది డిసెంబర్ 7న సీఎంగా అధికార పగ్గాలు చేపట్టిన రేవంత్ రెడ్డి..తనతో పాటు 11మందితో ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి క్యాబినెట్ విస్తరణ ఊరిస్తూనే ఉంది. నెలలు గడుస్తున్నా విస్తరణ మాత్రం జరగడం లేదు. ప్రస్తుతం రేవంత్ క్యాబినెట్‌లో అదనంగా మరో ఆరుగురికి చోటు దక్కే అవకాశం ఉంది. ఈ ఆరు స్థానాల కోసం.. పదుల సార్లు.. అధిష్టానంతో చర్చోప చర్చలు.. మంతనాలు జరిగాయి. ఏడాది పూర్తైనా అదే సాగదీత.. అదే ఊరడింపు..సంక్రాంతికి అన్నారు. అంతలోనే ఉగాది తర్వాత చూద్దామన్నారు. ఇంతలోనే ఆషాఢ మాసం తెరపైకి వచ్చింది. అది పోగానే లోక్‌సభ ఎన్నికలు అడ్డొచ్చాయి. కొత్త పీసీసీ ప్రెసిడెంట్ ఎంపిక తర్వాత.. విస్తరణ పక్కా అంటూ ప్రచారం జరిగింది. చెప్పినట్లుగానే పీసీసీ చీఫ్‌గా మహేశ్ కుమార్ గౌడ్ నియామకం పూర్తి చేసింది. ఇక అడ్డంకులన్నీ తొలిగిపోయాయి. దసరా పండుగకు కొత్త మంత్రులు వస్తారని అధిష్టానం లీకులు ఇచ్చింది. కానీ ఆ లీకులకు అధిష్టానం పోకడలకు పొంతన లేదు. మొన్నటికి మొన్న దీపావళికి పక్కా అంటూ ఊరడించి ఊసురుమనిపించారు అధిష్టానం పెద్దలు. ఇంతలోనే మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు రాగానే మళ్లీ ఢిల్లీ పెద్దలు సైలెంట్ అయ్యారు. ఆ రెండు రాష్ట్రాల ఫలితాలు వచ్చాయి ప్రభుత్వాలు కొలువుదీరాయి.

ఐనా క్యాబినెట్ విస్తరణపై నో క్లారిటీ.

మంత్రివర్గంలో చోటు కోసం చాలా మంది ఆశావహులు కొండంత ఆశ పెట్టుకున్నారు. అందులో మాజీ మంత్రులతో పాటు సీనియర్ ఎమ్మెల్యేలు, జూనియర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు. ఎవరి లెవల్ లో వారు పైరవీలు చేసుకుంటూ వస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి నుంచి అధిష్టానం వరకు విన్నపాలు చేసుకుంటున్నారు. దీంతో క్యాబినెట్ బెర్త్ కోసం పోటీ పడుతున్న వారి సంఖ్య భారీగానే ఉంది. మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, శ్రీహరి ముదిరాజ్, ఆది శ్రీనివాస్, వివేక్ వెంకట స్వామి, ప్రేమ్ సాగర్ రావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వచ్చే నెల మరో 7 ఎమ్మెల్సీ స్థానాలు కాంగ్రెస్‌కు లభించే అవకాశం ఉంది. ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యే ఒకరిద్దరు నేతలకు కూడా మంత్రివర్గంలో పదవి ఆశిస్తున్నారు. ఈ జాబితాలో షబ్బీర్ అలీ, పహీం ఖురేషీ పేర్లు వినిపిస్తున్నాయి.కేబినెట్ బెర్త్‌లు ఆరు ఖాళీ ఉంటే పోటీ పడుతున్న నేతల సంఖ్య పదికి పైగా ఉంది. దీంతో మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు ఢిల్లీ పెద్దలకు బిగ్ టాస్క్‌గా మారిందట. మంత్రి పదవులు ఆశిస్తున్న ఆశావహులు పెద్ద సంఖ్యలో ఉండటంతో అధిష్టానం ఎటూ తేల్చుకోలేక అయోమయంలో పడ్డారనేది కాంగ్రెస్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న చర్చ.. విభేదాలు, అలకలు లేకుండా సాఫీగా సాగిపోతున్న సమయంలో మంత్రివర్గ విస్తరణ చేసి లేని తలనొప్పులు తెచ్చుకోవడం ఎందుకని ఢిల్లీ పెద్దలు వాయిదాల జపం చేస్తున్నారు. మరి ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడని మంత్రి పదవుల ఆశావహులు గుర్రుగా ఉన్నారంట.. మరి హైకమాండ్ ఏం చేస్తుంది, ఈ సారైనా సీఎం హస్తిన టూర్ తీపి కబురుతో ముగుస్తుందో లేదో చూడాలి.

==========================

# రైతులు పండించిన పత్తి పంటను జిన్నింగ్ మిల్లులో వెంటనే కొనుగోలు చేయాలి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, డిసెంబర్ 13: రైతులు పండించిన పత్తి పంటను జిన్నింగ్ మిల్లులో వెంటనే కొనుగోలు చేయాలనీ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం మద్నూర్ మండల కేంద్రంలో సిసిఐ కృష్ణ నేచరల్ ఫైబర్ ప్రైవేటు లిమిటెడ్ జిన్నింగ్ మిల్లును కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన పత్తి నీ తేమశాతం పరిశీలించి కొనుగోలు చేయాలని తెలిపారు. కేంద్రంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పత్తి విక్రయ చెల్లింపులో ఏమైనా ఇబ్బందులు కలుగుతున్నాయా అని అడిగారు. రైతులకు చెల్లింపుల విషయాన్ని సీసీఐ ఇన్చార్జి నీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిన్నింగ్ ప్రాసెసింగ్, బెల్ ప్రాసెసింగ్ లను కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సౌజన్య, జిల్లా మార్కెటింగ్ అధికారిణి రమ్య, కార్యదర్శి రాం నాథ్ రావు, తహసీల్దార్ ముజీప్, ఎంపీడీఓ రాణీ, ఎంపీఒ వెంకట నరసయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.





# ఆదివాసీల భూముల జోలికివస్తె పోరాటమే?

## ఆదివాసీలను భూముల నుండి వెళ్లగొట్టే ప్రయత్నాలు మానుకోవాలి: సంకే రవి సిపిఎం జిల్లా కార్యదర్శి



మంచిర్యాల,డిసెంబర్ 13(భారత శక్తి):కాసిపేట మండలంలోని దేవాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీ విస్తరణ పేరుతో ప్రభుత్వం,అధికారులు ఆదివాసీల భూములను,వారి జీవితాలను పణంగా పెట్టడం చోచనీయం.తాత ముత్తాతల నుంచి వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నవారి జీవితాలను చిన్న భిన్నం చెయ్యాలని చూసే పద్ధతిని మానుకోవాలని సీపీఎం మంచిర్యాల జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది.శుక్రవారం కొత్త తిర్మలపూర్ ఆదివాసీ గూడెనికి సంకె రవి సీపీఎం జిల్లా కార్యదర్శి,పాయిరాల రాములు సీపీఎం నాయకులు వెళ్లి ఆదివాసీల తో మాట్లాడి వివరాలు తెలుసుకోవడం జరిగింది.కొత్త తిర్మలపూర్ తో పాటు మండలంలో మరికొన్ని ఆదివాసీ గూడెల్లో భూములు తీసుకోవడం కోసం జరిగే ప్రయత్నాలు నిర్మించుకోవాలి.1991 కి ముందు పాత తిర్మలపూర్ లో తమ బ్రతుకు తాము బ్రతుకుతెంటే అప్పటి ప్రభుత్వం,అధికారులు ఆదివాసీలపై లేనిపోని నిందలు వేసి,అమాయకులైన ఆదివాసీలను బెదిరించి గూడెం నుంచి ఖాళీ చేయించి ప్రస్తుతం ఉన్న ప్రాంతానికి తరలించడం జరిగింది.నాటి నుంచి నేటి వరకు బెదిరింపులకు గురౌతునే ఉన్నారు.మళ్ళీ నేడు ఆదివాసీల సాగులో ఉన్న భూములను లాక్కోని మరో సారి వారి జీవితాలను,బ్రతుకు దెరువును నేటి ప్రభుత్వం,అధికారులు చెయ్యడం చిన్న భిన్నం చెయ్యడానికి పూనుకోవడం దుర్మార్గమైనది.గతంలో ఇచ్చిన హామీలే 30 సం.రాలు దాటిన అమలు చెయ్యలేదు.సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు సందర్భంగా నిర్వాసితులకు ఇచ్చిన హామీలకు దిక్కులేదు.కుర్రే ఫూట్ ఆదివాసీల బ్రతుకులకే గ్యారంటీ ఇవ్వలేదు.నేడు మళ్ళీ ఆదివాసీలను వారి భూముల నుంచి ఖాళీ చేయించాలనే కుట్రలు జరుగుతున్నాయి.వీటిని విరమించుకోవాలని సీపీఎం ప్రభుత్వాన్ని,అధికారులను డిమాండ్ చేస్తుంది.లేకుంటే పోరాటా కార్యక్రమాలకు ఆదివాసీలు సిద్దం అవుతారని తెలియ జేస్తున్నాము.ఈ కార్యక్రమంలో గ్రామ సీపీఎం నాయకులు టేకం శంకర్,ఆత్రం భీం బాయి, టేకం భీం బాయి మరియు ఆదివాసీలు పాల్గొన్నారు.

# ప్రత్యేక అధికారుల పాలనలో పడకేసిన గ్రామ పారిశుధ్యం ప్రత్యేక అధికారి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రుత్వీ పాలనలో పారిశుధ్య పనులు పడకేసింది మాజీ సర్పంచ్.

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 13: నిర్మల్ జిల్లా తానూర్ మండల పరిధిలోని బెల్ తరోడ గ్రామంలో గ్రామ కార్యదర్శి నిర్లక్ష్యంతో పాటు ప్రత్యేక అధికారి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రుత్వీ పాలనలో పారిశుద్ధ్య పనులు పడకేసిందని గ్రామ మాజీ సర్పంచ్ బచ్చేవర్ శివనాథ్ మరియు ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఎస్సీ కాలనీతో పాటు తనూరు వెళ్లే రోడ్డు కు ఇరువైపులా మురికి నిలువ ఉండడంతో దోమలు ఎక్కువై డెంగ్యూ



మలేరియా తో పాటు పలు రోగాలకు బరే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. కాలనీలలో చెత్త చెదారం నిండిపోయిందని వాపోతున్నారు. దుర్గంధం వెదజల్లే చెత్తతో కాలనీవాసులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. వ్యర్థాలు నిల్వ ఉండడంతో ఈగలు, దోమలు వెలసి అంటు వ్యాధులు ప్రభలుతున్నాయన్నారు. గ్రామంలోని డ్రైనేజీలు నిండి చెత్త చెదారంతో దర్శనమిస్తున్నాయి. ఎన్నోసార్లు స్పెషల్ ఆఫీసర్ కి ,గ్రామ కార్యదర్శికి చెప్పిన ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. దోమల బెడద నివారణకు ఫాగింగ్ చేసి రెండు సంవత్సరాలు గడుస్తున్నా దోమల నివారణకు నేటికి కూడా ఫాగింగ్ చేయని దుస్థితి ఏర్పడటంతో దోమల బెడద ఎక్కువ అవుతుందని తెలిపారు. మురుగు కాలువల్లో దుర్గంధం వాసన వస్తుందని, ప్రజలు ఇంటిముందు ఉండాలంటే ముక్కు మూసుకుని బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. సర్పంచులు లేకపోవడంతో స్పెషల్ అధికారి పాలన నియమించామన్నారు. దీంతో స్పెషల్ ఆఫీసర్ ఏనాడు కూడా గ్రామాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి డ్రైనేజీలను శుభ్రం చేయించి ప్రజలను రోగాల భారీ నుంచి కాపాడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# డిసెంబర్ 14న కామన్ డైట్ లాంచ్ కార్యక్రమం -పిల్లల తల్లిదండ్రులు కామన్ డైట్ లాంచ్ కార్యక్రమానికి హాజరు కావాలి

ఖమ్మం బ్యూరో, భారత శక్తి, డిసెంబర్ 13:ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో డిసెంబర్ 14న నిర్వహించు కామన్ మెనూ లాంచ్ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లుపాల్గొంటారు.ఉప ముఖ్యమంత్రి పర్యటనలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం రెవెన్యూ డివిజన్ అధికారి, రెవెన్యూ శాఖ మంత్రి పర్యటనలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ రమేష్ లు పాల్గొంటారు.డిసెంబర్ 14న ఉదయం 11 గంటలకు ఉప ముఖ్యమంత్రి బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చేరుకొని నరేగా పథకం క్రింద నిర్మించిన రోడ్లను ప్రారంభించిన అనంతరం 11-40 నుండి 2-20 వరకు బోనకల్ లోని బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగే కామన్ డైట్ లాంచ్ కార్యక్రమంలో పాల్గొంటారు.

అనంతరం మధ్యాహ్నం 2-30 నుండి సాయంత్రం 7 గంటల వరకు శాంతి నిలయం, రావినూతుల, గోవిందాపురం, జానకిపురం, రాపల్లి, రొంపిమల్లి గ్రామాలలో పర్యటించి ఉప ముఖ్యమంత్రి నరేగా క్రింద నిర్మించే రోడ్లు, గ్రామ పంచాయతీ, అంగన్వాడి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, రాత్రి మధిరలో అధికారులను కలిసి నైట్ హాల్ట్ చేస్తారు.డిసెంబర్ 14న ఉదయం 10-45 గంటలకు కూసుమంచి మండలం నాయకన్ గూడెంలో సీసీ రోడ్లు, డ్రైన్ ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఉదయం 11-30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం గ్రామంలోని గిరిజనుల రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగే కామన్ డైట్ లాంచ్ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరు అవుతారు. అనంతరం అక్కడ నిర్మిస్తున్న గిరిజన హాస్టల్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తారు.గతంలో ఉన్న డైట్ చార్జీలు 8 సంవత్సరాల తర్వాత 40 శాతం ప్రస్తుత ప్రజా ప్రభుత్వం పెంచిందని, కాస్మెటిక్ చార్జీలను 16 సంవత్సరాల తర్వాత 200 శాతం పెంచడం జరిగింది.డైట్ చార్జీలను 3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు 950 నుంచి 1330 రూపాయలకు, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 1100 నుంచి 1540 రూపాయలకు, ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులకు 1500 నుంచి 2100 రూపాయలకు ప్రజా ప్రభుత్వం పెంచింది.



అదేవిధంగా కాస్మోటిక్ చార్జీలను బాలికలకు 7వ తరగతి వరకు 55 నుంచి 175 రూపాయల వరకు, 11 సంవత్సరాల వయస్సు పైగల బాలికలకు 75 నుంచి 275 రూపాయలకు, బాలురు 7వ తరగతి వరకు 62 నుంచి 150 రూపాయల వరకు, 11 సంవత్సరాల వయస్సు పైగల బాలురు 62 నుంచి 200 రూపాయలకు పెంచడం జరిగింది.

ప్రజా ప్రభుత్వం పెంచిన డైట్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు రాష్ట్రంలోని 8 లక్షల మంది విద్యార్థులకు ఉపయోగపడ నున్నాయి. దీని వల్ల ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం 470 కోట్లు అదనపు భారం పడుతుంది.యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం గురించి తల్లిదండ్రులకు కామన్ డైట్ లాంచ్ సందర్భంగా తెలియజేయ నున్నారు.

రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో ఫుడ్ పాయిజన్ కేసులు తగ్గించేందుకు ప్రభుత్వం టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసింది. కిచెన్, డైనింగ్ ఏరియాలను శుభ్రంగా, ఆ ప్రాంతాలను ఎప్పుడు శుభ్రంగా ఉంచుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలు పకడ్బందీగా చేపట్టడం జరిగింది.

# సీవరేజ్ స్పెషల్ డ్రైవ్ :



హైదరాబాద్, డిసెంబర్ 13 : మరికొన్ని ఎస్టీపీలను ప్రారంభించేందుకు హైదరాబాద్ జలమండలి సిద్ధమవుతోంది. జనవరి నాటికి 9 ఎస్టీపీలు ప్రారంభించాలని యోచిస్తోంది. ఇప్పటికే 11 ఎస్టీపీలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. కొత్త ఎస్టీపీల ప్రారంభంతో మూసీ నీటి ప్రక్షాళనలో మరో అడుగు ముందుకు పడినట్లు అవుతుంది.రానున్న జనవరి నాటికి హైదరాబాద్ నగరంలో మరికొన్ని సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్లు(ఎస్టీపీ) అందుబాటులోకి రానున్నాయి. ఆ దిశగా జల మండలి అడుగులు వేస్తోంది. పెండింగ్ లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేసేలా కార్యాచరణను సిద్ధం చేసింది. నగరంలో మరో 9 ఎస్టీపీలు నిర్మాణ దశలో ఉన్నాయి.ఈ నిర్మాణలపై ఇటీవలే జల మండలి ఎండీ అశోక్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ఎస్టీపీలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని.. జనవరి నాటికి పనులు పూర్తి అవ్వాలని ఆదేశించారు. సరిపడా కార్మికులను ఈ ఎస్టీపీల నిర్మాణానికి కేటాయించాలని నిర్మాణ సంస్థకు కూడా సూచించారు. వివిధ దశల్లో పనులు పూర్తి చేయడానికి నిర్దేశించుకున్న గడువులోగా పనులు పూర్తి కాకపోతే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.ఎస్టీపీల నిర్మాణంలోని వివిధ దశల పనులు అవకాశం ఉన్నంత వరకు సమాంతరంగా జరగాలని ఎండీ అశోక్ రెడ్డి సూచించారు. అనుకున్న సమయానికి ఎలెక్ట్రో మెకానికల్ ఈక్విప్మెంట్ సమకూర్చుకోవాలని? ఇందుకు గానూ ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. రెండు షిఫ్టుల్లో పనులు జరగాలని సూచించారు. ఎస్టీపీల నిర్మాణంలో భద్రత విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉండొద్దని పేర్కొన్నారు. కార్మికులు కచ్చితంగా భద్రతా పరికరాలను వినియోగించేలా చూడాలని చెప్పారు. ఎస్టీపీల నిర్మాణం జరుగుతున్న ప్రదేశాల్లో తగు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.జలమండలి ఎస్టీపీ ప్రాజెక్టుల్లో నిర్మిస్తున్న వాటిల్లో.. ఇప్పటికే 11 ఎస్టీపీలు ప్రారంభమయ్యాయి. మరో 9 ఎస్టీపీలు నిర్మాణం దశలో ఉన్నాయి. వీటిలో డిసెంబర్ లో పాలపిట్ట, వెన్నల గడ్డ ఎస్టీపీలు పూర్తి కావాలన్నారు. జనవరిలో అంబర్ పేట్, ముల్లకత్వ చెరువు, శివాలయ నగర్, నలగండ్ల, అత్తాపూర్, రెయిన్ బో విస్తా, రామ చెరువు దగ్గర నిర్మిస్తున్న ఎస్టీపీలు ప్రారంభానికి సిద్ధం చేయాలని ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు.నిరంతర పకడ్బందీ పర్యవేక్షణతో 90 రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో మాట్లాడిన ఆయన? "సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ – హైదరాబాద్" లక్ష్యంగా 90 రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ప్రారంభించామని 70 రోజులు పూర్తయిందన్నారు. ఇప్పటి వరకు నిర్దేశించుకున్న లక్ష్యాన్ని 50 శాతం చేరుకున్నట్లు తెలిపారు. బుధవారం నాటికి 12673 ప్రాంతాల్లో 1602 కిలోమీటర్ల మేర సీవరేజ్ పైపు లైన్, 1.22 లక్షల మ్యాన్ హోళ్లలో పూడికతీత పనులు చేసినట్లు చెప్పారు. మురుగు నీటి నిర్వహణలో రోజూవారీగా ఉపయోగించే 220 ఎయిర్ టెక్ మిషన్లు, 146 సిల్ట్ తరలింపు వాహనాలు, సీవరేజ్ సిబ్బందినే ఇందులోనూ వాడుకునేలా కార్యక్రమాన్ని రూపొందించామని చెప్పారు.

# ఉద్యమకారులకు అండగా...

# కాంగ్రెస్ అంతు చిక్కని రేవంత్ వ్యూహం

హైదరాబాద్, డిసెంబర్ 13 : కాంగ్రెస్ ఏడాది ప్రభుత్వ పాలన వేడుకలు గులాబీ పార్టీకి కొత్త చిక్కులు తెచ్చి పెట్టాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గులాబీ పార్టీలో ఓ ఎమ్మెల్సీని డిఫెన్స్‌లోకి లాగింది. ప్రజా పరిపాలన వేడుకల్లో భాగంగా తెలంగాణ తల్లి విగ్రహానికి కొత్త రూపం ఇస్తూ.. సచివాలయంలో ఆవిష్కరించింది కాంగ్రెస్ పార్టీ. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా కృషి చేసిన కొంతమందికి కళాకారులకు సర్కార్ కోటి రూపాయాల నజరానాలు ప్రకటించింది. పైగా ఇంటి స్థలాన్ని కూడా ప్రకటించింది. ఇదంతా బాగానే ఉంది కానీ. నజరానా ప్రకటించిన జాబితాలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పేరు కూడా ఉండడం పెద్ద చర్చకు దారితీసింది.కవి గోరటి వెంకన్న.. తన పాటలతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోశారు. తన రాగాలతో ఉద్యమ స్ఫూర్తి రగిలించారు. తెలంగాణ ప్రజల్ని ఉద్యమం వైపు నడిపించారు. ప్రజాకవి గోరటి వెంకన్న హృదయమంతా పాటల సవ్వడితోనే మార్మోగిపోతోంది. ఆయన హృదయాన్ని పలకరిస్తే.. మన మనసు పులకరించి పోవాల్సిందే. ఆయన నోటి వెంట జానపదాలు జలపాతాల్లా ప్రవహిస్తూనే ఉంటాయి. అలాంటి ఉద్యమ కళాకారుడిని పెద్దల సభకు పంపించింది బీఆర్ఎస్. ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్‌కు ముద్రపడింది. ఆ ముద్రను తొలగించేందుకు ఇప్పుడు బీఆర్ఎస్‌లో ఉన్న కీలక కళాకారుల్ని, ఉద్యమకారుల్ని కాంగ్రెస్ తన వైపు తిప్పుకునేందుకు ట్రై చేస్తోందని టాక్ వినిపిస్తోంది.ఇప్పటికే జయ జయహే తెలంగాణ పాటను రాష్ట్ర గీతంగా గుర్తించి ఆ పాట రాసిన అందెశ్రీని తమ వైపు తిప్పుకోగలిగారు. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్న గోరటి వెంకన్నకు ప్రభుత్వం కోటి రూపాయల నజరానా ప్రకటించడంతో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్‌లో ఉన్న గోరటి వెంకన్న ఆ నజరానాను తీసుకుంటారా లేదా అని పెద్ద చర్చగా మారింది. ఓ కళాకారుడిగా తీసుకుంటే తప్పేంటని వాదించే వాళ్లు కూడా లేకపోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే నజరానాలను తీసుకుంటే ఆ పార్టీకి విధేయులుగా మారిపోయినట్లేనని చర్చ కూడా జరుగుతుంది. నజరానా పుచ్చుకుంటే బీఆర్ఎస్ పెద్దలు ఈ



విషయాన్ని సీరియస్‌గానే అవకాశం కూడా ఉంది.దీంతో ప్రభుత్వ నజరానా తీసుకోవాలా వద్దా అని గోరటి వెంకన్న డైలామాలో ఉన్నట్లు సమాచారం. గోరటి వెంకన్న ఎక్కడ చేజారిపోతారోనని బీఆర్ఎస్ పార్టీ అలర్ట్ అయ్యింది. గోరటి వెంకన్నను కారు దిగకుండా చేసే బాధ్యతలను ఆయన సామాజికవర్గానికి చెందిన ఓ యువ నేతకు అప్పగించారు. దీంతో ఆయన రెండు, మూడ్రోజులగా ఎమ్మెల్సీ గోరటి వెంకన్నను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. ఎమ్మెల్సీ సొంత పనులపై బయటకు వెళ్లినా ఆ యువ నేత మాత్రం నీడలా వెంటే ఉంటున్నారట.గోరటి వెంకన్న కూడా ప్రభుత్వ నజరానా తీసుకోనని.. తీసుకుంటానని ఇప్పటి వరకు క్లారిటీ ఇవ్వలేదు. దీంతో గోరటి వెంకన్న నిర్ణయం ఎలా ఉండబోతుందని ఉత్కంఠ మొదలైంది. ఇప్పటికే గోరటి వెంకన్న బీఆర్ఎస్ పార్టీతో అంటిముట్టన్నట్లు ఉంటున్నారు. ఇప్పుడు సడెన్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం నజరానా ప్రకటించడంతో గోరటి వెంకన్న ఎలా రియాక్ట్ అవుతారని పెద్ద టాపిక్ గా మారింది.

# వరంగల్ అభివృద్ధిపై రేవంత్ స్పెషల్ ఫోకస్ ఎందుకు?



వరంగల్, డిసెంబర్ 13 : తెలంగాణలో రాజధాని హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరం వరంగల్. అందుకే వరంగల్ అభివృద్ధిపై రేవంత్ ప్రభుత్వం దృష్టిపెట్టింది. తెలంగాణలో హైదరాబాద్ స్థాయిలో వేరే ఏ నగరం లేదు. ఆ స్థాయిలో అభివృద్ధి చెందే అవకాశం వరంగల్‌కే ఉండటంతో.. ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించి.. డెవలప్ చేస్తోంది. వరంగల్ నగరం అభివృద్ధి అయితే.. హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరు అభిప్రాయపడ్డారు.

అన్నివిధాలా అవకాశం..

తెలంగాణలోని ఇతర జిల్లాలతో పోలిస్తే.. వరంగల్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. హైదరాబాద్‌తో పోటీపడే అవకాశం కేవలం వరంగల్‌కే ఉంది. ఇక్కడ ట్రైన్ కనెక్టివిటి కీలకంగా మారింది. సౌత్, నార్త్ ఇండియాను కలిపే మార్గం వరంగల్ నుంచే వెళుతుంది. కాజీపేట జంక్షన్ మీదుగా ఢిల్లీ, ముంబయి వంటి నగరాలకు రైళ్ల రాకపోకలు సాగుతున్నాయి.

రోడ్లు..

వరంగల్ నుంచి ఎక్కడికైనా వెళ్లేలా రోడ్ల కనెక్టివిటీ ఉంది. ముఖ్యంగా వరంగల్ నుంచి హైదరాబాద్‌కు ఇప్పుడు కేవలం 2 గంటల్లో చేరుకోవచ్చు. అటు ఏపీలోని విజయవాడ, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు వరంగల్ నుంచి రోడ్డు మార్గాల ద్వారా త్వరగా చేరుకోవచ్చు. గత పదేళ్లలో ఊహించని స్థాయిలో రోడ్ల అభివృద్ధి జరిగింది. ఇది వరంగల్ నగర అభివృద్ధికి బాటలు వేస్తోంది.

నీరు, వనరులు..

చెరువులకు పెట్టింది పేరు వరంగల్ జిల్లా. ఇక్కడ కీలక ఇరిగేషన్ ప్రాజెక్టులు ఉన్నాయి. కాబట్టి నీటి కొరత అనే మాట లేదు. ఇక భూములు కూడా భారీగా ఉందుబాటులో ఉన్నాయి. ఏదైనా కంపెనీలు పెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చినా.. కీలకమైన భూమి, నీరు, కరెంట్ అందుబాటులో ఉన్నాయి. వరంగల్ నగరంలో ఏ స్థాయి వారైనా నివాసం ఉండటానికి అనుకూలంగా ఉంటుంది.

ఎయిర్‌పోర్ట్..

వరంగల్ నగరానికి రైలు, రోడ్డు మార్గాలు బలం అయితే.. ఎయిర్‌పోర్ట్ లేకపోవడం బలహీనంగా మారింది. అందుకే రేవంత్ సర్కారు మామునూరు విమానాశ్రయంపై ఫోకస్ పెట్టింది. దీన్ని మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇటీవల మంత్రి పొంగులేటి.. ఎయిర్‌పోర్ట్ భూసేకరణపై ఆరా తీశారు. భూసేకరణ పూర్తయితే పనులు ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. ఎయిర్ పోర్ట్ అందుబాటులోకి వస్తే.. రైలు, రోడ్డు, విమాన మార్గాలు అందుబాటులో ఉంటాయి.

ఏపీలో మాదిరిగా..

పొరుగున ఉన్న ఏపీలో రాజధాని విషయంలో గందరగోళ పరిస్థితులు ఉన్నా తెలంగాణలో అటువంటి సమస్య లేదు. కానీ.. ఏపీలో పెద్ద నగరాలు ఉన్నాయి. ముఖ్యంగా విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, గుంటూరు, కర్నూలు వంటి నగరాలు ఉన్నాయి. వాటిల్లో గుంటూరు మినహా.. అన్నిచోట్ల ఎయిర్‌పోర్ట్‌లు ఉన్నాయి. కానీ.. తెలంగాణలో పెద్ద నగరం అంటే కేవలం హైదరాబాద్ మాత్రమే ఉంది. వేరేచోట్ల ఎయిర్‌పోర్టులు కూడా లేవు. దీంతో సెకెండ్ క్యాపిటల్‌గా వరంగల్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది.

పొంగులేటి సమీక్ష..

రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా వరంగల్ నగర అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. వరంగల్ నగర అభివృద్ధిపై తాజాగా ఆయన సమీక్ష నిర్వహించారు. ఇన్నర్, ఔటర్ రింగు రోడ్లు, భద్రకాళి చెరువు అభివృద్ధి, విమానాశ్రయ నిర్మాణం తదితర అంశాలపై ఆయన చర్చించారు.

## జర్నలిస్టుల నిరసన

రంగారెడ్డి, డిసెంబర్ 13 : జల్ పల్లి ఫామ్ హౌస్ వద్ద సినీ నటుడు మోహన్ బాబు టీవీ9 జర్నలిస్టు రంజిత్ పై చేసిన దాడికి నిరసనగా రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు రాజేంద్రనగర్ సర్కిల్ పిల్లర్ నెంబర్ 143 నుండి ఆర్డిఓ కార్యాలయం వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో కు జర్నలిస్టులు వినతి పత్రం అందజేశారు.

మోహన్ బాబును వెంటనే అరెస్టు చేయాలని, గాయపడ్డ జర్నలిస్టుకు ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రభుత్వం కఠిన చట్టాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

==================

# మర్రి జనార్ధనరెడ్డికి భూదాన్ కేసు



మహబూబ్ నగర్, డిసెంబర్ 13 : తెలంగాణాలో భూదాన్ భూముల కేసు కొత్త మలుపు తిరుగుతోందా? స్కామ్ వెనుక అప్పటి బీఆర్ఎస్ నేతలున్నారా? మరో నలుగురికి ఈడీ ఎందుకు నోటీసులు ఇచ్చింది? బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డికి సంబంధమేంటి? ఇలా రకరకాల ప్రశ్నలు బీఆర్ఎస్ శ్రేణులను వెంటాడుతున్నాయి.తెలంగాణ భూదాన్ భూముల కేసులో తీగ లాగితే డొంక కదులుతోంది. ఈ స్కామ్‌లో అప్పటి కలెక్టర్ ఐఏఎస్ అమోయ్‌కుమార్ విచారించింది ఈడీ. ఆయన నుంచి విచారణ మొదలుపెట్టిన ఈడీ, దిగువస్థాయి అధికారులు ఆర్డీఓ, తహశీల్దార్ ఇలా అందర్నీ పిలిచి విచారణ చేపట్టింది. వారి నుంచి కీలక సమాచారం తీసుకుంది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్.వివరాలన్నీ క్రోడీకరించిన తర్వాత తాజాగా మరో నలుగురికి నోటీసులు జారీ చేసింది. వారిలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డితోపాటు మరో ఇద్దరు బిల్డర్లు ఉన్నారు. వారిలో వంశీరాం బిల్డర్స్ సుబ్బారెడ్డికి సైతం నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న విచారణకు హాజరుకావాలని అందులో ప్రస్తావించింది.ఆమోద డెవలపర్స్ కు చెందిన సూర్య తేజతో పాటు కేఎస్ఆర్ మైన్స్‌కు చెందిన సిద్దారెడ్డి ఇందులో లాభ పడినట్లు గుర్తించింది ఈడీ. ఈ వ్యవహారం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వీరి నుంచి సమాచారం తీసుకున్న తర్వాత మరికొందర్ని విచారణకు పిలిచే అవకాశమున్నట్లు వార్తలొస్తున్నాయి.రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో 50 ఎకరాల భూదాన్ భూమి అన్యాక్రాంతం కావడంపై విచారణ చేస్తోంది ఈడీ. సర్వే నెంబర్ 181, 182 లోని 100 ఎకరాల భూమిపై కొంతకాలంగా వివాదం నలుగుతోంది. అందులో 50 ఎకరాలు భూమిని భూదాన్ బోర్డుకు చెందినదిగా వాదిస్తోంది సంబంధిత బోర్డు.కాల క్రమేణా ఆ భూములు చేతులు మారుతూ వచ్చింది. చివరకు 2021లో హాజీఖాన్ వారసురాలిని తానేనంటూ ఖాదురున్నీసా అనే మహిళ దరఖాస్తు చేసుకోవడం, ఆమెపై భూములు రిజిస్ట్రేషన్ జరిగి పోవడం చకచకా జరిగిపోయింది. దీనివెనుక అప్పటి కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్, ఆర్ఐలు స్థాయి అధికారులంతా ఆమెకు అనుకూలంగా పని చేసినట్టు ఈడీ గుర్తించింది.అనేక మలుపులు తిరిగిన ఈ ల్యాండ్ వ్యవహారం చివరకు న్యాయస్థానం వరకు చేరింది. కోర్టు ఆదేశాలతో కేసు నమోదు అయ్యింది. దీని ద్వారా ఎవరెవరు లబ్ది పొందారు అనేదానిపై కూపీ లాగింది ఈడీ. ఆయా భూములు రియల్ ఎస్టేట్ కంపెనీల చేతికి వెళ్లినట్టు తేలింది.ఇందుకు భారీగా ఆర్థిక లావాదేవీలు జరగడంతో ఈడీ రంగంలోకి దిగేసింది. కలెక్టర్ మొదలు దిగువ స్థాయి అధికారులను పిలిచి విచారించిన విషయం తెల్సిందే. మాజీ ఎమ్మెల్యే జనార్ధన్‌రెడ్డితోపాటు రియల్ఎస్టేట్ బిల్డర్లను విచారిస్తే ఇంకెన్ని విషయాలు బయటపడతాయో? దీని వెనుక అసలు సూత్రధారులు బయటపడతారా, లేదా అనేది చూడాలి.

# ట్రెండింగ్ లో పవన్...

విజయవాడ, డిసెంబర్ 13 : పవన్ కళ్యాణ్.. ఈ పేరు వింటే తెలుగు సినీ ఇండస్ట్రీ, ఏపీ రాజకీయాలు షేక్ అవుతాయి. తాజాగా పవన్ పేరుతో గూగుల్ సెర్చ్ ట్రెండ్ మారుమోగుతోంది. ఏపీ, తెలంగాణ, ఇండియానే కాదు.. ఇతర దేశాల్లోనూ పవన్ గురించి సెర్చ్ చేస్తున్నారు. ఇప్పుడు ఈ విషయం వైరల్ అవుతోంది.గూగుల్ సెర్చ్ ట్రెండ్స్ ప్రకారం.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇంటర్నేషనల్ ఫిగర్ అయ్యారు. 2024లో ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా కొందరు వ్యక్తుల గురించి ఎక్కువగా గూగుల్‌లో సెర్చ్ చేశారు. నటులకు సంబంధించి అమెరికన్ హాస్యనటుడు మైకా కాట్ విలియమ్స్ తర్వాత పవన్ నిలిచారు.ఏపీ ఎన్నికల సమయంలో పవన్ చేసిన ప్రచారం, మేలో డిప్యూటీ సీఎంగా ఆయన నియామకం సందర్భంలో.. భారతదేశం, నేపాల్, కువైట్, యూఏఈ, ఖతార్‌లలో ఎక్కువమంది పవన్ గురించి సెర్చ్ చేశారు. ఇటీవల కాకినాడ ఓడరేవును సందర్శించినప్పుడు ఆయన చేసిన సీజ్ ద షిప్.. కామెంట్ విపరీతంగా ట్రెండ్ అయ్యింది.ఏపీలోని తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా డెల్టా, తెలంగాణలోని భద్రాచలం ప్రాంతాల్లో పవన్ గురించి ఎక్కుమంది సెర్చ్ చేశారు. ముఖ్యంగా పవన్ అప్ కమింగ్ మూవీ హరి హర వీర మల్లు టీజర్ విడుదల సందర్భంగా ఎక్కువమంది సెర్చ్ చేశారు.పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యాక.. 'పవన్ కళ్యాణ్ పోర్ట్‌ఫోలియో' ఏంటని గూగుల్‌లో ఎక్కువ సెర్చ్ జరిగింది. గూగుల్ ట్రెండ్స్



ప్రకారం.. పీకే మంత్రిత్వ శాఖకు సంబంధించి అత్యధికంగా శోధించారు.ఇండియాలో వినేష్ ఫోగట్, నితీష్ కుమార్, చిరాగ్ పాశ్వాన్, హార్దిక్ పాండ్యా గురించి ఎక్కువమంది సెర్చ్ చేశారు. వారి తర్వాత పవన్ కళ్యాణ్ గురించే గూగుల్‌లో ఎక్కువ సెర్చ్ జరగడం విశేషం.

==================

## రాజధాని అమరావతే

# చిక్కుముడులకు పరిష్కారం...

విజయవాడ, డిసెంబర్ 13 : ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణంలో సాంకేతికంగా ఉన్న చిక్కుముడులను కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తోంది. అమరావతి చుట్టూ అల్లుకున్న వివాదాలను పరిష్కరించేలా చర్యలు ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధానిగా అమరావతి మాత్రమే ఉంటుందని సుప్రీం కోర్టులో అఫిడవిట్ సమర్పించింది.అమరావతి నిర్మాణం చుట్టూ వైసీపీ ప్రభుత్వం సృష్టించిన న్యాయపరమైన వివాదాలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అమరావతి మాత్రమే ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా



పరిగణించడంతో పాటు రాష్ట్ర రాజధాని అమరావతిని కొనసాగించాలనే నిర్ణయానికి వచ్చినట్టు సుప్రీం కోర్టుకు వివరించింది. మూడు రాజధానుల నిర్ణయానికి వ్యతిరేకంగా ఏపీ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ జగన్ ప్రభుత్వం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే గత ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలైంది. దీంతో వివాదాన్ని ముగించాలని ఎన్డీఏ భావిస్తోంది.ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవిష్యత్తులో అమరావతికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పక్కాగా రాజధానిని ఖరారు చేసేలా అడుగులు వేస్తున్నారు. సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న వివాదాన్ని పరిష్కరించిన తర్వాత రాజధానిని సాధికారికంగా ప్రకటించేందుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది.రాజధాని మాస్టర్ ప్లాన్ అమలు చేయడంతో పాటు భూసమీకరణలో నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులకు చట్టపరంగా నెరవేర్చాల్సిన హామీ ప్రకారం అమరావతిని అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. రాష్ట్ర ప్రభుత్వ వైఖరితో గత ప్రభుత్వ దాఖలు చేసిన పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.రాజధాని నిర్మాణంతో పాటు రాజధాని ప్రాంత అభివృద్ధి. భూములుచ్చిన రైతులకు భాగంగా అభివృద్ధి చేసిన ప్లాట్లను అన్ని రకాల మౌలిక వసతులతో మూడేళ్లలో పూర్తి చేస్తామని సుప్రీం కోర్టుకు ఇచ్చిన అఫిడవిట్‌లో ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏపీ రాజధాని విషయంలో వైసీపీ ప్రభుత్వ నిర్ణయంపై ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పుతోపాటు, సుప్రీంకోర్టు జారీ చేసే ఆదేశాలకు కట్టుబడి ఉంటామని పేర్కొంది. రాజధాని విషయంలో నెలకొన్న సందిగ్ధతకు ముగింపు పలికేలా, ఇప్పటికే జరిగిన జాప్యం, నష్టాన్ని, రైతులు, రాష్ట్ర ప్రజల న్యాయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం కోర్టు ముందున్న స్పెషల్ లీవ్ పిటిషన్‌పై విచారణ ముగించాలని కోరింది.అమరావతి రాజధాని అంశానికి సంబంధించిన కేసుల విచారణ గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం 16 పేజీల అఫిడవిట్ దాఖలు చేసింది.సచివాలయం కోసం శాశ్వత భవనాలు సిద్ధమైన తరువాత ప్రస్తుతం ఉన్న భవనాలను ఇతర అవసరాల కోసం వినియోగిస్తామని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. హైకోర్టు న్యాయ మూర్తులు, మంత్రులు, అఖిలభారత సర్వీస్ అధికారులు, ఎమ్మె ల్యేలు, ఎమ్మెల్సీల నివాసాల కోసం 2018-19లోనే భవన నిర్మాణాలు ప్రారంభమయ్యాయని సీఎస్ వివరించారు.

ఏపీ ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌లో ఏముందంటే..

ఏపీ ప్రభుత్వం 2014లో ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి అథారిటీ చట్టాన్ని చేసి ఏపీసీఆర్డీఏని ఏర్పాటు చేసింది. గవర్నర్ ఆమోదముద్రతో ఆ చట్టాన్ని 2014 డిసెంబర్ 30న గెజిట్లో ప్రచురించారు. విజయవాడ, గుంటూరు నగరాల మధ్య కృష్ణా నదివెంబడి ఉన్న 24 రెవెన్యూ గ్రామాల్లో 53,748 ఎకరాల విస్తీర్ణాన్ని రాజధాని నగర ప్రాంతంగా గుర్తించి 2014 డిసెంబర్ 30న జీఓ ఎంఎస్ నం.254ను విడుదల చేశారు. సీఆర్డీఏ చట్టంలోని సెక్షన్ 3(3)ప్రకారం మొత్తం 122 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని రాజధాని ప్రాంతంగా గర్తించారు. ఆ తర్వాత 2015 జూన్ 9న విడుదల చేసిన జీఓ ఎంఎస్ నెం. 141లో రాజధాని ప్రాంతాన్ని 122 చ.కి.మీ.కి బదులుగా 217 చ.కి.మీలుగా సవరించారు. అమరావతి రాజధాని మాస్టర్ ప్లాన్ చట్టంలోని సెక్షన్ 39 ప్రకారం 2016 ఫిబ్రవరి 23న ప్రచురించింది. మాస్టర్ ప్లాన్?లో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కొన్ని హామీలు ఇచ్చింది. అమరావతిని కేవలం ప్రభుత్వ పరిపాలనా నగరంగానే కాకుండా ఆర్థిక కూడలిగా తీర్చి దిద్దుతామని రైతులకు హామీ ఇచ్చింది.

అమరావతిలో కనీసం లక్ష నుంచి 1.5 లక్షల మంది నివసించేలా ఒక్కోటి వెయ్యి ఎకరాల్లో 27 టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తామని ప్రణాళికలో పేర్కొన్నారు. ప్రతి టౌన్ షిప్ 250 ఎకరాల చొప్పున నాలుగు భాగాలుగా విభజించి అక్కడ నివాస ప్రాంతాలకు నడిచి వెళ్లేంత దూరంలో ప్రాథమిక పాఠశాల, షాపింగ్ ఉండేలా చూస్తామని వివరించారు. కృష్ణానదికి అభిముఖంగా సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ ఏర్పాటు చేసి, అక్కడ అన్ని ముఖ్యమైన కార్పొరేట్, ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్మెంట్స్ ఏర్పాటు చేయడానికి అవకాశం కల్పించాలని నిర్ణయించింది. 2016 ఫిబ్రవరి 23న ప్రకటించిన మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని అభివృద్ధి చేస్తుందని నవ నగరాల ఇతివృత్తంతో దశల వారీగా 2050 వరకు ఈ ప్రక్రియ సాగుతుందని సీఎస్ అఫిడవిట్‌లో వివరించారు. భవిష్యత్తులో ఎదురయ్యే అవసరాలు, అవకాశాలపై ఆధారపడి ఈ ప్రక్రియ కొనసాగుతుందని సుప్రీంకోర్టు ఇచ్చే తదుపరి ఆదేశాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంటుందని కూటమి ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో న్యాయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం కోర్టు ముందున్న ఎస్ఎల్పిపై విచారణ ముగించాలని కోరింది. ఈ పిటిషన్‌పై నేడు చీఫ్ జస్టిస్ విచారణ జరపునున్నారు.

# మళ్లీ జనసేన గూటికి అవంతి

విశాఖపట్టణం, డిసెంబర్ 13 : వైసీపీ నేత, మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ పార్టీకి రాజీనామా చేశారు. అయితే ఆయన రాజీనామా చేయడానికి బలమైన కారణాలు ఉన్నాయంటున్నారు. అందుకే పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారని తెలిసింది. అధికారం కోల్పోయిన తర్వాత అవంతి శ్రీనివాస్ ఆరు నెలల నుంచి కారణాల కోసం వెతుక్కుంటున్నారు. అయితే జగన్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా వైసీపీ అధినేత జగన్ ఆందోళనలకు పిలుపునివ్వడం తనకు నచ్చలేదని ఆయనచెప్పారు. అందులో నిజం లేదు. నిజానికి గతంలోనూ చంద్రబాబు అప్పటి వైసీపీ ప్రభుత్వంపై నెల రోజులు గడవక ముందే జనంలోకి వచ్చిన విషయాన్ని అవంతిశ్రీనివాస్ మర్చిపోయినట్లుంది. చెప్పిన కారణం కూడా ఎవరూ నమ్మేట్లు లేదు.అయితే తాను ఐదేళ్ల పాటు రాజకీయాలకు దూరంగా ఉంటానని అవంతి శ్రీనివాస్ చెప్పడం కూడా సత్యదూరమేనని అంటున్నారు. ఎందుకంటే ఆరు నెలల నుంచి ఆయన జనసేనలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు ప్రారంభించారంటున్నారు. 2014 ఎన్నికల్లో అవంతి శ్రీనివాస్ తెలుగుదేశం పార్టీ నుంచి పార్లమెంటు సభ్యుడిగా గెలిచారు. అంతకు ముందు ప్రజారాజ్యం పార్టీలోనూ ఆయన 2009 లో ఎమ్మెల్యేగా ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎన్నికయ్యారు. ముత్తం శెట్టి శ్రీనివాస్ ఇప్పుడు వైసీపీకి రాజీనామా చేయడానికి గల ప్రధాన కారణం త్వరలోనే జనసేనలో చేరేందుకు ఆయన సిద్ధమయ్యారని, జనసేన నాయకత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు చెబుతున్నారు. అవంతి శ్రీనివాస్ బలమైన రాజకీయనాయకుడు, ఆర్థికంగా, సామాజికపరంగా కూడా బలవంతుడు కావడంతో ఆయన చేరికకు ఎవరూ పెద్దగా అభ్యంతరం తెలిపే అవకాశం లేదు. టీడీపీలో చేరాలంటే అక్కడ గంటా బ్యాచ్ అడ్డంపడే అవకాశముంది. అదే జనసేనలో తనకు తిరుగుండదని అవంతి శ్రీనివాస్ లెక్కలు వేసుకున్నారు. తాను జనసేనలో చేరితే మరోసారి భీమిలి నియోజకవర్గం నుంచిగెలిచే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావిస్తున్నారు. కూటమి పార్టీల అభ్యర్థిగా తాను భీమిలీ టిక్కెట్ ను తెచ్చుకోగలిగితే గ్యారంటీ గెలుపు అని నమ్మకంతో ఉన్నారు. అందుకే ఆయన జనసేన నేతలకు దగ్గరగయ్యారంటున్నారు. త్వరలోనే ఆయన పవన్ కల్యాణ్ ను కూడా కలిసే అవకాశముందని తెలిసింది.



వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి విడత మంత్రివర్గంలో అవంతి శ్రీనివాస్ చోటు దక్కింది. అప్పుడు పార్టీ, అధినేత ఇద్దరూ మంచిగానే కనిపించారు. కానీ విస్తరణలో ఆయన మంత్రి పదవిని కోల్పోయారు. ఆయనకు విశాఖ లోనే గుడివాడ అమరనాథ్ పోటీ ఉన్నారు. వైసీపీలోనే కొనసాగితే తనకు పదవులు భవిష్యత్ లో రావన్న నమ్మకం ఆయనలో ఎక్కువయిందంటున్నారు. అదే సమయంలో ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను కాదని, శ్రీకాకుళం జిల్లా నుంచి బొత్స సత్యనారాయణను అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల కూడా అవంతి శ్రీనివాస్ అసంతృప్తిగా ఉన్నారని తెలిసింది. అప్పటి నుంచే పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉ ంటున్నారు. వైసీపీలో తనకు భవిష్యత్ లేదని భావించిన అవంతిశ్రీనివాస్ తన దారి తాను చూసుకున్నాడు.




# అమరావతికి భారీగా నిధులు

విజయవాడ, డిసెంబర్ 13 : అమరావతిని అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం పట్టుదలగా ఉంది. ముఖ్యంగా సీఎం చంద్రబాబుకు అమరావతి డ్రీమ్ ప్రాజెక్టు. కానీ.. నిధులు భారీగా అవసరం అవుతున్నాయి. దీంతో ప్రభుత్వం వివిధ సంస్థలు, బ్యాంకులను రుణాలు అడిగింది. తాజాగా ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ భారీగా రుణం మంజూరు చేసింది.అమరావతి అభివృద్ధికి సంబంధించి కీలక అప్‌డేట్ ఇది. అవును.. రాజధాని అభివృద్ధి కోసం ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు భారీగా నిధులు మంజూరు చేసింది. అమరావతిని గ్రీన్ అండ్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడానికి రుణం మంజూరు చేసినట్టు ఏడీబీ స్పష్టం చేసింది. మొత్తం 121.97 బిలియన్ల జపనీస్ యెన్‌లను మంజూరు చేసినట్టు ఏడీబీ వెల్లడించింది.రాజధాని నిర్మాణానికి నిధులను సమకూర్చుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. నిధులు సమకూర్చుకునేందుకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఈ నేపథ్యంలో.. వివిధ బ్యాంకుల నుంచి రూ. 15 వేల కోట్లు రుణం తీసుకునేలా వెసులుబాటు కల్పిస్తూ.. కేంద్రం బడ్జెట్‌లో ఆమోదం తెలిపింది. రూ. 15,000 కోట్లలో ప్రపంచబ్యాంకు, ఏడీబీ కలిసి రూ. 13,500 కోట్లను రుణంగా ఇస్తున్నాయి. మిగతా మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం సమకూర్చనుంది. రూ. 13,500 కోట్ల రుణాన్ని ఐదేళ్లపాటు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఐదేళ్ల తర్వాత చెల్లింపు మొదలవుతుంది. ఆరు నెలలకు ఒక వాయిదా చొప్పున 23 సంవత్సరాలపాటు రుణం చెల్లించాలి.ఈ నిధులతో ప్రభుత్వం కీలక పనులు చేపట్టనుంది. అమరావతి ప్రాంతాన్ని గ్రోత్ హబ్‌గా తీర్చిదిద్దడానికి, ఆ ప్రాంత వాసుల జీవన ప్రమాణాలు పెంచడానికి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి, ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు మేలు చేయడానికి, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఈ నిధులను ప్రభుత్వం వినియోగించనుంది.ఈ రుణం మంజూరుపై ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఇండియా కంట్రీ డైరెక్టర్ మియో ఓకా కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రీన్ ఫీల్డ్ నగరాలను అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయిస్తున్నట్టు వివరించారు. భవిష్యత్తులోను మరిన్ని నగరాల అభివృద్ధి జరగబోతోందని.. వాటికి అమరావతి రోల్ మాడల్‌లో మారబోతోందని వ్యాఖ్యానించారుగ్రీన్ అండ్ స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా.. ముఖ్యంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. పచ్చని ప్రదేశాలు ఉండేలా చూస్తారు. నీరు, పారిశుద్ధ్య సేవలు, తక్కువ కార్బన్ రవాణా సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తారు. వరద ప్రమాదాలను తగ్గించడానికి డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరుస్తారు. పెట్టుబడిదారులను తీసుకురావడంలో ప్రభుత్వానికి మద్దతు ఇస్తారు. ప్రైవేట్ పెట్టుబడిని సృష్టించి మహిళలు, యువతకు ప్రయోజనం చేకూర్చే కొత్త ఉద్యోగాలను సృష్టిస్తారు.

# అందుబాటులోకి లిక్కర్ ధరలు

ఏలూరు, డిసెంబర్ 13 : ఏపీలో కొన్ని బ్రాండ్ల మద్యం ధరల్ని తగ్గిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి పది రోజులు గడుస్తున్నా దుకాణాల్లో మాత్రం అమల్లోకి రాకపోవడంపై హెచ్‌టి తెలుగు కథనానికి ఎక్సైజ్ శాఖ స్పందించింది. తక్షణం కొత్త ధరల్ని అమలు చేయాలని ఆదేశించడంలో ధరలు తగ్గించుకున్న సంస్థలు మార్పులు చేశాయి. ఏపీ బేవరేజీస్ కార్పొరేషన్‌కు సరఫరా చేసే బాటిళ్లపై కొత్త ధరల్ని అంటించారు. మరో నెలరోజుల వరకు పాత ధరలతోనే కొనసాగాలని భావించినా ప్రజల్లో వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతో ధరల్ని సవరించారు. ఎక్సైజ్ శాఖ ఉత్తర్వుల్లో పాత స్టాక్ పూర్తయ్యే వరకు అని మెలిక పెట్టడంతో మరికొన్ని వారాల పాటు పాత ధరలతోనే అమ్ముకోవాలని అయా బ్రాండ్లు భావించాయి.ఆంధ్రప్రదేశ్ మద్యం ధరల తగ్గింపు ప్రకటనలో మతలబును ఎక్సైజ్ సరిచేసింది. మూడు ప్రధాన బ్రాండ్ల మద్యం ధరల్ని తగ్గిస్తూ కొద్ది రోజుల క్రితం ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో మద్యం ధరల్ని సవరించిన ప్రతి సందర్భంలో ధరల తగ్గింపు తక్షణం అమల్లోకి వస్తుందని ప్రకటించేది. అయితే ఇటీవల ఎక్సైజ్ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పాత స్టాక్ అమ్మకాలు పూర్తైన తర్వాత తగ్గింపు అమల్లోకి వస్తుందని అయా కంపెనీలకు





అనుకూలంగా మెలిక పెట్టింది. దీంతో మద్యం బాదుడు కొనసాగుతోంది. వైసీపీ హయంలో ఉన్న ధరలే ఇంకా కొనసాగుతున్నాయి.తెలుగు రాష్ట్రాల్లో అత్యధికంగా డిమాండ్ ఉ న్న మద్యం బ్రాండ్లలో కొన్ని బ్రాండ్లు తమ ధరల్ని తగ్గించుకున్నాయి. ఇందులో ప్రముఖ సినీనటుడి పేరుతో చలామణీలో ఉన్న బ్రాండ్ కూడా ఉంది. గత ఐదేళ్లలో ఏపీలో అన్ని రకాల మద్యం బ్రాండ్ల ధరల్లో 100 నుంచి 150శాతం పెరుగుదల నమోదైంది. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మద్యం అమ్మకాలు, ధరల దోపిడీపై టీడీపీ, జనసేన, బీజేపీలు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించాయి.తాము అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామని టీడీపీ, జనసేనలు ఎన్నికల్లో విస్తృతం ప్రచారం చేశాయి. ఈ క్రమంలో సినీ నటుడి బ్రాండ్‌గా ప్రచారంలో ఉన్న ఓ మద్యం కంపెనీ ధరల్ని తగ్గించుకుంటున్నట్టు ఎక్సైజ్ శాఖకు ప్రతిపాదనలు చేయడంలో వెంటనే అమోదించడం జరిగిపోయింది. అయితే ఆ ధరలు తగ్గింపు మాత్రం జనానికి చేరలేదు. రాష్ట్ర వ్యాప్తంగా మరికొన్ని వారాలకు సరిపోయే నిల్వలు ఏపీబీసీఎల్ గోదాముల్లో ఉంది.దుకాణాల్లో ఉ న్న స్టాక్ కూడా ధరలు తగ్గించి పది రోజులైనా తరిగిపోవడం లేదు. ప్రస్తుతం విక్రయిస్తున్న బాటిళ్లపై 2024 సెప్టెంబర్‌లో తయారైనట్టు లేబుల్స్ ఉన్నాయి. ఈ లెక్కలో నవంబర్ చివరి వారంలో ఎక్సైజ్ ఉత్తర్వులు జారీ అయ్యే వరకు డిస్టిలరీల్లో మద్యం ఉత్పత్తి జరిగి ఉంటుంది. అవన్నీ పూర్తిగా అమ్మే వరకు జనం పాత ధరలకే మద్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉండొచ్చని అంచనాదక్షిణాది రాష్ట్రాల్లో మద్యం విక్రయాలతో ఖజానా నింపుకోవచ్చని వైసీపీ హయంలో రుజువైంది. ఏపీలో మద్యం ధరలు గణనీయంగా పెంచడం ద్వారా రెవిన్యూ పెంచుకోవడంతో ఆ తర్వాత తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకల్లో కూడా మద్యం ధరలు పెరిగాయి. అయితే తమిళనాడులో మాత్రమే ఏపీతో పోలిస్తే కొద్దిగా ధరలు అధికంగా ఉన్నా కర్ణాటక, తెలంగాణల్లో ధరలు తక్కువే ఉన్నాయి.ఈ క్రమంలో కొత్తగా రూ.99 బ్రాండ్‌ను తీసుకొచ్చిన మిగిలిన బ్రాండ్ల ధరలను మాత్రమే పాత ధరలనే కొనసాగించింది. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. జనం జగన్ బాటలోనే చంద్రబాబు ప్రభుత్వం నడుస్తోందని గొణుక్కుంటూ మద్యం కొనుగోలు చేస్తున్నారు. దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. మద్యం ధరలపై ఇప్పటికే రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ నివేదిక రావడానికి ముందే ధరలు తగ్గుముఖం పట్టడం చర్చనీయాంశంగా మారింది. .రాష్ట్రంలో మద్యం ధరలను తగ్గించడానికి మూడు పాపులర్ కంపెనీలు ముందుకు వచ్చాయి. ప్రముఖ సంస్థల ప్రతిపాదనలకు ఎక్సైజ్ శాఖ వాటి ఆమోదం తెలిపింది. తగ్గించిన ధరలను అమల్లోకి తెస్తూ పది రోజుల క్రితం ఉత్తర్వులు విడుదల అయ్యాయి. ప్రస్తుతం దుకాణాల్లో పాత ఎమ్మార్పీలతో ఉన్న బాటిళ్లను ఆ ధరలకే విక్రయిస్తారు. కొత్తగా వచ్చే స్టాకును తగ్గించిన ధరలతో అమ్ముతారు. ఏపీలో గత ఐదేళ్లలో ప్రముఖ బ్రాండ్ల విక్రయాలకు అవకాశం ఉండేది కాదు. తాజాగా అన్ని బ్రాండ్లను విక్రయించుకోడానికి అనుమతిస్తున్నారు.ధరలు తగ్గిన బ్రాండ్లలో మాన్షన్ హౌస్ ఒకటి. ఏపీలో ప్రముఖ సినీనటుడి అభిమాన బ్రాండుగా గుర్తింపు ఉంది. 2019లో టీడీపీ ప్రభుత్వం గద్దె దిగే సమయానికి మాన్షన్ హౌస్ క్వార్టర్ రూ.110 ఉన్న మద్యాన్ని వైసీపీ హయంలో ఓ దశలో రూ.300కు విక్రయించారు. పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ధరలు తగ్గించి చివరకు రూ.220కు ఫిక్స్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అవే ధరలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మాన్షన్ హౌస్ బ్రాందీ క్వార్టర్ ధర రూ.220 నుంచి రూ.190కి తగ్గింది. అదే బ్రాండ్ హాఫ్ బాటిల్ ధర రూ.440 నుంచి రూ.380కి, ఫుల్ బాటిల్ ధర రూ.870 నుంచి రూ.760కి తగ్గించారు. 2019 జూన్ నాటికి మాన్షన్ హౌస్ 760 ఎంఎల్ బాటిల్ రూ.430 ఉండేది. వన్ లీటర్ బాటిల్ రూ.490కు విక్రయించేవారు.రాయల్ చాలెంజ్ సెలెక్ట్ గోల్డ్ విస్కీ క్వార్టర్ ధర రూ.230 నుంచి రూ.210కి తగ్గింది. ఇదే బ్రాండ్ ఫుల్ బాటిల్ ధర రూ.920 నుంచి రూ.840కి తగ్గించారు. యాంటిక్విటీ బ్లూ విస్కీ ఫుల్ బాటిల్ ధర రూ.1600 నుంచి రూ.1400కు తగ్గింది. ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు కాగితాలకే పరిమితం కావడంపైరాష్ట్ర వ్యాప్తంగా కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి.

కొత్త ధరలపై కొనసాగుతున్న ఉత్కంఠ?

ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆర్నెల్లు దాటింది. మద్యం ధరల తగ్గింపు మాటటుంచితే ప్రైవేట్ దుకాణాల ఏర్పాటుతో ప్రభుత్వ ఆదాయం కూడా కోల్పోయిందనే విమర్శలు ఉన్నాయి. మద్యం ధరలపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. త్వరలో ఈ కమిటీ అన్ని బ్రాండ్ల కంపెనీలతో చర్చించి ధరల సవరణపై సిఫారసు చేయనుంది. అందుకు అనుగుణంగా కొత్త ధరలు అమల్లోకి వస్తాయి. కమిటీ నిర్ణయించక ముందే కొన్ని బ్రాండ్లు రేట్లు తగ్గించుకుంటున్నాయి. మరో రెండు ప్రముఖ బ్రాండ్ల మద్యం ధరలు రెండు మూడు రోజుల్లో ధరలు తగ్గించనున్నాయి.హైకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో మద్యం ధరల సవరణ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ కమిటీ అన్ని కంపెనీలతో ధరల సవరణపై చర్చలు జరపనుంది. బాటిల్ తయారీకి ఎంత ఖర్చు అవుతుంది? ప్రభుత్వానికి వచ్చే ఆదాయంతో పాటు ఇతర రాష్ట్రాల్లో విక్రయిస్తున్న ధరలను పరిశీలించనుంది. ఏపీ, తెలంగాణలో విక్రయించే బ్రాండ్ల ధరల్లో భారీ వ్యత్యాసాలుంటే వాటిని ప్రశ్నించే అవకాశం ఉంది. ముందు జాగ్రత్తగా ధరలు తగ్గిస్తున్నాయని చెబుతున్నారు.

# కాపులకు ఫ్యాన్‌తో ఉక్కపోత... క్యూ కడుతున్న నేతలు



ఏలూరు, డిసెంబర్ 13 : వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు అధికారం దూరమయిన ఆరు నెలల్లోనే షాక్ ల మీద షాక్ లు తగులుతున్నాయి. ప్రధానంగా ఒక సామాజికవర్గం ఆయనకు దూరంగా వెళ్లిపోతుంది. తాజాగా ఈరోజు మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ పార్టీకి, ప్రాధమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. మరో కీలక నేత గ్రంథి శ్రీనివాస్ కూడా రాజీనామాకు రెడీ అయిపోయారు. అసలు వైసీపీలో ఏం జరుగుతుంది. ఎక్కడ లోపం ఉంది? ప్రధానంగా కాపు సామాజికవర్గం నేతలు ఫ్యాన్ పార్టీకి దూరమవుతున్నట్లే కనిపిస్తుంది. ఇక రాష్ట్రంలో భవిష్యత్ లేదని భావించిన కాపు సామాజికవర్గం నేతలు తమకు అధికారంలో ఉన్న ప్పుడు మంత్రి పదవులు కట్టబెట్టినా పార్టీకి రాజీనామా చేసి వెళ్లిపోతున్నారు. వారు రాజీనామా చేయడానికి గల కారణాలు కొత్తవి కాకపోయినప్పటికీ ఒకే సామాజికవర్గం దూరం కావడం జగన్ ఆలోచించాల్సిన విషయమే. ఇప్పటి వరకూ అనేక మంది నేతలు పార్టీకి రాజీనామా చేసి వెళ్లిపోయారు. వారిలో కాపు సామాజిక వర్గం నేతలే ఎక్కువగా ఉండటం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. తొలుత పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారు రోశయ్య పార్టీకిరాజీనామా చేశారు. తర్వాత అత్యంత నమ్మకమైన నేతగా ఉన్న జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కూడా పార్టీని వదిలి పెట్టి వెళ్లిపోయారు. ఈ ఇద్దరు నేరుగా జనసేనలో చేరారు. తర్వాత ఏలూరు నియోజకవర్గానికిచెందిన మాజీ మంత్రి ఆళ్ల నాని కూడా పార్టీకి ప్రాధమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తాజాగా అవంతి శ్రీనివాస్ కూడా రాజీనామా చేశారు. భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంథి శ్రీనివాస్ కూడా రాజీనామా లేఖతో సిద్ధంగా ఉన్నారు. వీరంతా కాపు సామాజికవర్గం నేతలే. గత ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచిన వారే. వీరిలో ఇద్దరికి మంత్రి పదవులు అప్పగించారు జగన్. ఆళ్ల నాని, అవంతి శ్రీనివాస్ లకు మంత్రి పదవులు తొలి విడతనే ఇచ్చారు. నిజానికి మరే పార్టీలో వీరికి మంత్రి పదవి దక్కుతుందన్న ఆశ కూడా లేని పరిస్థితుల్లో జగన్ కేబినెట్ లో చోటు కల్పించారు. కొన్నేళ్ల నుంచిరాజకీయాల్లో ఉన్నా లబించని మంత్రి పదవిని దక్కినా కనీసం ఆ ఆలోచన లేకుండా నేతలు పార్టీని వీడి వెళ్లి పోవడం ఒకరకంగా చర్చనీయాంశమైంది. ఎందుకంటే మంత్రి పదవి ఇప్పుడు వేరే పార్టీలో చేరినా రాదని తెలిసినా రాజీనామాలు చేశారంటే బలమైన కారణాలు ఉంటాయని వేరే చెప్పాల్సిన పనిలేదు. ఆంధ్రప్రదేశ్ లో కాపు సామాజికవర్గం ఓటర్లు ఎక్కువ. జనసేన, టీడీపీ, బీజేపీ కలిసి పోటీ చేస్తే వైసీపీ నుంచి గెలవడం తమకు కష్టమని వారు భావిస్తున్నారు. తాము ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాల్లోనూ కాపు సామాజికవర్గం ఓటర్లు ఎక్కువగా ఉండటంతో వైసీపీలో ఉంటే రాజకీయ భవిష్యత్ లేదని భావించారు. మరోసారి ఇక్కడి నుంచి గెలవలేమని కూడా వారు బలంగా నమ్ముతున్నారు. అందుకే తమకు మంత్రి పదవి ఇచ్చినా తమ రాజకీయాలు సుదీర్ఘకాలం కొనసాగాలంటే వైసీపీకి దూరంగా ఉంటేనే మంచిదన్న అభిప్రాయానికి వారు వచ్చినట్లు కనపడుతుంది. జనసేన + టీడీపీ ఓటు బ్యాంకుతో తమకు టిక్కెట్ దొరికితే మంచిభవిష్యత్ ఉంటుందని భావిస్తున్నారు.మరో వైపు వచ్చే ఎన్నికల నాటికి నియోజకవర్గాల సంఖ్య కూడా పెరుగుతుండటంతో కాపు సామాజికవర్గం నేతలు ఎక్కువగా కూటమి పార్టీ వైపు చూస్తున్నారు. అటు టీడీపీ కానీ, ఇటు జనసేనలో కానీ కొత్త నియోజకవర్గాల్లోనైనా తమ అదృష్టాన్ని పరీక్షించుకోదలచుకుంటున్నారు. అందుకేజగన్ కు ఝులక్ఇచ్చిమధ్యలోనే వదిలేసి వెళ్లిపోతున్నారు. జగన్ వైఖరితో విసుగెత్తిన నేతలు పార్టీని వదిలివెళ్లిపోతున్నారన్న వాదనలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. ఓటమి పాలయినా నేతలతో కలవకుండా ఉండటం, ఏకపక్షనిర్ణయాలను తీసుకోవడం నచ్చక జెండాను పక్కన పడేసి వెళుతున్నారని చెబుతున్నారు. ఏ పార్టీ అధినేత అయినా స్థానికనాయకత్వం అభిప్రాయాలను తెలుసుకోవాలి. అంతే తప్పతన అభిప్రా?యాలను బలవంతంగా రుద్దితే ఇదే పరిస్థితి ఎదురవుతుంది. దీంతో పాటు ఐదేళ్ల కాలంలో జగన్ పర్యటనలు,జగన్ పిలుపు నిచ్చే కార్యక్రమాలకు చేతి చమురు వదిలించుకోవడం మినహా ప్రయోజనం ఉండదని భావించిన నేతలు ఫ్యాన్ పార్టీకి గుడ్ బై చెబుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎలాగున్నా,కనీసం లేనప్పుడైనానేల మీదకు చూస్తే, నేతలకు అందుబాటులోకి వస్తే ఒకింత నేతలకు ఇబ్బంది ఉండదు. కానీ తీరుమారకుంటే వీరే కాదు రానున్నకాలంలో మరింత మంది కూడా వైసీపీకి బై బైచెప్పే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రధానంగా కాపు సామాజికవర్గం నేతలు జగన్ పార్టీకి దూరమవుతారని జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

==============================

# ఆగని అతుల్ ఆత్మహత్య కేసు లొల్లి.. దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న మెన్ టూ

లక్నో, డిసెంబర్ 13 : దేశవ్యాప్తంగా విడాకులు తీసుకుంటున్న జంటల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. అయితే, వీరిలో కొన్ని జంటలు ఇద్దరి మధ్య పూర్తి అవగాహనతో, ఒకరినొకరు గౌరవించుకుంటూ విడాకుల ప్రక్రియను పూర్తిచేసుకుంటున్నాయి. కానీ, కొన్ని జంటల మధ్య ఈ వ్యవహారం తీవ్ర వివాదానికి దారితీస్తుంది. ముఖ్యంగా ఘర్షణ వాతావరణంలో పురుషుల నుండి విడిపోయిన మహిళలకు వరకట్న వేధింపుల చట్టం ఆయుధంగా మారుతుందా.. ఈ చట్టం ఎక్కువ శాతం దుర్వినియోగం అవుతోందా? అనే వాదన తెరపైకి వస్తుంది. ఈ క్రమంలో తాజాగా బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ అతుల్ సుభాష్ ఉదంతంపై దేశవ్యాప్తంగా తీవ్ర చర్చ జరుగుతుంది. తన ఆత్మహత్యకు ముందు అతుల్ 23 పేజీల సూసైడ్ నోట్ తో పాటు



ఓ వీడియోను విడుదల చేశాడు. అందులో అతను ఆత్మహత్యకు గల కారణాలను వెల్లడించాడు. ఈ ఉదంతం ప్రస్తుతం సోషల్ మీడియాలో పెను సంచలనం సృష్టిస్తుంది. మెన్ టూ అనే హ్యాష్‌ట్యాగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.యూపీకి చెందిన అతుల్ సుభాష్ సాఫ్ట్ వేర్ ఉద్యోగి. ఓ ఐటీ కంపెనీలో డైరెక్టర్ గా పనిచేస్తూ మారతహళ్లిలోని మంజునాథ లేఅవుట్లో ఉంటున్నాడు. అతనికి నిఖితా సింఘానియాతో పెళ్లైంది. నాలుగేళ్ల కుమార్తె ఉంది. అతుల్ తో గొడవపడి కొంతకాలం క్రితం తన భార్య యూపీలోని తన పుట్టింటికి వెళ్లింది. ఆ తరువాత భర్తపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో వారిద్దరి వివాదం తీవ్రమైంది. తన అత్త కట్నం కోసం వేధించినట్లు, నా భర్త మద్యం తాగి వచ్చి నన్ను కొట్టేవాడని, నన్ను పశువులా చూసేవాడని, నన్ను బెదిరించి జీతం మొత్తం తన ఖాతాలోకి బదలాయించుకునేవాడని తన ఫిర్యాదులో పేర్కొంది. మొత్తం తన భర్తపై తొమ్మిది కేసులు నమోదయ్యాయి. అయితే, అతుల్ తన సూసైడ్ లేఖలో ఇలా వ్రాశాడు.. "నాపై వచ్చిన వచ్చిన ఆరోపణలు చాలా హాస్యాస్పదంగా ఉంది. నేను నా భార్య నికితా సింఘానియా, ఆమె కుటుంబం నుంచి రూ. 10లక్షల కట్నం డిమాండ్ చేశానట.. నా భార్య ఇంటి నుంచి వెళ్లినప్పుడు నా సంపాదన ఏడాదికి రూ. 40లక్షలు అని, తరువాత ఏడాదికి రూ. 80లక్షలు సంపాదిస్తున్నానని చెప్పింది. రూ. 80లక్షలు సంపాదించే వ్యక్తి రూ. 10లక్షలు డిమాండ్ చేసి భార్యాపిల్లలను వదిలేస్తారా" అంటూ అతుల్ ప్రశ్నించాడు.అతుల్ తన లేఖలో న్యాయస్థానంపైనా ఆరోపణలు చేశాడు. భరణం ఇవ్వలేకపోతే చచ్చిపోవచ్చు అని న్యాయస్థానంలో జడ్జి ఎదుటే భార్య అతడిని అనడం, దానికి న్యాయమూర్తి నవ్వడంతో సుభాష్ ను తీవ్రగా బాధించింది.

తనను వేధించిన వారిని శిక్షించే వరకు తన ఎముకలను దహనం చేయొద్దని అతుల్ లేఖలో డిమాండ్ చేశాడు. అవినీతికి పాల్పడిన న్యాయమూర్తి, నా భార్య, ఇతర వేధింపులు దోషులు కాదని కోర్టు నిర్ణయిస్తే, తన బూడిదను కోర్టు వెలుపల ఒక గాడిలో వేయాలని అతుల్ తెలిపాడు. ఇలా వేధించే వారికి కోర్టు సుదీర్ఘకాలం శిక్షలు వేయాలని, తన భార్య లాంటి వాళ్లను జైలుకు పంపకపోతే ఇలాంటి వాళ్లకు ధైర్యం పెరిగి భవిష్యత్తులో సమాజంలోని ఇతరులపై మరిన్ని తప్పుడు కేసులు పెడతారని అతుల్ తనలేఖలో ప్రస్తావించాడు. తాజాగా అతుల్ బంధువు ఓ మీడియా ఛానెల్ తో మాట్లాడుతూ.. నా సోదరుడికి న్యాయం జరగాలని నేను కోరుకుంటున్నా.. పురుషులకు కూడా ఈ దేశంలోని చట్ట ప్రక్రియ నుంచి న్యాయం అందాలి. న్యాయమూర్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అవినీతి కొనసాగితే ప్రజలకు న్యాయం ఎలా జరుగుతుంది. మెల్లగా న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. తాము ఏటీఎం యంత్రాల వలే మారిపోతామనే భావనతో పెళ్లిళ్లు అంటేనే పురుషులు భయపడే పరిస్థితి దారితీస్తుందని వ్యాఖ్యానించాడు అతుల్ సుభాష్ ఆత్మహత్య కేసుపై చర్చ జరుగుతున్న వేళ "భరణం మంజూరులో పరిగణలోకి తీసుకోవాల్సిన కీలకమైన ఎనిమిది పాయింట్ల ఫార్ములా'ను సుప్రీంకోర్టు ప్రకటించింది. ఓ కేసు విచారణలో జస్టిస్ విక్రమ్, జస్టిస్ ప్రసన్న బి వరాల ధర్మాసనం వీటిని వెల్లడించింది. ఇరు పక్షాల ఆర్థిక, సామాజిక హోదాలను పరిగణలోకి తీసుకోవాలని, భార్యాబిడ్డల అవసరాలు, ఇరుపక్షాల విద్యార్హతలు, ఉద్యోగ హోదాలు, కేసు వేసిన వ్యక్తి సొంత సంపాదన, ఆస్తులు, వివాహ బంధంలో ఉన్న వేళ ఆ మహిళ అనుభవించిన జీవన ప్రమాణాలు, కుటుంబ బాధ్యతలకోసం వదులుకొన్న ఉపాధి అవకాశాలు, భర్త ఆర్థిక సామర్థ్యం, సంపాదన, నిర్వహణ ఖర్చులు, అప్పులను పరిగణలోకి తీసుకోవాలని ఇతర కోర్టులకు అత్యున్నత న్యాయస్థానం సూచించింది. అయితే, తాజాగా న్యాయస్థానం సూచనలతో వరకట్నం వేధింపుల చట్టం కింద పురుషులకు ఎంత మేరకు ఉపశమనం లభిస్తుందనే అంశంపైనా చర్చ జరుగుతుంది.

# మౌనికకు మద్దతుగా దిగనున్న అఖిల





కర్నూలు, డిసెంబర్ 13 : మంచు కుటుంబంలో ఏర్పడిన వివాదాలు అది వారి కుటుంబ సమస్య నుంచి ఇంకా పెద్దగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే మోహన్ బాబు మనోజ్ భార్య భూమా మౌనికతో పాటు పిల్లలను ఈ విషయంలోకి తీసుకు వచ్చారు. అంతే కాదు మనోజ్, మౌనిక దంపతులకు అన్యాయం జరుగుతోందన్న అభిప్రాయం భూమా వర్గీయుల్లో ఏర్పడటం సహజమే. అందుకే భూమా వర్గం ఈ విషయంలో ఇన్వాల్వ్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది. మంచు మనోజ్ భార్య భూమా మౌనిక ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్నది. భూమా నాగిరెడ్డి, భూమా శోభా నాగిరెడ్డి అంటే రాష్ట్రంలో పేరున్న నేతలు నాగిరెడ్డి అనారోగ్యంతో శోభానాగిరెడ్డి ప్రమాదంలో చనిపోవడంతో చిన్న వయసులోనే భూమా అఖిలప్రియ రాజకీయాల్లోకి రావాల్సివచ్చింది. తండ్రి ఉన్నప్పుడు తండ్రి చాటున రాజకీయం చేసినా తర్వాత తండ్రి వర్గాన్ని నడిపించడంలో సక్సెస్ అయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన ఓ భూవివాదంలో ఆమె కొంత మంది ప్రముఖుల్ని కిడ్నాప్ చేయించారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ కేసులో జైలుకు కూడా వెళ్లారు.అయితే భూమా అఖిలప్రియ ఎప్పుడూ తగ్గలేదు. తన తండ్రిని మరిపించే రాజకీయాలు చేస్తున్నారు. భూమా అఖిలప్రియ సోదరి మౌనిక. అఖిలప్రియ కోసం మౌనిక రాజకీయ ప్రచారం కూడా చేస్తారు. ఇప్పుడు తన సోదరికి మెట్టినింట్లో అన్యాయం జరుగుతోందంటే ఆమె ఖచ్చితంగా రంగంలోకి దిగుతారని అనుకోవచ్చు. ఇప్పటి వరకూ వారి ఫ్యామిలీ ఇష్యూను వారు పరిష్కరించకుంటారని.. తాము జోక్యం చేసుకుంటే ఇంకా ఎక్కువ సమస్యలు వస్తాయని సైలెంట్ ఉన్నారు. కొంత మంది భూమా వర్గీయుల్ని మాత్రం.. మనోజ్ ఇంటి వద్ద సెక్యూరిటీగా ఉండేందుకు పంపారని అంటున్నారు. ఇప్పుడు వివాదం ముదరడంతో ఇక నేరుగా ఫ్యాక్షన్ స్టైల్లో మోహన్ బాబు ఫ్యామిలీతో భూమా వర్గం డీల్ చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మంచు మనోజ్ ఇప్పటికి తాము ఆత్మగౌరవ పోరాటం చేస్తున్నామని అంటున్నారు. తన భార్య, బిడ్డల రక్షణ కోసమే మాట్లాడుతున్నానని .. పోరాటం చేస్తున్నానని చెబుతున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు ఆయన నుంచి గెంటేశారు. ఈ సమయంలో ఆయన వెనక్కి తగ్గలేరు. తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యే అవకాశం ఉంది.తన భార్య తరపున పొలిటికల్.. ఫ్యాక్షన్ వర్గం పవర్ ను వాడుకుంటే మోహన్ బాబు ఫ్యామిలీకి చాలా సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇలాంటి సమస్యలు ఉన్నాయన్న భయం పోలీసులకు ఆయన రాసిన లేఖలో స్పష్టమయిందని అనుకోవచ్చు. మొత్తంగా కుటుంబ గొడవలు ఫ్యాక్షన్ వైపు వెళ్తే మరింత సంచలనం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## అల్లు అర్జున్ అరెస్ట్ పైన కేటీఆర్ స్పందన

హైదరాబాద్, డిసెంబర్ 13 : అల్లు అర్జున్ అరెస్టు వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును చేసిన అతిని ఖండిస్తున్నానని బీఆర్ఎస్ నేత కేటీఆర్ అన్నారు. జాతీయ అవార్డు గెలుచుకున్న స్టార్ అల్లు అర్జున్ అరెస్టు పాలకుల అభద్రతాభావానికి తార్కాణం. తొక్కిసలాట బాధితుల పట్ల నాకు పూర్తి సానుభూతి ఉంది, కానీ అసలు తప్పు ఎవరిది? నేరుగా ఆయనకు సంబంధం లేని అంశంలో అల్లు అర్జున్ ని సాధారణ నేరస్తుడిలా పరిగణించడం సరైంది కాదని అన్నారు.

# చొప్పదండి ఎక్స్ లెంట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో స్పెషల్ అడ్మిషన్ డ్రైవ్

## చొప్పదండి మండల కో ఆర్డినేటర్ భక్తు విజయ్ కుమార్



చొప్పదండి, డిసెంబర్ 13 : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల కేంద్రంలో అధ్యయన కేంద్రం ఎక్స్ లెంట్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో స్పెషల్ అడ్మిషన్స్ డ్రైవ్ జరుగుతున్నాయని ఓ ప్రకటనలో చొప్పదండి మండల కో ఆర్డినేటర్ భక్తు విజయ్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ ఒకే సంవత్సరంలో చొప్పదండి మండల కేంద్రంలోని ఎక్స్ లెంట్ హై స్కూల్ లో ఓపెన్ టెన్త్,ఓపెన్ ఇంటర్ అడ్మిషన్స్ జరుగుతున్నాయని తెలిపారు. పదవ తరగతి,ఇంటర్ చదవలేకపోయామని బాధపడుతున్న వారికీ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ ప్రవేశల కోసం 11-12-2024 వరకు జరుగుచున్నాయని తెలిపారు.ఈ సర్టిఫికెట్ పై చదువులకు, ప్రమోషన్స్ కి అర్హులు. చదువుకునే వారికీ సువర్ణ అవకాశం కల్పించబడిందని తెలిపారు.౹౦ా౮ కి 1.ఫోటో, ఆధార్ కార్డు, ౧౮ ఒరిజినల్, క్యాస్ట్, సెల్ నంబర్, 2.ఇంటర్ కి ఫోటో, ఆధార్, ౹౦ా౮ మెమో, క్యాస్ట్, సెల్ నెంబర్ కావాలని తెలిపారు.పూర్తి సమాచారం కోసం ఎక్స్ లెంట్ హై స్కూల్ 9848947288 ,9652608597 నంబర్ లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ భక్తు విజయ్ కుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారని తెలిపారు.

# మహిళాసంఘం ఆర్పీలను అడ్డుకొని పోలీస్ స్టేషన్ కు తరలింపు..

జమ్మికుంట, డిసెంబర్ 13 : కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని మున్సిపల్ పరిధిలో గల మహిళా సంఘం మున్సిపల్ ఆర్పి లను శుక్రవారం ఉదయం 6 గంటలకు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించిన జమ్మికుంట పోలీసులు, వివరాల్లోకి వెళితే శుక్రవారం రోజున ఆర్పీల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మానుకోట సునీత, ఆదేశాల మేరకు శుక్రవారం రోజున హైదరాబాదులోని అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు, మహిళా సంఘాల ఆర్ పి లు సభ్యులు 30 మందితో కలిసి ముట్టడికి బయలుదేరు సమయంలో జమ్మికుంట పోలీసులు వీరిని అడ్డుకొని శాంతి భద్రతల దృష్ట్యా



ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ మహిళా సంఘాల ఆర్పీలను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు, ఈ సందర్భంగా మహిళా సంఘాల ఆర్పీలు, ఎండి ఆబేధాబాను, మాట్లాడుతూ గత కొద్ది కాలంగా చాలీచాలని 6000 రూపాయల జీతంతో ఉదయం 8 గంటలకు మొదలుకొని రాత్రి 8 గంటల వరకు కష్టపడుతున్నామని మా కష్టాన్ని ఎవరు గుర్తించడం లేదని గత ఏడు నెలలుగా మాకు జీతాలు రాలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇట్టి విషయాన్ని గ్రహించి మాకు 20,000 జీతంతో పాటు ఉద్యోగ భద్రతపై ఇన్సూరెన్స్, డ్రెస్ కోడ్ ఐడి కార్డులు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు, లేని క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాల ఆర్పీలమంతా ఏకమై నిరసనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల ఆర్పీలు టీ .దేవేంద్ర, పి రజిత, కే రజిత, అభేదాభాను, కే విజయలక్ష్మి, కే లత, ఎండి అర్షియా అంజుమ్, కే శారద, పి ఉమాదేవిలతో 30 మంది మహిళా ఆర్పీలు పాల్గొన్నారు.

# మంత్రుల పర్యటనను విజయవంతం చేయండి: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

వరంగల్ బ్యూరో(భారత శక్తి)డిసెంబర్13నేడు భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ, గణపురం మండలాలతో పాటు భూపాలపల్లి పట్టణంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ పర్యటించనున్నారని, ఇట్టి పర్యటనను విజయవంతం చేయాలని లిభూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావులి అన్నారు.

శుక్రవారం భూపాలపల్లిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూపాలపల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన, వంద పడకల ఆసుపత్రిలో రివ్యూ, అంబేద్కర్ సెంటర్ లో ప్రజా పాలన విజయోత్సవ సభ(పబ్లిక్ మీటింగ్) కు మంత్రులు రానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్ మంత్రులిద్దరి షెడ్యూల్ ను మీడియాకు వివరించారు.

– ఉదయం 11 గంటలకు మంత్రులిద్దరూ హైదరాబాద్ లోని బేగంపేట ఎయిర్ పోర్టు నుండి ప్రత్యేక చాపర్ లో బయలుదేరుతారు.

– ఉదయం 11:40 గంటలకు రేగొండ మండలం రామన్నగూడెం గ్రామ శివారులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన హెలీ ప్యాడ్ వద్ద దిగి, అక్కడి నుండి మధ్యాహ్నం 12 గంటలకు భాగిర్థిపేట ఆర్చి వద్ద రూ.50 కోట్లతో ఏర్పాటు చేసిన బుద్ధారం – కొడవటంచ గ్రామం వరకు బీటీ డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

– మధ్యాహ్నం 12:15 గంటలకు భూపాలపల్లిలో రూ.15 కోట్లతో 50 పడకల ఆయూష్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన



చేయనున్నారు.

– మధ్యాహ్నం 12:30 గంటలకు రూ.130 కోట్లతో మెడికల్ కాలేజీ బిల్డింగ్ కాంప్లెక్స్ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

– మధ్యాహ్నం 12:45 గంటలకు రూ.13 కోట్లతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 3వ అంతస్తులో గదుల నిర్మాణం పనులకు శంకుస్థాపన అనంతరం మొగుళ్ళపల్లి మండలానికి 108 అంబులెన్స్ ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే డాక్టర్లతో రివ్యూ మీటింగ్ నిర్వహిస్తారు.

– మధ్యాహ్నం 1:30 గంటలకు రూ.4 కోట్లతో భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్ నుండి కేటీకే 2 ఇంక్లైన్ వరకు బీటీ రోడ్డు మరియు సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

– మధ్యాహ్నం 1:45 గంటలకు భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్ లో ప్రజా పాలన విజయోత్సవ సభ(పబ్లిక్ మీటింగ్)లో పాల్గొంటారు. అనంతరం అక్కడి నుండి బయలుదేరి హైదరాబాద్ కు వెళ్లనున్నారు.

కావున, ఇట్టి కార్యక్రమాలన్నింటిలో కాంగ్రెస్ శ్రేణులు, అధికారులు, మీడియా మిత్రులు పాల్గొని సక్సెస్ చేయాలని ఎమ్మెల్యే కోరారు.

# సమగ్ర శిక్ష అభియాన్లో పనిచేస్తున్న వారందరిని విద్యాశాఖలో విలీనం చేయాలి: సంఘం నాయకులు శ్రీధర్,మనోజ,ఆనందం



భారతశక్తి ప్రతినిధి, హనుమకొండ, డిసెంబర్ 13:వరంగల్,హన్మకొండ జిల్లాల సమగ్ర సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు ఏకశిలా పార్కులో గత మూడు రోజులు నుండి రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు.సమగ్ర శిక్ష అభియాన్ నందు వివిధ విభాగాల ఎంఆర్సి,కేజీబివి, యూఆర్ఎస్,స్కూల్ కాంప్లెక్స్ లలో పనిచేయుచున్న కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ సమ్మెలో పాల్గొని నిరసనను తెలియజేస్తున్నారు.ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకులు శ్రీధర్,మనోజ,ఆనందం మాట్లాడుతూ ఆరు ఏడు ఎనిమిది తేదీలలో నిరసన దీక్షలు చేసినప్పుడు గవర్న మెంట్ నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో నిరవధిక సమ్మె చేస్తున్నామని తెలిపారు.గత కొన్ని సంవత్సరాలుగా సమగ్ర శిక్ష అభియాన్ నందు కాంట్రాక్టు విధానంలో విధులు నిర్వహిస్తున్నామని ఉన్నత చదువులు చదివి రూల్ ఆఫ్ రిజర్వేషన్ రోస్టర్ పాయింట్స్ కలిగి డిస్టిక్ కమిటీ సెలక్షన్ కమిటీ ద్వారా నియమితులయ్యారని తెలిపారు.గత సంవత్సరం సమ్మె కాలంలో టీపీసీసీ అధ్యక్షులుగా ఉన్న రేవంత్ రెడ్డి మా సమ్మె శిబిరానికి వచ్చి మాకు హామీ ఇచ్చారు.కాంగ్రెస్ గవర్నమెంట్ తీసుకు వస్తే మీ సమస్యలను ప్రజాదర్బార్లలో కూర్చోబెట్టి మీకు జీవోలు ఇచ్చి పంపిస్తామని తెలియజేశారన్నారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మమ్మల్ని రెగ్యులరైజ్ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వరంగల్ హనుమకొండ జిల్లాల అధ్యక్షులు ధోనికేన శ్రీధర్, మహమ్మద్ షఫీ ప్రధాన కార్యదర్శి కరుణశ్రీ,ముఖ్య సలహాదారులు నర్మెట యాదగిరి,గౌరవ అధ్యక్షులు సిద్దాల ఆనందం,డిపిఓ స్టాప్ చేరాలు,మొగసాని శంకర్ ఉపాధ్యక్షురాలు జ్యోతి మనోజ,శ్రీనివాస్,స్వాతి, తడుగుల రాజు,సమగ్ర శిక్ష ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వేను పూర్తి చేయాలి:జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య

హనుమకొండ ప్రతినిధి(భారత శక్తి)డిసెంబర్13:ఈ నెలాఖరు లోగా ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వేను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య సర్వే అధికారులకు ఆదేశించారు.శుక్రవారం హసన్పర్తి మండలంలోని భీమారం, పెంబర్తి గ్రామాలలో సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూమి ఉండి గృహ నిర్మాణం కోసం సమగ్ర సర్వే ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా సర్వే నిర్వహిస్తున్న ప్రత్యేక బృందాల పనితీరును, లబ్ధిదారుల వివరాలను పొందుపరచు తీరును సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు గృహ నిర్మాణానికి అవసరమైన స్థలంతో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డును పరిశీలించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. రేషన్ కార్డు లో తప్పనిసరిగా లబ్ధిదారుల పేరును ఉండేలా చూడాలని తెలిపారు. అదేవిధంగా సర్వేలో పూర్తిగా సేకరించిన లబ్ధిదారుల వివరాలను యాప్ ద్వారా నమోదు చేయాలన్నారు.ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే త్వరితగతిన పూర్తయ్యేలా తగిన ప్రణాళికలు రూపొందించాలని సర్వే అధికారులను ఆదేశించారు. నమోదు ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. దరఖాస్తుదారులు ఒకచోట



నివసిస్తూ ఉండి వారికి వేరొక ప్రదేశంలో స్థలం ఉన్నట్లయితే అటువంటి దరఖాస్తులను తీసుకొని వివరణలో తగిన వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతి దరఖాస్తు వివరాలు యాప్ లో నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, 2 బిహెచ్కెనోడల్ అధికారి రాజేంద్రప్రసాద్, తహసిల్దార్ ప్రసాద్, మండల అభివృద్ధి అధికారి ప్రవీణ్, ఎంపిఓ కరుణాకర్ రెడ్డి, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ పై ముష్కరుల దాడిలో వీరమరణం పొందిన అమరులకు నివాళులు: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



భారతశక్తి ప్రతినిధి, హనుమకొండ, డిసెంబర్ 13:పాకిస్థాన్ ప్రేరేపిత తీవ్రవాదుల దాడిలో అసువులు బాసిన అమరవీరులకు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఘనంగా శుక్రవారం నివాళులర్పించారు.పాకిస్థాన్ ఐఎస్ఐ ప్రేరేపిత తీవ్రవాదులు 2001లో డిసెంబర్ 13వ తేదీ పార్లమెంటుపై దాడికి తెగబడిన విషయం తెలిసిందే.ఆ ముష్కరుల దాడిలో ప్రాణాలర్పించిన పార్లమెంట్ ఉద్యోగులు,భద్రతా సిబ్బందికి ప్రతిఏటా ఇదే రోజున వారి త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ శ్రద్ధాంజలి ఘటిస్తారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర శుక్రవారం ఉదయం పార్లమెంట్ ఆవరణలో అమరవీరుల స్మృతి చిహ్నం వద్ద పూలుజల్లి ఘనంగా నివాళులర్పించారు,వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.

# అసైన్మెంట్ భూములను పట్టా భూములుగా మార్చిన తాసిల్దార్లపై ఏసీబీ దాడులు నిర్వహించాలి : సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, డిసెంబర్ 13: అసైన్మెంట్ భూములను పట్టా భూములుగా మార్చిన తాసిల్దార్లపై ఏసీబీ అధికారులు దాడులు చేసి చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గడపగడపకు సిపిఎం పార్టీ చేసిన ప్రచారంలో భాగంగా తమ దృష్టికి చాలా విషయాలు వచ్చాయని అందులో వివిధ గ్రామాలలో రాజకీయ నాయకులు పలుకుబడి గల వ్యక్తులు ప్రభుత్వ భూములను కబ్జా చేశారని, కుంటలు, చెరువుల భూమిని సైతం కబ్జాలు చేశారన్నారు. ఇలాంటి వ్యక్తులకు రెవెన్యూ వివిధ మండలాల్లోని తాసిల్దారులు కొందరు అధిక డబ్బులు తీసుకొని అసైన్మెంట్ భూములను సైతం పట్టా భూములుగా మార్చిన అధికారులు ఉన్నారని, ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించుకున్నారని ఏసీబి అధికారులు గుర్తించి అలాంటి వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలన్నారు. దళితులు, పేద రైతులు తమ తండ్రుల పేరుపై ఉన్న అసైన్మెంట్ భూములను తమ పేరుపై మార్చాలని తాసిల్దార్ కార్యాలయల చుట్టూ తిరుగుతున్న వారి పేర్లు మార్చడం లేదని, కొన్నిచోట్ల డబ్బులు తీసుకొని మార్చిన సంఘటనలు మా దృష్టికి వచ్చాయన్నారు.

అలాంటి అవినీతి తాసిల్దార్లను ప్రభుత్వమే గుర్తించాలని బీద రైతులు తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నరాన్నారు. అలాంటిది ఏసీబీ కార్యాలయానికి వెళ్లి వారికి ఫిర్యాదు చేయాలంటే అమాయకులైన రైతులకు తెలియదన్నారు.







కామారెడ్డి, ఉమ్మడి మాచారెడ్డి తదితర మండలాల్లో చాలా చోట్ల దేవాలయ, ప్రభుత్వ, కుంటలు చెరువుల శిఖం భూములను రాజకీయ నాయకులకు కొందరు తాసిల్దార్లు పట్ట భూములుగా మార్చి చేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. చాలాచోట్ల కుంటలను కబ్జాలు చేసి అక్కడ వెంచర్లు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ కార్యవర్గ సభ్యులు వెంకట్ గౌడ్, మోతిరాం, కొత్త నరసింహులు, జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ, అజయ్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు బేడీలు వేయటం సిగ్గు చేటు, రేవంత్ రెడ్డి పాలనకు, కెసిఆర్ పాలనకు తేడా ఏమీ లేదు

## -సిఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం కార్యక్రమంలో బీజేపీ నాయకులు







(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, డిసెంబర్ 13: లగచర్ల రైతులకు బేడీలు వేసిన రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండు వద్ద బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేయటం జరిగింది.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, ఉగ్రవాదులను ఉద్యమకారులుగా, రైతులను ఉగ్రవాదులులా చూడడం కాంగ్రెస్ పార్టీకి కొత్తేమీ కాదనీ అన్నారు. లగచర్ల ఘటనలో అక్రమంగా అరెస్టయి జైల్లో ఉన్న గిరిజన రైతుకి గుండెనొప్పి రావడంతో, తనను ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ఉగ్రవాదులకు వేసినట్టు బేడీలు వేసి తీసుకెళ్ళడాన్ని బిజెపి తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. రైతులకు బేడీలు వేయటం సిగ్గు చేటు అని ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పాలనకి, కెసిఆర్ పాలన కి తేడా ఏమీ లేదనీ మారింది పాలకులు మాత్రమే పాలన కాదనీ ప్రజలకి అర్థం అవుతుందని అన్నారు. గత ఎన్నికల్లో కెసిఆర్ కు పట్టిన గతే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పడుతుందనీ జోస్యం చెప్పారు. కల్లబొల్లి మాటలతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి తీవ్ర రైతు వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వేణు, రవీందర్, రాజు, రజినీ కాంత్, రాజేష్, రాజగోపాల్, సాయి, గోవర్ధన్, మహేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్ -II పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ అమలు: వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా




హనుమకొండ ప్రతినిధి(భారత శక్తి)డిసెంబర్13:వరంగల్ పోలీస్ కమిషనరేట్ జిల్లా పరిధిలో డిసెంబర్ 15 నుండి 16 వరకు జరిగే టి జి పి ఎస్ సి గ్రూప్–%××% పరీక్షల నేపథ్యంలో అయా పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి. ఎన్. ఎస్. ఎస్ యాక్ట్ –2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ శుక్రవారం ఓ ప్రకటన తెలిపారు.ఈ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు రేపటి నుండి రెండు రోజుల పాటు గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించబడే పరీక్షా కేంద్రాలలో వద్ద డిసెంబర్ 15వ తేది ఉదయం 6:00 గంటల నుంచి డిసెంబర్ 16వతేది సాయంత్రం 07:00 వరకు అంక్షలు అమలులో ఉంటాయని, పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని, ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఊరేగింపులు, దర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. ఎవరైనా ఈ ఉత్తర్వులు అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# పిండి పట్టే రేట్లు పెంచుతున్నాం.

మందమర్రి టౌన్, డిసెంబర్ 13,(భారత శక్తి): మందమర్రి పట్టణంలోని పిండి పట్టే రేట్లు పెంచుతున్నామని గిర్నీల నిర్వాహకులు పేర్కొన్నారు. శుక్రవారం మందమర్రిలో వారు మాట్లాడుతూ రోజురోజుకు మార్కెట్లో అన్ని రకాల వస్తువుల రేట్లు పెరిగిపోతున్నాయని గిర్నీలే జీవన ఆధారంగా తాము జీవిస్తున్నామని వారు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలు క్రితం రేట్లు పెంచామని మళ్లీ ఇప్పుడు పెంచడం తప్పడం లేదని వారు తెలిపారు. మందమర్రి మండల పట్టణ ప్రజలు మంచి పెరిగిన రేట్లను గమనించగలరు అని తెలిపారు. మంచి మనసుతో స్థానికులు మా



నిర్ణయాన్ని స్వాగతించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో గిరినీల సంఘం అధ్యక్షుడు శేషగిరిరావు భోగి వెంకటేశ్వర్లు, గిర్నీల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# 5 వ డివిజన్ లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి,సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

భారత శక్తి ప్రతినిధి, హనుమకొండ, డిసెంబర్ 13:గ్రేటర్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ భవనంలో 5వ డివిజన్ కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ చేతుల మీదుగా 5వ డివిజన్లోని లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి,సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కోడిపాక గణేష్ కుమార్,యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ముప్పిడి శ్రావణ్ కుమార్,సోషల్ మీడియా ఇంచార్జి గుత్తికొండ సురేందర్,ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు



కార్యకర్తలు,లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల కోసం బ్యాంక్ ఆఫ్ బరోడా క్రెడిట్ కార్డు.. బ్రాండ్ వోచర్స్, ఓటీటీ ప్రయోజనాలు




మహిళల కోసం తియారా పేరిట కొత్త క్రెడిట్ కార్డును బ్యాంక్ ఆఫ్ బరోడా తీసుకొచ్చింది. బ్రాండ్ వోచర్లతో పాటు ఓటీటీ ప్రయోజనాలనూ అందిస్తోంది. బ్యాంక్ ఆఫ్ బరోడా అనుబంధ బీఓబీ కార్డ్ లిమిటెడ్ కొత్త క్రెడిట్ కార్డును లాంచ్ చేసింది. మహిళల కోసం ప్రత్యేకంగా తియారా పేరిట ఈ కార్డును తీసుకొచ్చింది. ట్రావెల్, డైనింగ్, లైఫ్‌స్టయిల్ కేటగిరీకి సంబంధించి పలు ప్రయోజనాలతో పాటు రివార్డు పాయింట్లూ అందిస్తోంది. రూపే నెట్‌వర్క్‌పై ఈ క్రెడిట్ కార్డు పని చేస్తోంది. తియారా క్రెడిట్ కార్డు హోల్డర్లకు.. మింత్రా, నైకా, ఫ్లిప్‌కార్ట్, లాక్మే సలోన్, అర్బన్ కంపెనీకి వోచర్లు ఉచితంగా లభిస్తాయి. అమెజాన్ ప్రైమ్, డిస్నీ హాట్‌స్టార్, గానా ప్లస్ మెంబర్‌షిప్ కూడా ఇస్తున్నారు. సినిమా టికెట్ల బుకింగ్‌పైనా డిస్కౌంట్లు పొందొచ్చు. మొత్తంగా వోచర్లు, మెంబర్‌షిప్‌లు కలిపి రూ.31 వేలు ప్రయోజనాలను అందిస్తున్నట్లు బీఓబీ కార్డ్ లిమిటెడ్ తెలిపింది. ఈ కార్డు పొందాలంటే జాయినింగ్ ఫీజు రూ.2,499ం జీఎస్టీ చెల్లించాలి. వార్షిక రుసుము కూడా ఇంతే మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. కార్డు పొందిన 60 రోజుల్లో రూ.25 వేలు లావాదేవీలు జరిపితే జాయినింగ్ ఫీజును వాపస్ చేస్తారు. ఏడాదిలో రూ.2.50 లక్షలు ఖర్చు చేస్తే వార్షిక రుసుమును కూడా రద్దు చేస్తారు. ప్రయోజనాలు ఇలా..ట్రావెల్, డైనింగ్, ఇంటర్నేషనల్ కొనుగోళ్లపై ప్రతీ రూ.100కు 15 రివార్డు పాయింట్లుఇతర లావాదేవీలపై ప్రతీ రూ.100కు 3 రివార్డు పాయింట్లు (ఒక రివార్డు పాయింట్ = 25 పైసలు)

ప్రతీ బిల్లింగ్ సైకిల్‌లో రూ.500 వరకు యూపీఐ చెల్లింపులకు మాత్రమే రివార్డు పాయింట్లు కేటాయింప ప్రతీ త్రైమాసికంలో రూ.500 విలువైన నైకా, మింత్రా, ఫ్లిప్‌కార్ట్ డిస్కౌంట్ వోచర్లు, రూ.1500 విలువ చేసే లాక్మే సలోన్ వోచర్ ఫ్రీఅమెజాన్ ప్రైమ్, డిస్నీప్లస్ హాట్‌స్టార్, గానా ప్లస్ వార్షిక సబ్‌స్క్రిప్షన్ ఉచితంబుక్ మై షోలో మూవీ టికెట్ బుకింగ్‌లపై రూ.250 డిస్కౌంట్ (త్రైమాసికానికోసారి మాత్రమే)సంవత్సరంలో 3 నెలల పాటు స్విగ్గీ వన్ మెంబర్‌షిప్‌రూ.250 విలువ చేసే బిగ్ బాస్కెట్ డిస్కౌంట్ వోచర్ (త్రైమాసికానికి ఒకటి)వీటితో పాటు హెల్త్ ప్యాకేజీ, రూ.10లక్షల వరకు వ్యక్తిగత ప్రమాద బీమా, దేశీయ విమాన ప్రయాణాలకు అపరిమిత లాంజ్ సదుపాయం, ఫ్యూయల్ సర్‌ఛార్జి రద్దు వంటి సదుపాయాలతో ఈ కార్డును తీసుకొచ్చారు.

# శక్తిమంతమైన మహిళ నిర్మలమ్మ.. వరుసగా ఆరోసారి ఫోర్బ్స్ జాబితాలో చోటు

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మరోసారి అరుదైన గౌరవం దక్కించుకున్నారు. 2024 సంవత్సరానికి గానూ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన మహిళల జాబితా ను ఫోర్బ్స్ తాజాగా ప్రకటించింది. ఇందులో వరుసగా ఆరోసారి నిర్మలమ్మకు చోటు లభించింది. భారత్ నుంచి మొత్తం ముగ్గురు మహిళలు ఈ జాబితాలో ఉండగా.. వారిలో ఆర్థిక మంత్రి ( అగ్రస్థానంలో ఉండటం విశేషం.ప్రపంచవ్యాప్తంగా అత్యంత శక్తిమంతమైన 100 మంది మహిళల జాబితాలో నిర్మలా సీతారామన్ 28వ స్థానంలో నిలిచారు. గతేడాది ఆమె 32వ స్థానంలో ఉన్న సంగతి తెలిసిందే. ఇక, భారత్ నుంచి హెచ్‌సీఎల్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా ( ఈ జాబితాలో 81వ స్థానం దక్కించుకున్నారు. గతేడాది ఈమె 60వ స్థానంలో ఉన్నారు. బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజూందర్ షా (%ఖఱతీఱఅ వీఱఓబఎఱతీ ూష్ఱుం%) తాజా జాబితాలో 82వ స్థానంలో నిలిచారు. గతేడాది కూడా ఆమె శక్తిమంతమైన మహిళగా చోటు దక్కించుకున్నారు.ఇక, ఈ జాబితాలో యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాన్ దెర్ లెయెన్ మరోసారి అగ్ర స్థానం దక్కించుకున్నారు. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ అధిపతి క్రిస్టినా లగార్డ్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని (%+అశీతీస్త్రఱు వీవశ్రీశీఅఱ%) రెండు, మూడు స్థానాలను సొంతం చేసుకున్నారు. బిల్‌గేట్స్ మాజీ భార్య మిలిందా ఫ్రెంచ్ గేట్స్ (8వ స్థానం), అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్ మాజీ సతీమణి



మెకంజీ స్కాట్ (9వ స్థానం), ప్రముఖ పాప్ గాయని టేలర్ స్విఫ్ట్ (23 వ స్థానం) వంటి వారు ఈ జాబితాలో ఉన్నారు.భారత్‌లో తొలి, పూర్తిస్థాయి ఆర్థికమంత్రి అయిన నిర్మలా సీతారామన్, రాజకీయాల్లోకి రాకముందు బ్రిటన్ అగ్రికల్చర్ ఇంజినీర్స్ అసోసియేషన్, బీబీసీ వరల్డ్ సర్వీస్‌లలో కీలక పదవులు నిర్వర్తించారు.ల హెచ్‌సీఎల్ వ్యవస్థాపకుడు శివ్‌నాడార్ కుమార్తె రోష్నీ నాడార్ మల్హోత్రా. జులై 2020లో హెచ్‌సీఎల్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటినుంచి వ్యూహాత్మక నిర్ణయాలతో కంపెనీని అగ్ర పథంలో నడిపిస్తున్నారని ఫోర్బ్స్ తెలిపింది. 1978లో కిరణ్ మజూందర్ షా బయోకాన్‌ను నెలకొల్పారు. ఆ తర్వాత కాలంలో ఆమె భారత్‌లో అత్యంత సంపన్న మహిళల్లో ఒకరుగా ఎదిగారు. బయోకాన్‌కు మలేషియాలోని జొహొర్‌లో ఆసియాలోనే అతిపెద్ద ఇన్సులిన్ పరిశ్రమ ఉంది.

# లక్ష్య సాధనకు బడ్జెట్ తోడు

ప్రతి వ్యక్తికీ కొన్ని ఆర్థిక లక్ష్యాలు ఉంటాయి. వాటిని సాధించేందుకు మొదటి అడుగు బడ్జెట్ తయారు చేసుకోవడం. ఇప్పుడే సంపాదన ప్రారంభించిన వారికి, ఇప్పటి వరకూ ఇలాంటి ఆలోచనా లేని వారికి బడ్జెట్‌ను తయారు చేయడం కష్టమైన పనిగా అనిపిస్తుందిప్రతి వ్యక్తికీ కొన్ని ఆర్థిక లక్ష్యాలు ఉంటాయి. వాటిని సాధించేందుకు మొదటి అడుగు బడ్జెట్ తయారు చేసుకోవడం. ఇప్పుడే సంపాదన ప్రారంభించిన వారికి, ఇప్పటి వరకూ ఇలాంటి ఆలోచనా లేని వారికి బడ్జెట్‌ను తయారు చేయడం కష్టమైన పనిగా అనిపిస్తుంది. కానీ, ఒకసారి మీ లెక్కలన్నింటినీ జాగ్రత్తగా నిర్వహించడం నేర్చుకుంటే చాలు. ఆర్థికంగా స్థిరపడినట్లే.సంపాదన, ఖర్చులు ఈ రెండింటికీ సమన్వయం కుదిరినప్పుడే ఒక వ్యక్తి ఆర్థికంగా ఆనందంగా ఉండగలరు. అత్యవసర నిధి ఏర్పాటు, ఇల్లు, కారు కొనడం, పిల్లల చదువులు, పదవీ విరమణ ప్రణాళిక ఇలా ఒకటేమిటి అన్నీ బడ్జెట్‌తోనే ముడిపడి ఉంటాయి. ఈ క్రమంలో బడ్జెట్‌ను వేసుకునేందుకు పాటించాల్సిన కొన్ని ముఖ్యమైన అంశాలను తెలుసుకుందాం.నికర ఆదాయాన్ని లెక్కిచండి....జీతం లేదా వ్యాపారం ద్వారా ఆదాయం సంపాదిస్తున్నారా? ముందుగా మీ నికర ఆదాయం ఎంత అనేది లెక్క తేల్చండి. పన్ను చెల్లించిన తర్వాత మిగిలిన మొత్తాన్నే పరిగణనలోకి తీసుకోవాలి. అప్పుడే సరైన మొత్తంతో ప్రణాళిక వేసుకునేందుకు వీలవుతుంది.

ఖర్చుల మాటేమిటి?సంపాదన ప్రారంభమైన కొత్తలో ఖర్చులు కాస్త తక్కువగానే ఉండే అవకాశం ఉంది. అయినప్పటికీ మీ ప్రతి వ్యయాన్నీ లెక్కలోకి తీసుకోండి.ఇంటి అద్దె, వాయిదాల చెల్లింపు, జీవిత, ఆరోగ్య, వాహన బీమా ప్రీమియాలు, బిల్లులు, నిత్యావసరాలు, రవాణా ఛార్జీలు, జీవన శైలి ఖర్చులు, ఇతర అనుకోని ఖర్చుల వివరాలూ రాసి పెట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల మీ సంపాదనలోని ప్రతి రూపాయీ ఎక్కడికి వెళ్తుందని వివరంగా తెలుసుకోవచ్చు.మిగులు పెంచాలి..స్థిరంగా ఉండే ఖర్చులతోపాటు, అప్పుడప్పుడూ అనుకోకుండా వచ్చే వ్యయాలనూ ఒకసారి విశ్లేషించుకున్నాక ఒక అంచనా వస్తుంది. దీని ఆధారంగా ఎక్కడ ఖర్చులను తగ్గించుకునేందుకు వీలుందన్న సంగతిని తెలుసుకోవడం సులభం అవుతుంది. ఇప్పుడు చెల్లింపులన్నీ డిజిటల్‌లోనూ ఉంటున్నాయి. కాబట్టి, ఎక్కడ, ఎప్పుడు ఎంత ఖర్చు చేశామన్నది తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. మూడు నుంచి ఆరు నెలల బ్యాంకు ఖాతా వివరాలను చూడండి. ఇందులో



ఖర్చులను సగటు చేయండి. అంటే.. మీ ఆదాయంలో ఈ సగటు 40 శాతానికి మించి ఉండకుండా చూసుకోవాలి. అప్పుడే మీ మిగులు మొత్తం పెరుగుతుంది. సర్దుబాటు చేయాలి...మీ నెలవారీ ఖర్చులను, నికర ఆదాయాన్ని లెక్కించిన తర్వాత రెండింటినీ పోల్చేందుకు ప్రయత్నించాలి. ఆదాయానికి మించి ఖర్చులు ఉంటున్నాయంటే అత్యంత జాగ్రత్తగా ఉండాల్సిందే. అత్యవసరం, అవసరం కాని ఖర్చులను వాయిదా వేసుకునేందుకు ప్రయత్నించాలి. ఆర్థిక భవిష్యత్తు ఆనందంగా ఉండాలంటే.. ఇప్పుడు కొన్ని త్యాగాలు తప్పవు అని గుర్తుంచుకోవాలి.బడ్జెట్‌ను రూపొందించడం అనేది ఆర్థిక ప్రణాళికలో ఒక ప్రారంభం మాత్రమే. దీనికి కట్టుబడి ఉండటమే అసలు సవాలు. ఒకేసారి ఇది సాధ్యం కాకపోవచ్చు. కానీ, అలవాటుగా మార్చుకునే ప్రయత్నం చేసినప్పుడు ఆర్థిక విజయం సాధ్యం అవుతుంది.ఈ పొరపాట్లు చేయొద్దు..వాస్తవ ఆదాయాన్ని మాత్రమే చూసుకోవాలి. చాలామంది అంచనా ఆదాయాలు, ఎప్పుడో వచ్చే డబ్బును ఇప్పటి నుంచే ఆదాయంగా పరిగణిస్తారు. దీనివల్ల ప్రస్తుత ఖర్చులు పెరిగేందుకు అవకాశం ఉంది. వస్తుందనే డబ్బు రాకపోతే అప్పులు తప్పవు. నెలవారీ ఖర్చుల విషయంలో దాపరికాలు తగవు. కొన్ని వ్యయాలను రాసి పెట్టుకునేందుకు ఇష్టపడకపోవచ్చు. ఆర్థిక పరిస్థితి గురించి సరిగ్గా తెలుసుకోవాలంటే ప్రతి రూపాయి ఎటు వెళ్లిందో లెక్క రాయాల్సిందే.ఎంత జాగ్రత్తగా ఖర్చు చేస్తున్నా, కొన్నిసార్లు మనకు తెలియకుండానే డబ్బు చేతుల్లోంచి వెళ్లిపోతుంది. దీనిపై అప్రమత్తంగా ఉండాలి. రాబోయే రెండు మూడు నెలల వరకూ ఎలాంటి ఖర్చులు రావచ్చనే అంచనా ఉంటే, ఇలాంటివి నిరోధించవచ్చు.డబ్బు గురించి మీరు ఎలా ఆలోచిస్తున్నారన్నది తెలియజేసేందుకు బడ్జెట్ ఒక సాధనం.

# ఆరోగ్య బీమా కష్టంలో భరోసానిచ్చేలా




చిన్న అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరితే రూ.లక్షలు ఖర్చవుతున్న రోజులివి. ఒకప్పుడు రూ.5లక్షల బీమా ఉంటే సరిపోతుంది అనుకునే వారు. కానీ, వైద్య ద్రవ్యోల్బణం, ఆధునిక చికిత్స పద్ధతులు చికిత్స ఖర్చులను పెంచేశాయి. ఇప్పుడు రూ.10లక్షల బీమా ఉన్నా ధీమాగా అనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మీ ఆరోగ్య బీమాను ఒకసారి సమీక్షించుకోవడంతోపాటు, దానికి టాపప్‌లాంటి అదనపు భద్రతను జోడించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.చిన్న అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరితే రూ.లక్షలు ఖర్చవుతున్న రోజులివి. ఒకప్పుడు రూ.5లక్షల బీమా ఉంటే సరిపోతుంది అనుకునే వారు. కానీ, వైద్య ద్రవ్యోల్బణం, ఆధునిక చికిత్స పద్ధతులు చికిత్స ఖర్చులను పెంచేశాయి. ఇప్పుడు రూ.10లక్షల బీమా ఉన్నా ధీమాగా అనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మీ ఆరోగ్య బీమాను ఒకసారి సమీక్షించుకోవడంతోపాటు, దానికి టాపప్‌లాంటి అదనపు భద్రతను జోడించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఆరోగ్య బీమా పాలసీల క్లెయింలు సగటున రూ.81,025 వరకూ ఉంటున్నాయని ఇటీవల ఒక నివేదిక వెల్లడించింది. ఏడాది క్రితంతో పోలిస్తే ఇది 30.7శాతం పెరిగింది. అదే సమయంలో 18-25 ఏళ్లలోపు వారే అధికంగా క్లెయింలు చేస్తున్నారనీ తేలింది. రోబోటిక్ సర్జరీలు, ఖరీదైన ఔషధాలు, చికిత్సకు ఎలాంటి పరిమితులు లేకుండా చెల్లించడం, మెరుగైన సౌకర్యాలు పెరగడంలాంటివి వైద్య ఖర్చును అధికం చేస్తున్నాయి. బీమా పాలసీలూ దీనికి అనుగుణంగానే సరికొత్త పాలసీలను అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. ఎంత వరకూ..

ఆరోగ్య బీమా పాలసీని తీసుకునేటప్పుడు ముందుగా మీ ఆరోగ్య అవసరాలను అంచనా వేసుకోండి. వయసు, ఇప్పటికే ఉన్న వ్యాధులు, భవిష్యత్ వైద్య ఖర్చులవంటి వాటిని పరిగణనలోకి తీసుకొని సరైన మొత్తానికి పాలసీని తీసుకునే ప్రయత్నం చేయాలి. వివిధ ఆరోగ్య బీమా పాలసీలు అందిస్తున్న ప్రయోజనాలను సమీక్షించండి. ఆసుపత్రిలో చేరినప్పుడు, ఔట్ పేషెంట్ చికిత్స, అంబులెన్స్ ఛార్జీలు, ఆసుపత్రిలో చేరకముందు, ఇంటికి వచ్చాక అయ్యే ఖర్చులను చెల్లించేలా పాలసీ ఉండాలి. ఒప్పంద ఆసుపత్రుల జాబితానూ ఒకసారి చూసుకోవాలి. ఆ తర్వాతే పాలసీని తీసుకోవాలి. కుటుంబంలో నలుగురు వ్యక్తులు ఉంటే.. కనీసం రూ.20 లక్షల వరకూ ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీ ఉండేలా జాగ్రత్త తీసుకోవడం ఇప్పుడు ఎంతైనా అవసరం.చెల్లింపులు సులభంగా..పాలసీని తీసుకోవడమే కాదు.. అత్యవసర పరిస్థితుల్లో ఎంత వేగంగా చెల్లింపులను పరిష్కరిస్తుందన్న విషయం ఆధారంగా బీమా సంస్థలను ఎంచుకోవాలి. కొన్ని బీమా సంస్థలు పాలసీదారులను ఆకర్షించేందుకు అధిక మొత్తానికి పాలసీని ఇస్తూ, తక్కువ ప్రీమియాన్ని వసూలు చేస్తుంటాయి. తీరా క్లెయిం విషయానికి వచ్చే సరికి అనేక ప్రశ్నలతో విసిగిస్తుంటాయి. కొన్నిసార్లు నగదు రహిత చికిత్సకు నిరాకరించి, బిల్లులు పెట్టుకొని, ఖర్చులను తిరిగి పొందాలని సూచిస్తుంటాయి. ఇలాంటి చిక్కులు లేకుండా ఉండేలా.. మంచి చెల్లింపుల చరిత్ర ఉన్న సంస్థ నుంచే పాలసీని తీసుకోవడం మంచిది.సమీక్షిస్తూ ఉండాలి..వైద్య ద్రవ్యోల్బణం ఏటా 12-15 శాతం పెరుగుతోందని అంచనా. ఈ నేపథ్యంలో ఎంత బీమా పాలసీ ఉన్నా రెండేళ్ల తర్వాత సరిపోకపోవచ్చు. మీరు పాలసీ తీసుకొని ఇప్పటికి ఎన్నాళ్లయ్యింది? అప్పటికి ఇప్పటికీ బోనస్‌లాంటివి కలిపి ఎంతయ్యింది అనేది చూసుకోండి. రూ.5లక్షలకు తక్కువగా ఉన్న పాలసీతో ఇప్పుడు పెద్దగా ఉపయోగం ఉండటం లేదని గుర్తుంచుకోండి. ఉదాహరణకు గుండె, మూత్రపిండాల వైఫల్యం, నరాల సంబంధిత వ్యాధులు, అనుకోని ప్రమాదాలు తదితర సందర్భాల్లో చికిత్సకు భారీగా ఖర్చువుతుంది. కాబట్టి, మీ పాలసీని ఒకసారి పూర్తిగా సమీక్షించుకోండి. పాత పాలసీని పెంచుకోవడమో.. కొత్తగా మరో పాలసీని తీసుకోవడంలాంటివి చేయాలి. ఇప్పటికే ఉన్న పాలసీని రద్దు చేసుకోకుండా, అవసరమైతే మరో బీమా సంస్థకు మారేందుకు ప్రయత్నించవచ్చు.సూపర్ టాపప్‌తో..కేవలం ప్రాథమిక ఆరోగ్య పాలసీ ఒక్కటే సరిపోవడం లేదిప్పుడు. దీనికి అదనంగా సూపర్ టాపప్‌తో అదనపు భద్రత ఏర్పాటు చేసుకోవాలి. ప్రాథమిక ఆరోగ్య బీమా పాలసీ పరిమితికి మించి అదనంగా ఖర్చయినప్పుడు, ఈ టాపప్ పాలసీలు ఆ అధిక మొత్తాన్ని చెల్లిస్తాయి. తక్కువ ప్రీమియంతో ఎక్కువ ఆరోగ్య బీమా రక్షణ అందించడం వీటి ప్రత్యేకత. కనీసం రూ.10లక్షల ప్రాథమిక పాలసీలపై రూ.50 లక్షల వరకూ సూపర్ టాపప్ తీసుకోవడం మేలు. కొన్ని టాపప్ పాలసీలు రూ.2కోట్ల వరకూ రక్షణ అందిస్తున్నాయి.వీటికీ కొన్ని పరిమితులు ఉంటాయి. ఒకే సంస్థ నుంచి ప్రాథమిక పాలసీ, సూపర్ టాపప్ తీసుకోవచ్చు. లేదా రెండింటికీ వేర్వేరు పాలసీలను తీసుకోవచ్చు. కొన్నిసార్లు టాపప్ పాలసీలు నగదు రహిత చికిత్సకు అనుమతించవు. కాబట్టి, పాలసీ తీసుకునేటప్పుడు నియమ నిబంధనలు కచ్చితంగా తెలుసుకోవాలి.బోనస్‌పై ఆధారపడొద్దు..ఒక పాలసీ సంవత్సరంలో ఎలాంటి క్లెయింలూ లేకపోతే బీమా సంస్థలు బోనస్‌ను ఇస్తుంటాయి. ఒకసారి క్లెయిం చేస్తే, బోనస్ అందకపోవచ్చు. పాలసీ తీసుకునేటప్పుడు మరో రెండేళ్ల తర్వాత బాగా రక్షణ లభిస్తుందని అంచనా వేస్తుంటారు. మొదటి సంవత్సరంలోనే ఏదైనా అనారోగ్యం వస్తే, అప్పుడు ఎలా అన్నది చాలామంది ఆలోచించరు. కాబట్టి, బోనస్ గురించి ముందుగానే ఆలోచించకుండా ప్రాథమిక పాలసీ మొత్తం అధికంగానే ఉండేలా చూసుకోండి. బోనస్ వచ్చినప్పుడు పాలసీ విలువ పెరుగుతుంది కాబట్టి, మరింత భరోసా ఉంటుంది

# సంపన్నులను ఆకర్షిస్తున్నాయ్..

ధనవంతుల వద్ద పెట్టుబడులకు సరిపడా డబ్బు ఉంటుంది. అయితే అత్యుత్తమ పెట్టుబడులను ఎలా ఎంచుకోవాలి. వాటిని ఎలా నిర్వహించుకోవాలన్నది పెద్ద సమస్య.దీనికి పరిష్కారమే పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్(పీఎమ్ఎస్) సంపన్నులకు ఏదైనా అంకురంలో పెట్టుబడులు పెట్టాలని ఉంటుంది. అయితే అలా పెట్టడం వల్ల వచ్చే నష్టభయంతో వెనకడుగు వేస్తుంటే.ఇటువంటి సందర్భాల్లోనే ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్(ఏఐఎఫ్) పరిష్కారం చూపుతాయ్.ఈ రెండూ భారతీయ ప్రత్యామ్నాయ పెట్టుబడుల పరిశ్రమలో భాగమే. సరికొత్త దశలోకి అడుగుపెడుతున్న ఈ రెండూ.. 2030 కల్లా రూ.100 లక్షల కోట్ల స్థాయికి చేరనున్నాయని ఒక అంచనా.సమయం, నైపుణ్యం లేకుంటే..మీ వద్ద డబ్బు ఉంది. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టాలని ఉంటుంది. కానీ పెట్టుబడులు పెట్టేందుకు సమయం కానీ, షేర్లను పరిశోధించేందుకు నైపుణ్యం కానీ లేకుంటే పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్(పీఎమ్ఎస్) ఒక చక్కటి పరిష్కారం. ఏం చేస్తారు వీరు: మీ దగ్గరున్న డబ్బును మీ బదులుగా పెట్టుబడులు పెడతారు. ఒక వృత్తి నిపుణుడు వీటిని పర్యవేక్షిస్తారు. మీ లక్ష్యాలు, నష్టభయం భరించే స్థాయి, లాభాలకు వేచి చూసే సమయం వంటి వాటి ఆధారంగా షేర్లు, బాండ్లు, ఇతర ఆస్తులతో ఒక కస్టమైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రణాళికను సిద్ధం చేస్తారు. మీ సంపద పెరిగేందుకు ఎప్పటికపుడు పెట్టుబడులను సమీక్షిస్తూనే ఉంటారు. ఎవరికి: రూ.50 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ పెట్టుబడులు పెట్టేవారికి ఈ వ్యక్తిగత సేవలను అందిస్తారు.ఏఐఎఫ్‌లు.. కాస్త విభిన్నంపీఎమ్ఎస్‌లతో పోలిస్తే ఏఐఎఫ్‌లు విభిన్నమైనవి. పేరుకు తగ్గట్లే ఇవి.. సాధారణ షేర్లు లేదా బాండ్ల వంటి వాటిలో కాకుండా ప్రత్యామ్నాయ ఆస్తుల్లో పెట్టుబడులు పెడతాయి. అయితే పలువురు పెట్టుబడుదార్ల నుంచి వచ్చిన డబ్బులను ఒక పూల్‌గా చేసి.. వాటిని ఒక ఫండ్ మేనేజర్ నిర్వహణలో ఉంచుతారు.



పెట్టుబడులు వేటిలో అంటే: ఈ 'ప్రత్యామ్నాయ ఆస్తులు'గా ప్రైవేటు ఈక్విటీ, స్థిరాస్తి, వెంచర్ క్యాపిటల్, హెడ్జ్ ఫండ్‌లు, అంకురాలు ఉంటాయి. వీటిల్లో పెట్టుబడుల వల్ల ఎక్కువ ప్రతిఫలాలు రాబట్టుకోవడమే అసలు వ్యూహం.ఈ రెండింటికీ ఎందుకింత ఆకర్షణ అంటే..భారత్‌లో సంపన్నుల సంఖ్య పెరుగుతోంది. వీరు తమ పెట్టుబడులు పెట్టే విధానం స్మార్ట్‌గా ఉండాలని కోరుకుంటున్నారు.ఆర్థిక అక్షరాస్యత పెరుగుతోంది. తమ డబ్బు తమని భవిష్యత్‌లో ఎలా రక్షిస్తుందో తెలుసుకుంటున్నారు.స్టాక్ మార్కెట్ వంటి ఊగిసలాట మార్కెట్లలో నష్టభయం వస్తే ఏమిటన్న ఆలోచనతో తమ పెట్టుబడుల్లో వైవిధ్యం ఉండాలని కోరుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది ప్రభుత్వం, ఆర్‌బీఐ, సెబీ వంటి నియంత్రణ సంస్థల నుంచి ఉన్న మద్దతు కారణంగా రక్షణ పెరిగింది. సులభతర పెట్టుబడులకు వీలైంది. ఈ కారణాల వల్ల అధిక నికర విలువ గల వ్యక్తులు(హెచ్ఎన్ఐలు), అత్యంత అధిక నికర విలువ గల వ్యక్తులు (హెచ్‌హెచ్ఎన్ఐలు) తమ పెట్టుబడులను పీఎమ్ఎస్‌లు, ఏఐఎఫ్‌ల వైపు మళ్లిస్తున్నారు. ప్రస్తుత ధోరణి కొనసాగితే కేవలం ఆరేళ్లలో మొత్తం పరిశ్రమ రూ.100 లక్షల కోట్లకు చేరొచ్చు. ప్రస్తుత స్థాయికి ఇది అయిదు రెట్లు ఎక్కువ కావడం విశేషం.

# జొమాటోకు రూ.803 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీసు..

దిల్లీ: ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో కు మరోసారి జీఎస్టీ డిమాండ్ నోటీసులు అందాయి. వినియోగదారుల నుంచి వసూలు చేసిన డెలివరీ ఫీజుపై జీఎస్టీకి సంబంధించిన బకాయిలు చెల్లించాల్సి ఉందంటూ ఈ నోటీసులు వచ్చాయి. ఈ విషయాన్ని రెగ్యులేటరీ ఫైలింగ్ సందర్భంగా కంపెనీ వెల్లడించింది. మొత్తం రూ.803.4 కోట్ల జీఎస్టీ చెల్లించాలని ఆదేశాలు (%+ూ ఐవ-ఝఱఅ చీశీఱఎవ%) వచ్చినట్లు పేర్కొంది."2019 అక్టోబరు 29 నుంచి 2022 మార్చి 31 మధ్య కాలంలో డెలివరీ ఛార్జీలపై జీఎస్టీ బకాయిలు రూ.401.70 కోట్లుగా పేర్కొంటూ మహారాష్ట్రలోని ఠాణె జీఎస్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. దీనికి వడ్డీ, పెనాల్టీ కింద మరో రూ.401.70కోట్లు చెల్లించాలని ఆదేశించారు'' అని కంపెనీ తమ ఫైలింగ్‌లో వెల్లడించింది. అయితే, దీనిపై తాము సంబంధిత అధికారుల ముందు అప్పీల్ చేయనున్నట్లు తెలిపింది. ఇది చాలా తీవ్రమైన కేసు అని.. దీనిపై తాము న్యాయనిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నామని కంపెనీ పేర్కొంది. కాగా.. జొమాటోకు గతంలోనూ ఈ తరహా జీఎస్టీ బకాయిల నోటీసులు అందాయి.జొమాటో లో కస్టమర్ ఫుడ్ ఆర్డర్ చేసినప్పుడు బిల్లులో మూడు అంశాలు ఉంటాయి. అందులో ఆహార పదార్థాల ధర ఒకటి.

# పాక్‌కు షాక్ మీద షాక్.. మొన్న గ్యారీ కిరిస్టెన్.. ఇప్పుడు జాసన్ గిలెస్పీ



పాకిస్థాన్ క్రికెట్‌లో మరోసారి కోచ్‌ల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవలే కోచింగ్ బాధ్యతల నుంచి గ్యారీ కిరిస్టెన్ వైదొలిగిన సంగతి తెలిసిందే. తాజాగా జాసన్ గిలెస్పీ కూడా గుడ్‌బై చెప్పేశాడు. అతడి పదవీకాలం 2026 వరకు ఉంది. కానీ, ఈలోగానే వైదొలగడం గమనార్హం. కిరిస్టెన్ వెళ్లిపోయిన తర్వాత ప్రధాన కోచ్‌గా గిలెస్పీనే పాక్ క్రికెట్ బోర్డు నియమించింది. కానీ, దక్షిణాఫ్రికాతో డిసెంబర్ 26 నుంచి టెస్టు సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో గిలెస్పీ స్థానంలో ఆకిబ్ జావెద్‌కు తాత్కాలికంగా కోచింగ్ బాధ్యతలు అప్పగించింది. కోచింగ్ బృందం నుంచి టిమ్ నీల్సన్‌ను తప్పించడంపై గిలెస్పీ అసహనం వ్యక్తం చేశాడని.. పాక్ బోర్డు తీరుతో ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జట్టు ఎంపికలో గిలెస్పీ కలుగజేసుకోవడం వల్లే పీసీబీ అతన్ని తప్పించిందనే వాదనా ఉంది.

గ్యారీ కిరిస్టెన్ విషయంలోనూ..

పరిమిత ఓవర్ల క్రికెట్ కోచ్‌గా గ్యారీ కిరిస్టెన్ రెండేళ్ల కాంట్రాక్ట్‌పై వచ్చాడు. కానీ, 2024 టీ20 ప్రపంచకప్‌లో పాక్ ప్రదర్శన దారుణంగా ఉండటంతో కిరిస్టెన్‌పై పీసీబీ అసంతృప్తి వ్యక్తంచేసింది. బోర్డులోని పలువురితో విభేదాల కారణంగా కిరిస్టెన్ తన పదవికి రాజీనామా చేశాడు. ఆ తర్వాత గిలెస్పీకి పరిమిత ఓవర్ల క్రికెట్ కోచింగ్ బాధ్యతలను అప్పగించింది. అప్పుడే, ఆకిబ్ జావెద్‌ను తీసుకురావాలని బోర్డులోని కొందరు ప్రయత్నించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు గిలెస్పీ స్థానంలో ఆకిబ్‌కే బాధ్యతలు అప్పగించడం గమనార్హం. జట్టు ఎంపికకు సంబంధించి పూర్తి అధికారాలను ఆకిబ్‌కు ఇచ్చినట్లు తెలుస్తోంది.

బాబర్ కేసు విచారణ వాయిదా

పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ అజామ్‌పై లైంగిక ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. అతడిపై కేసు కూడా నమోదైంది. అయితే, ఈ విచారణను లాహోర్ హైకోర్టు వాయిదా వేసింది. డిసెంబర్ 16 వరకు ఎలాంటి విచారణ చేపట్టమని పేర్కొంది. బాబర్‌తో రిలేషన్‌లో ఉన్నానని.. వివాహం చేసుకుంటానని ప్రామిస్ చేసి తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఓ మహిళ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో బాబర్ అజామ్ సీనియర్ లాయర్ కోర్టుకు హాజరుకాలేదు. జూనియర్ లాయర్ విజ్ఞప్తి మేరకు హైకోర్టు వాయిదా వేసింది. ప్రస్తుతం బాబర్ అజామ్ టీ20 సిరీస్ కోసం దక్షిణాఫ్రికాలో ఉన్నాడు.

# మేనేజ్‌మెంట్ ప్రణాళికల్లో షమీ లేనట్లున్నాడు : భారత మాజీ క్రికెటర్



: భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ ఆస్ట్రేలియా పర్యటనకు ( వెళ్లడంపై ఇంకా సందిగ్ధం నెలకొంది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆడినప్పటికీ అతడి గాయం మళ్లీ తిరగబెట్టిందనే వ్యాఖ్యలు వినిపించాయి. అందుకుతగ్గట్టుగానే కెప్టెన్ రోహిత్ చేసిన కామెంట్లూ బలం చేకూర్చాయి. 'షమీ కోసం తలుపులు తెరిచే ఉన్నాయి. కానీ, అతడిని పూర్తిస్థాయి ఫిట్‌నెస్ లేకుండా బలవంతంగా తీసుకురాలేం' అని రోహిత్ వ్యాఖ్యానించాడు. ఈక్రమంలో భారత మాజీ క్రికెటర్, విశ్లేషకుడు ఆకాశ్ చోప్రా (తన యూట్యూబ్ ఛానల్‌లో ఓ వీడియోను షేర్ చేశాడు. బోర్డర్ – గావస్కర్ ట్రోఫీ కోసం మేనేజ్‌మెంట్ దృష్టిలో షమీ లేనట్లు ఉన్నాడని వ్యాఖ్యానించాడు.

"మహ్మద్ షమీ  పునరాగమనంలో చాలా క్రికెట్ ఆడాడు. దాదాపు ఏడాది తర్వాత మళ్లీ మైదానంలోకి దిగాడు. దీంతో అతడి ఫిట్‌నెస్‌పై అనుమానాలు రావడం మొదలుపెట్టాయి. తొలుత ఎలాంటి ఇబ్బందిలేకుండా ఆడాడు. అంతా ఓకే అన్నట్లుగా ఉంది. కానీ, రోహిత్ శర్మ మాత్రం విభిన్నంగా స్పందించాడు. అతడిని తీసుకొనేందుకు సిద్ధమంటూనే.. తొందర పెట్టలేమని చెప్పాడు. ఇప్పుడిదే హాట్ టాపిక్‌గా మారింది. ఇలాంటి స్పందనతో షమీ ఆడతాడా? లేదా? అనేది అభిమానుల్లో అనుమానం నెలకొంది. అతడు ఆసీస్‌కు వెళ్లడం లేదనే తేలిపోయింది. షమీని పంపేందుకు ఇష్టపడటం లేదంటే.. మేనేజ్‌మెంట్ ప్రణాళికలో అతడు లేనట్లుంది. ఇదికాస్త బాధాకరమైనప్పటికీ.. ఇదే అసలు స్టోరీ. షమీ ఇంకా సిద్ధంగా లేదని మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లుంది. కెప్టెన్, కోచ్, సెలక్టర్లు ఇలానే ఆలోచిస్తున్నారేమో. షమీ మోకాలిలో వాపు వచ్చినట్లు రోహిత్ రెండుసార్లు చెప్పాడు. ప్రాక్టీస్ సెషన్‌కు ముందు ఒకసారి.. షమీ మ్యాచ్ ఆడిన తర్వాత మరోసారి వెల్లడించాడు. బోర్డు అంతరంగిక వ్యవహారాలను బయటకు చెప్పడం సరికాదు. అందుకే, ఇలాంటివాటిపై ఎక్కువగా స్పందించను. ఈ పరిణామాలను చూస్తుంటే ఆసీస్‌కు షమీ వెళ్లడం కష్టమే" అని చోప్రా వెల్లడించాడు.

మళ్లీ జట్టులోకి జోష్ హేజిల్‌వుడ్

గులాబీ టెస్టు నుంచి దూరమైన జోష్ హేజిల్‌వుడ్‌ను మూడో టెస్టు కోసం ఆసీస్ ఎంపిక చేసింది. గబ్బా వేదికగా శనివారం నుంచి ప్రారంభం కానున్న మూడో మ్యాచ్ కోసం తుది జట్టును ఆసీస్ మేనేజ్‌మెంట్ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. స్కాట్ బోలాండ్‌ను తప్పించి హేజిల్‌వుడ్‌కు అవకాశం కల్పించింది. పక్కటెముకల నొప్పి కారణంగా అడిలైడ్‌లో జోష్ ఆడలేదు. "జోష్ హేజిల్‌వుడ్ జట్టులోకి వచ్చాడు. గాయం కారణంగా రెండో మ్యాచ్‌కు దూరమైన అతడు ఇప్పుడు పూర్తిస్థాయిలో ఫిట్‌గా ఉన్నాడు. వైద్యబృందం కూడా నిరంతరం పర్యవేక్షించింది" అని ఆసీస్ కెప్టెన్ కమిన్స్ తెలిపాడు.

# యువ ఛాంపియన్ గుకేశ్‌కు తమిళనాడు సీఎం రూ. 5 కోట్ల నజరానా



చిన్న వయసులోనే ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన భారత ఆటగాడు డి గుకేశ్‌పై (%ణ +బనివంష్ట్ర%) సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ క్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ భారీ నజరానా ప్రకటించారు. వరల్డ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో డిగ్ లిరెన్‌పై గుకేశ్ అద్భుత విజయం సాధించడంపై స్టాలిన్ అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5 కోట్ల ప్రైజ్‌మనీని అందిస్తున్నట్లు వెల్లడించారు.

"గుకేశ్ సాధించిన అద్భుత విజయాన్ని మనం గౌరవించాలి. అతి పిన్న వయస్కుడైన ఛాంపియన్‌గా నిలిచాడు. ఈ సంతోషంలో అతడికి రూ.5 కోట్ల ప్రైజ్ మనీని ప్రకటిస్తున్నా. జాతి గర్వపడేలా చేసిన అతడికి నా ప్రత్యేక అభినందనలు. మున్ముందూ మరిన్ని ఘనతలు సాధించాలని కోరుకుంటున్నా. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షిస్తున్నా" అని స్టాలిన్ పోస్టు చేశారు.

గుకేశ్ నికర విలువ మూడింతలు

ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన దొమ్మరాజు గుకేశ్‌కు ట్రోఫీతో పాటు రూ.11.45 కోట్ల నగదు బహుమతి దక్కింది. దీంతో అతడి నికర విలువ రూ.8.26 కోట్ల నుంచి రూ. 21 కోట్లకు పెరిగింది. చెస్ ద్వారా అతడి ఆదాయం దాదాపు మూడు రెట్లు పెరిగినట్లైందని ఔట్‌లుక్ పేర్కొంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచిన లిరెన్ రూ.9.75 కోట్లు గెలుచుకున్నాడు. ఈ ఛాంపియన్‌షిప్ మొత్తం ప్రైజ్‌మనీ రూ.21.17 కోట్లు. ఒక గేమ్ గెలిచిన ప్లేయర్‌కి రూ.1.69 కోట్లు లభిస్తాయి. మూడు గేమ్‌లు నెగ్గిన గుకేశ్‌కు రూ.5.07 కోట్లు.. రెండు గెలిచిన లిరెన్‌కు రూ.3.38 కోట్లు దక్కాయి. మిగిలిన ప్రైజ్‌మనీని సమానంగా పంచారు.

# సచిన్ ఏమీ చేయలేదనుకున్నా.. కపిల్ ఆఫర్‌ను అంగీకరిస్తున్నా: వినోద్ కాంబ్లీ

గత కొన్ని వారాలుగా అనారోగ్య పరిస్థితులతో తీవ్రంగా ఇబ్బందిపడినట్లు భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ వెల్లడించాడు. ఇటీవల రమాకాంత్ అచ్రేకర్ స్మారక కార్యక్రమంలో కాంబ్లీ నిలబడేందుకూ ఇబ్బందిపడిన సంగతి



తెలిసిందే. అతడికి సాయం చేసేందుకు 1983 వన్డే ప్రపంచకప్ విజేత టీమ్ సిద్ధంగా ఉందని మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ ప్రకటించారు. అయితే, ఒక షరతు విధించాడు. రిహాబిలిటేషన్ సెంటర్‌కు వెళ్తేనే సాయం చేస్తామన్నారు. ఇప్పుడు దానికి అంగీకరిస్తున్నట్లు వినోద్ కాంబ్లీ వెల్లడించాడు. అంతేకాకుండా తన ఆరోగ్య పరిస్థితి పైనా స్పందించాడు. తన కుటుంబం మద్దతుగా నిలవడం వల్లే ఇలా ఉన్నానని భావోద్వేగానికి గురయ్యాడు. సచిన్‌తో సంబంధాలపైనా ఆసక్తికర విశేషాలను వెల్లడించాడు.

"ఇప్పుడు నా పరిస్థితి బాగానే ఉంది. నా భార్య చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. మూడు ఆసుపత్రుల్లో చూపించి మరీ వైద్యం చేయించింది. ఫిట్‌గా తయారుకావాలని రోజూ చెబుతూ ఉంది. నన్ను చూసేందుకు అజయ్ జడేజా వచ్చాడు. నాకు చాలా ఆనందమేసింది. నేను యూరిన్ సమస్యతో ఇబ్బందిపడ్డా. మూత్రం ఆగని పరిస్థితి ఎదురైంది. నా కుమారుడు క్రిస్టియానో నన్ను మళ్లీ నిలబెట్టేందుకు చాలా ప్రయత్నించాడు. నా పదేళ్ల కుమార్తె కూడా సాయపడింది. ఇదంతా నెల రోజుల కిందట జరిగింది. అప్పుడు నా తల తిరిగినట్లు అనిపించింది. ఒక్కసారి కుప్పకూలిపోయా. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు కూడా కొన్ని రోజులు ఉండాలని చెప్పారు. ఇప్పుడు తీవ్రమైన ఆర్థిక కష్టాల్లో ఉన్నా. క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ ఇచ్చిన ఆఫర్‌ను అంగీకరిస్తున్నా. కేవలం రూ.30వేల పింఛను మీదే ఆధారపడుతున్నా.

నా కోసం ఎంతో చేశాడు..

చిన్నప్పటినుంచి కలిసి ఆడిన సచిన్ తెందూల్కర్‌తో  2009లో విభేదాలు రావడంపై కాంబ్లీ స్పందించాడు. తాను తప్పుగా అర్థం చేసుకోవడం వల్లే ఇదంతా వచ్చిందని బాధపడ్డాడు. 2013లో సర్జరీ సమయంలో మెడికల్ బిల్స్‌ను అతడే చెల్లించినట్లు వెల్లడించాడు. "ఒక దశలో సచిన్ నాకోసం ఏమీ చేయలేదని అనిపించింది. తీవ్ర నిరాశకు గురయ్యా. కానీ, సచిన్ నాకోసం ప్రతిదీ చేశాడు. రెండు సర్జరీలు జరిగినప్పుడు బిల్లు మొత్తం అతడే చెల్లించాడు. మేమిద్దరం మాట్లాడుకున్నాం. చిన్ననాటి స్నేహం మళ్లీ మొదలైంది. కెరీర్ సమయంలోనూ ఎలా ఆడాలో సచిన్ నాకు చెప్పేవాడు. తొమ్మిదిసార్లు నేను జట్టులోకి కమ్ బ్యాక్ చేశా. క్రికెటర్లకు గాయాలు తప్పవు. అలాగే టీమ్‌లో నుంచి బయటకు వెళ్తూ ఉంటాం. వాటన్నింటిని తట్టుకొని నిలబడాల్సిఉంటుంది. నా కెరీర్‌లో వాంఖడే స్టేడియం వేదికగా చేసిన డబుల్ సెంచరీని ఎప్పటికీ మరిచిపోలేను. అప్పుడు అచ్రేకర్ సర్ నాతో ఉండేవారు. ముత్తయ్య మురళీధరన్‌తో పోటీ పడేవాళ్లం. ఆ యుద్ధం బాగుండేది. కానీ, నా క్రికెట్ ప్రయాణం సరిగ్గా లేదు. సచిన్ వంటి స్నేహితుడు అండగా నిలిచాడు. ఇక నా కుటుంబం మద్దతు చెప్పలేనిది" అని కాంబ్లీ వెల్లడించాడు.

# ఆ పిల్లాడే ఇప్పుడు కింగ్: ఫొటో షేర్ చేసిన ఆనంద్ విశ్వనాథన్



చరిత్రను తిరగరాస్తూ డి గుకేశ్ సంచలన ప్రదర్శనతో ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా అవతరించాడు. 18 ఏళ్లకే ఈ ఘనతను సాధించి చదరంగంలో అరుదైన ప్రతిభను సొంతం చేసుకున్నాడు. చివరి రౌండ్ వరకూ ఉత్కంఠభరితంగా సాగిన ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో డింగ్ లిరెన్‌పై గుకేశ్ విజయం సాధించాడు. ఇప్పటికే తనకు విషెస్‌ను తెలియజేసిన చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్  సోషల్ మీడియాలో మరో పోస్టుతో ఆకట్టుకున్నాడు. గుకేశ్ చిన్ననాటి ఫొటోను ఆనంద్ షేర్ చేశాడు. "ఇప్పుడీ పిల్లాడే కింగ్' అంటూ క్యాప్షన్ జోడించాడు. అండర్ –13 పోటీల్లో భాగంగా ఆనంద్ చేతులమీదుగా గుకేశ్ ఐదేళ్ల కిందట ఛాంపియన్ బహుమతిని అందుకొన్నాడు. ఆ ఫొటోనే తాజాగా ఆనంద్ షేర్ చేశాడు.

అక్కడే డింగ్ లిరెన్ దొరికిపోయాడు

దాదాపు 40 ఏళ్ల కిందట కాస్పరోవ్ నమోదు చేసిన రికార్డును భారత యువ చెస్ ప్లేయర్ గుకేశ్ బద్దలుకొట్టాడు. అప్పటివరకు ఉన్న రికార్డు 22 ఏళ్ల 6 నెలల 27 రోజులు. కానీ, గుకేశ్ ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా 18 ఏళ్ల 8 నెలల 14 రోజుల వయసులోనే నిలిచాడు. డింగ్ లిరెన్‌తో జరిగిన హోరాహోరీ పోరులో 7.5 పాయింట్లను సాధించి గుకేశ్ విజేతగా నిలిచాడు. 13 రౌండ్ల వరకూ పాయింట్లపరంగా సమంగా నిలిచారు. అయితే, చివరి రౌండ్‌లో అద్భుత విజయంతో గుకేశ్ ఛాంపియన్‌గా మారిపోయాడు. ఈ రౌండ్‌లోనూ చివరివరకూ ఇరువురూ తీవ్రంగా తలపడ్డారు. కానీ, ఆఖర్లో లిరెన్ చేసిన పొరపాటు గుకేశ్‌కు కలిసొచ్చింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా దూకుడు ప్రదర్శించిన భారత యువ చెస్ ప్లేయర్ ప్రత్యర్థిని మట్టి కరిపించాడు. చివరికి లిరెన్ ఓటమిని అంగీకరించక తప్పలేదు.

## మాకు ఇది 3 టెస్టుల సిరీస్: శుభ్‌మన్ గిల్

బోర్డర్ – గావస్కర్ ట్రోఫీలో  2024) భాగంగా ఆస్ట్రేలియాతో భారత్ బ్రిస్బేన్ వేదికగా మూడో టెస్టుకు సిద్ధమవుతోంది. ఇరు జట్లూ చెరొక విజయంతో సమంగా నిలిచాయి. తొలి మ్యాచ్‌లో 295 పరుగుల తేడాతో భారత్ గెలవగా.. రెండో టెస్టులో (గులాబీ బంతి) 10 వికెట్ల తేడాతో ఆసీస్ విజయం సాధించింది. గబ్బా టెస్టు  నేపథ్యంలో శుభ్‌మన్ గిల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. తాము తాజాగా సిరీస్‌ను ప్రారంభిస్తామని.. ఇక నుంచి మూడు టెస్టుల సిరీస్‌గా భావించి ఆడతామన్నాడు. అలాగే ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన గుకేశ్‌కు అభినందనలు తెలిపాడు.

"భారత శిబిరంలో అంతా బాగుంది. జట్టంతా కూర్చుని డిన్నర్ చేశాం. ఎంతో సరదాగా గడిపాం. అడిలైడ్‌లో మేం అనుకున్నట్లు ఫలితం రాలేదు. అందుకు మరీ ఆందోళన పడటం లేదు. ఇక నుంచి మేం మూడు టెస్టుల సిరీస్‌గా భావించి ఆడతాం.



ఈ మ్యాచ్‌లో మేం గెలిస్తే.. మెల్‌బోర్న్, సిడ్నీలోనూ పైచేయి సాధిస్తాం. గత సిరీస్‌లోనూ అడిలైడ్‌లో మాకు ఓటమి ఎదురైంది. కానీ, ఆ తర్వాత మ్యాచుల్లో గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకున్నాం. ఇప్పుడూ అదే పాజిటివ్ దృక్పథంతో బరిలోకి దిగుతున్నాం. గబ్బాలో మేం మెరుగైన ఆటతీరు ప్రదర్శించిన చరిత్ర ఉంది. మైదానమంతా కలియతిరిగాం. గొప్ప జ్ఞాపకాలు ఉన్నాయి. ఇక్కడ పిచ్ కూడా బాగుటుంది" అని గిల్ వెల్లడించాడు.

కంగ్రాట్స్ గుకేశ్

"ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన గుకేశ్‌కు  కంగ్రాట్స్. భారత జట్టు నుంచి అతడికి అభినందనలు చెబుతున్నాం. పిన్న వయసులోనే అరుదైన ఫీట్‌ను సాధించడం దేశానికే గర్వకారణం" అని గిల్ ప్రశంసించాడు. ఐసీసీ అధ్యక్షుడు జై షా స్పందిస్తూ.. "కంగ్రాట్స్ గుకేశ్. దేశం గర్వపడేలా చేశావు. భవిష్యత్తులోనూ మరిన్ని ఘనతలు సాధించాలని ఆకాంక్షిస్తున్నా" అని పోస్టు పెట్టారు.

# పెళ్లికి సిద్ధమైన సమంత

## 2025 ప్రేమించే భాగస్వామి అంటూ పోస్టు



స్టార్ నటి సమంతతో విడాకుల అనంతరం అక్కినేని నాగచైతన్య రెండో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. గతవారం శోభితతో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ నేపథ్యంలో సమంత సైతం మరో పెళ్లికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు సామ్ షేర్ చేసిన ఇన్‌స్టా పోస్ట్ ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. 2025లో నమ్మకం, ప్రేమను అందించే భాగస్వామిని, పిల్లల్ని కోరుకుంటున్నట్లు ఆ పోస్ట్‌లో ఉంది. వృషభ, కన్య, మకర రాశి వారు 2025లో వీటిని పొందే అవకాశం ఎక్కువగా ఉంది అంటూ సామ్ ఓ పోస్ట్ తన ఇన్‌స్టాలో షేర్ చేశారు. ఆ పోస్ట్‌లో 2025 ఏడాదిలో ఈ మూడు రాశుల వారికి ఎలా ఉందో తెలియజెప్పే జాబితాను పంచుకుంది. ఈ మూడు రాశుల వారు వచ్చే ఏడాది బిజీబిజీగా గడుపుతారని సామ్ షేర్ చేసిన జాబితాలో ఉంది. అంతేకాదు ఈ రాశుల వారు వృత్తిపరంగా మెరుగుపడతారని, బాగా డబ్బులు సంపాదిస్తారని కూడా ఉంది. ఇంకా నమ్మకం, ప్రేమను అందించే భాగస్వామిని పొందుతారట. పిల్లల్ని కూడా పొందుతారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న లక్ష్యాలను కూడా పూర్తి చేస్తారట. ఆదాయ మార్గాలు పెంచుకోవడం, మరిన్ని అవకాశాలు సొంతం చేసుకుని మానసికంగా, శారీరకంగా బలంగా ఉంటారని అందులో ఉంది. ఇందులో ఉన్నవన్నీ జరగాలని కోరుకుంటున్నట్లు సామ్ ఈ సందర్భంగా తెలిపారు.

# నా తల్లి ఆస్పత్రిలో లేదు

## మాట్లాడటానికి నేను సిద్ధం : మంచు మనోజ్



టాలీవుడ్ యాక్టర్ మంచు మోహన్ బాబు ఫ్యామిలీ వార్ సినీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఇప్పటికే మోహన్‌బాబు, కుమారుడు మంచు మనోజ్ మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా.. ఈ వ్యవహారంలో ఇప్పటికే మంచు మనోజ్, మోహన్ బాబు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. తాజాగా ఈ కేసులో మంచు మనోజ్ రాచకొండ సీపీ ఎదుట విచారణకు హాజరయ్యాడు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతిలో వినయ్ చేసే పనులు తనకు నచ్చడం లేదన్నాడు. నా తల్లి ఆస్పత్రిలో లేదు.. ఇంట్లోనే ఉన్నారు..నా తల్లి ఆస్పత్రిలో ఉన్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కూర్చుని మాట్లాడుకోవడానికి నేను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశాడు. మిగితా విషయాలు తర్వాత మాట్లాడుతానంటూ చెప్పాడు మనోజ్. కాగా పోలీసుల నోటీసులను సవాలు చేస్తూ మోహన్ బాబు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేశాడు. తనకు భద్రత కల్పించాలని కోరాడు. కాసేపట్లో పిటిషన్‌పై విచారణ జరుగనుంది. మంచు కుటుంబంలో ఇంటి గొడవలు కాస్తా పోలీసు కేసులు, ఘర్షణలకు దారితీశాయి. మంగళవారం జల్‌పల్లిలోని మోహన్ బాబు ఇంటి వద్ద కొనసాగిన హైడ్రామాలో రాత్రి అక్కడికి వెళ్లిన జర్నలిస్టులపై మోహన్ బాబు దాడి చేయడం ఉద్రిక్తతకు దారి తీసిన విషయం తెలిసిందే. ఈ దాడిపై ఆగ్రహం వ్యక్తం చేసిన జర్నలిస్టులు ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో ఆందోళనకు దిగారు.

# అభిమానులకు అజిత్ విజ్ఞప్తి



తమిళ అగ్ర కథానాయకుడు అజిత్ కుమార్ తన అభిమానులకు మరోసారి విజ్ఞప్తి చేశాడు. తనను (కడవులే అజిత్) దేవుడు అజిత్ అని పిలవవద్దని తెలిపాడు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా స్పెషల్ నోట్ విడుదల చేశాడు. ఇటీవల మూవీ ఈవెంట్‌లలో లేదా మీటింగ్స్‌లలో నన్ను (కా.. అజితే) కడవులే అజిత్ అని పిలుస్తున్నారు. ఈ పిలుపు నాకు ఇబ్బందిగా అనిపిస్తుంది. నేను ఇలాంటివి జీర్ణించకోలేకపోతున్నాను. దయచేసి ఇలా పిలవడం ఆపండి. నేను నా పేరుతో మాత్రమే పిలవడానికి ఇష్టపడతాను. అజిత్ అని పిలవండి చాలు.. ఇతరులను ఇబ్బంది పెట్టకుండా కష్టపడి పని చేయండి. మీ ఫ్యామిలీని జాగ్రత్తగా చూసుకోండి మరియు చట్టాన్ని గౌరవించే పౌరులుగా ఉండండి. అంటూ అజిత్ రాసుకొచ్చాడు. అయితే అజిత్ ఇంతకుముందు కూడా ఇలాంటి ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. తనను తలా అని పిలవవద్దంటూ అభిమానులను కోరాడు. దీంతో అభిమానులకు మళ్లీ విజ్ఞప్తి చేయడంతో ఈ విషయం తమిళ ఇండస్ట్రీలో ఆసక్తికరంగా మారింది. సినిమాల విషయానికి వస్తే.. అజిత్ ప్రస్తుతం 'విదా ముయార్చి' సినిమాతో పాటు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' అనే చిత్రంలో నటిస్తున్నాడు. 'విదా ముయార్చి' సినిమాకు మాగిజ్ తిరుమేని దర్శకత్వం వహిస్తుండగా.. త్రిష కథానాయిక నటిస్తుంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాకు 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తుండగా.. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది.

# పెళ్లిలో అదిరిపోయే స్టెప్పులేసిన శోభిత

అక్కినేని నాగచైతన్య, శోభిత ధూళిపాళ జంట ఈ నెల 4న వివాహంతో ఒకటయ్యారు. అన్నపూర్ణ స్టూడియోలో కొద్దిమంది బంధువులు, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ప్రస్తుతం శోభితకు సంబంధించిన వీడియో నెట్టింట్ వైరల్‌గా మారింది. పెళ్లి



కూతురు గెటప్‌లో ఉన్న శోభిత పాటకు స్టెప్పులేసింది. అల్లు అర్జున్ 'సరైనోడు' చిత్రంలోని 'బ్లాక్ బస్టర్' సాంగ్‌కు స్టెప్పులేసింది. ఈ సందర్భంగా శ్రద్ధా నాకు పెళ్లవుతోంది.. నాకు సిగ్గేస్తోందంటూ.. అదే సమయంలో ఈ పాట ప్లే కావడంతో శోభిత స్టెప్పులేసింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట చక్కర్లు కొడుతున్నది. ఈ వీడియోను చూసిన పలువురు శోభితను ప్రశంసించారు. పెళ్లిని బాగా ఎంజాయ్ చేశారని.. సంతోషంగా కనిపిస్తున్నారని పలువురు కామెంట్స్ చేయగా.. సింప్లీ సూపర్బ్ డ్యాన్స్ అంటూ మరికొందరు స్పందించారు. సమంతతో నాగ చైతన్య విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత శోభితతో రిలేషన్‌లో ఉన్నారు. ఈ క్రమంలో ఈ నెల 4న సంప్రదాయబద్ధంగా పెళ్లి చేసుకున్నారు. పెద్దగా సందడి లేకుండా సింపుల్‌గా పెళ్లి చేసుకున్నారు.

# ప్రతి ఇంట్లో సమస్యలు ఉంటాయి

## విషయాన్ని సెన్సేషనల్ చేయకండి అంటూ విష్ణు విజ్ఞప్తి




ప్రముఖ సినీ నటుడు మంచు మోహన్ బాబు.. అతడి కుమారుడు మంచు మనోజ్‌ల మధ్య గొడవ జరుగుతున్న విషయం తెలిసిందే. కుటుంబ వివాదం నేపథ్యంలో ప్రస్తుతం మోహన్ బాబు ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. అయితే ఈ విషయంపై తాజాగా మోహన్ బాబు పెద్ద కొడుకు మంచు విష్ణు స్పందించాడు. ప్రతి ఇంట్లోనూ సమస్యలు ఉంటాయి. ఆ సమస్యలు పరిష్కారం అవ్వాలని పెద్దలు కోరుకుంటారు. ఈ విషయంలో ఎవరో ఒకరు తగ్గుతారు అనేది ఒక హోప్ ఉంది. ఈ విషయంపై మాట్లాడటానికి చాలా ఎమోషనల్ అవుతున్నాను. మా నాన్న ఏదైనా తప్పు చేసి ఉంటే అది మమ్మల్ని విపరీతంగా ప్రేమించడం. నేను మీడియా మిత్రులకు ఒక్కటే విజ్ఞప్తి చేస్తున్నా. ఈ విషయాన్ని సెన్సేషన్ చేయకండి. ప్రజల్లో మాకు గుర్తింపు ఉంది. ప్రజల్లోకి తీసుకువెళ్లడం కరెక్టే కానీ కొంతమంది వారి లిమిట్స్ దాటి వ్యవహరిస్తున్నారు. దీని వలన మా అమ్మ ఆస్పత్రిలో చేరింది. ఇంటికి పెద్ద కొడుకుగా నేను చాలా బాధపడుతున్నా. నిన్న జరిగిన ఘర్షణలో మా నాన్నకు కూడా గాయాలు అయ్యాయి. నేను కన్నప్ప పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కోసం అమెరికాలో ఉన్నప్పుడు ఇంట్లో గొడవ జరుగుతుందని నాకు ఫోన్ వచ్చింది. ఈ విషయం తెలియగానే అన్నీ ఆపుకొని వచ్చేశాను. కుటుంబం ఇంపార్టెంట్. నిన్న మార్నింగ్ ఇక్కడికి వచ్చాను. నేను లేని మూడు నాలుగు రోజుల్లో ఇంత జరిగింది. నిన్న జరిగిన ఘటనలో ఒక రిపోర్టర్‌కు గాయలు అయ్యాయి. ఇది అనుకోకుండా జరిగింది. ఉద్దేశపూర్వకంగా ఎవరిని హర్ట్ చేయాలి అనుకోలేదు దయచేసి మా నాన్నపై దుష్ప్రచారాలు చేయొద్దు అంటూ విష్ణు కోరాడు.

# బన్నీ నా బంగారం : రాజేంద్రప్రసాద్





అల్లు అర్జున్ నటించిన పుష్ప చిత్రంపై నటకిరీటి రాజేంద్రప్రసాద్ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. మ్యాగీ దర్శకత్వంలో శ్రీరామ్, మౌనిక రెడ్డి, అర్జున్ అంబటి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న వెబ్ సిరీస్ హరికథ (%ఋుతీఅనిఫ్ష్టుు%). ఇందులో రాజేంద్రప్రసాద్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. అయితే ఈ సిరీస్ ప్రీ రిలీజ్ వేడుకలో పాల్గొన్న నటకిరీటి మాట్లాడుతూ.. కలియుగంలో వస్తున్న కథలు చూస్తున్నారు కదా.. నిన్న కాక మొన్న చూశాం.. వాడెవడో ఎర్ర చందనం స్మగ్లింగ్ చేసే దొంగ (పుష్ప సినిమాలో అల్లు అర్జున్ పాత్ర).. వాడు హీరో.. హీరోల్లో అర్థాలు మారిపోయాయి.. నాకున్న అదృష్టం ఏంటంటే 48 సంవత్సరాలుగా నేను సమాజంలో మన చుట్టూ ఉన్న ట్వంటి పాత్రలతో డిఫరెంట్ హీరో అనిపించుకున్నా.. అంటూ కామెంట్ చేశాడు. అయితే రాజేంద్రప్రసాద్ చేసిన వ్యాఖ్యలు పుష్ప 2 ది రూల్ మూవీని ఉద్దేశించి చేసినవే ఈ వ్యాఖ్యలు అంటూ నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. దీంతో ఈ వివాదం ముదరడంతో తాజాగా క్లారిటీ ఇచ్చాడు. తాను అల్లు అర్జున్‌ను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేయలేదని తెలిపాడు. అల్లు అర్జున్ నా కొడుకు లాంటి వాడు. అతడిని అలా అంటానా. బన్నీ నువ్వు నా బంగారం లవ్ యూ అంటూ రాజేంద్రప్రసాద్ తెలిపాడు. నేను పుష్ప సినిమాపై నెగిటివ్‌గా మాట్లాడానని వచ్చిన వార్తలు చూసి నవ్వుకున్నాను. ఇన్ని సంవత్సరాలుగా ఒక్క వివాదం లేదు కాదా కొత్తగా ఇది వచ్చింది అంటూ ఎంజాయ్ చేశాను. కానీ ఇది చేసింది ఎవరో కానీ వాడికి ఒక్కటే చెబుతున్నాను. అది అల్లు అర్జున్‌ను ఉద్దేశించి అనలేదు. వాడు నా కొడుకు లాంటి వాడు అంటూ చెప్పుకోచ్చాడు.

.................

# నాన్న అంటే ఎంతో ఇష్టం

# మంచు మనోజ్ పోస్టు వైరల్



ప్రముఖ సినీ నటుడు మంచు మోహన్ బాబు.. అతడి కుమారుడు మంచు మనోజ్‌ల మధ్య గొడవ జరుగుతున్న విషయం తెలిసిందే. కుటుంబ వివాదం నేపథ్యంలో ప్రస్తుతం మోహన్ బాబు ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. అయితే తాజాగా మీడియాతో మాట్లాడిని మంచు మనోజ్ నాన్న అంటే తనకు ప్రాణం అని. మా నాన్న నాకు ఎప్పటికి దేవుడే అంటూ ఎమోషనల్ అయ్యాడు. అంతేగాకుండా.. మా నాన్నను అన్న విష్ణు.. వినయ్ అనే వ్యక్తి కలిసి ట్రాప్ చేసి.. నా నుంచి అతడిని దూరం చేస్తున్నారని తెలిపాడు. అయితే మోహన్ బాబు ప్రస్తుతం ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. మంగళవారం జరిగిన దాడిలో అస్వస్థతకు గురవ్వడంతో మోహన్ బాబు ఆస్పత్రిలో చేరాడు. ఆయన ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని.. గుండె కొట్టుకోవడంలో హెచ్చుతగ్గులు ఉన్నాయని వైద్యులు తెలిపారు. ఇదిలావుంటే మంచు మనోజ్‌కి తన నాన్నంటే ఎంత ప్రేమనో చెప్పడానికి అతడు క్రియేట్ చేసిన ఒక పాత వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. మోహన్ బాబు పుట్టినరోజు సందర్భంగా యానిమల్ సినిమాలోని నాన్న నువ్వు నా ప్రాణం అనే సాంగ్ మీద వీడియోను పెట్టాడు మనోజ్. లైఫ్‌లో నువ్వు నేర్పినా పాఠాలకు.. నా జీవితానికి ధన్యవాదాలు.. పుట్టినరోజు శుభాకాంక్షలు నాన్నా అంటూ రాసుకోచ్చాడు. అయితే ఈ వీడియోను ఇప్పుడు వైరల్ చేస్తున్నారు నెటిజన్లు. కాగా ఈ వీడియోను మీరు చూసేయండి.

# వ్యాయామం వేళ ఏదిపడితే అది తినకూడదు.. ఎందుకంటే..!

ఈ మధ్య కాలంలో ఆరోగ్యంపై అందరికీ అవగాహన పెరిగింది. ముఖ్యంగా కూర్చుని ఉద్యోగాలు చేసేవారు అనారోగ్యాలకు గురికాకుండా ముందు జాగ్రత్తతో వ్యాయామాలు చేస్తున్నారు. అయితే కేవలం వ్యాయామం చేయగానే సరిపోదని, వ్యాయామానికి ముందు, తర్వాత తీసుకోవాల్సిన ఆహార నియమాలను కూడా పాటిస్తేనే మంచి ఫలితం ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఏది పడితే అది తిని వ్యాయాయం చేస్తే ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. కాబట్టి వ్యాయామానికి ముందు, తర్వాత పాటించాల్సిన ఆహార నియామాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అసవరం ఉంది. మరి ఆ నియమాలేంటో తెలుసుకుందాం..



ఇవి పాటించండి..

1. వ్యాయామం చేయడానికి ముందు ప్రొటీన్‌లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. అయితే ఏదైనా ఆహారంగా తీసుకున్న తర్వాత వ్యాయామం మొదలుపెట్టడానికి కనీసం గంటసేపైనా విరామం ఇవ్వాలి. లేదంటే అనవసర సమస్యలు వస్తాయి. వ్యాయామానికి ముందు తీసుకునే ఆహారం కొవ్వులు, పిండి పదార్థాల మిశ్రమంగా ఉండాలి. అరటిపండు, ఉడికించిన గుడ్లు తీసుకుంటే మంచిది.

2. అదేవిధంగా వ్యాయామం తర్వాత కూడా శరీరానికి శక్తి కావాలి. అందుకే వ్యాయామం అయిన తర్వాత గంటలోపు మీకిష్టమైన పోషకాలున్న ఆహారాన్ని తీసుకోవాలి. వ్యాయమం తర్వాత శరీరం అలసిపోతుంది కాబట్టి శక్తి ఎంతో అవసరం. కసరత్తుల వల్ల ఖర్చైపోయిన ఎనర్జీని పొందడానికి వోట్ మీల్, క్వినోవా, గుడ్లు, గ్రీక్ కర్డ్, చికెన్, చేపలు, గింజలు, మొలకెత్తిన విత్తనాల వంటివి తీసుకోవాలి.

3. వ్యాయామానికి ముందు, తర్వాత కూడా మంచి నీళ్లు తాగొచ్చు. అంతేకాదు రోజులో ప్రతి అరగంటకు ఒకసారి ఒక గ్లాసు నీళ్లు తాగితే ఆరోగ్యానికి ఎంతో ఉపయోగం.

4. బరువులు లేపడం లాంటి ఎక్కువ కేలరీలు ఖర్చయ్యే వ్యాయామాలు చేసినప్పుడు తక్కువ కొవ్వు ఉన్న పెరుగు, ఎండు ద్రాక్ష, అరటిపండు లాంటివి తీసుకోవాలి.

5. ఇక వ్యాయామానికి ముందుగానీ, తర్వాతగానీ కొవ్వు ఎక్కువగా ఉండే పదార్థాలను ఆహారంగా తీసుకోకూడదు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను అస్సలు తినకూడదు. ఎందుకంటే అవి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది.

# శనగలకు శాస్త్రీయత ఏమిటి?

హలో మేడం. మొలకెత్తిన శనగలను శ్రావణ మాసంలో వాయనంగా ఇస్తారు. వర్షాకాలం, వేడుకలు నోములు ఎక్కువగా ఉండే ఈ సమయంలో వీటిని పంచడం, తినడం వెనుక ఏమైనా శాస్త్రీయత ఉందంటారా! ఈ సమయంలో ఇలా శనగలు తినడం ఆరోగ్యాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తుంది.



వానకాలంలో వ్యాధులు త్వరగా వ్యాపిస్తాయి. అపరిశుభ్ర వాతావరణం వల్ల ఆహారం త్వరగా కలుషితం అవుతుంది. ముఖ్యంగా మాంసాహారంతో ఈ సమస్య ఎక్కువ. బహుశా అందుకే ఈ పూజల కాలంలో దీన్ని దూరం పెట్టమని పెద్దలు చెప్పి ఉంటారు. చాతుర్మాస్య దీక్షల్లో భాగంగా ఒక నెల ఆకుకూరలు, ఒక నెల పాల పదార్థాలు%ొ% ఇలా కొన్నిటిని నిషేధించడంలోనూ ఇదే మూలంగా చెప్పొచ్చు. ఎందుకంటే వానకాలం ఆకుకూరలు కూడా బాగా కలుషితం అవుతాయి. నేలకు తక్కువ ఎత్తులో ఉండే వీటి ఆకులు ఎక్కడెక్కడి నుంచో కొట్టుకొచ్చే వాన నీళ్లలో మునుగుతుంటాయి. ఇది ప్రమాదం కలిగించే విషయం. ఇక, సాధారణంగా వానకాలంలో జీర్ణశక్తి మందగిస్తుంది. మాంసం తినం కాబట్టి, ఆ స్థానంలో శరీరానికి శాకాహార ప్రొటీన్ అందించాలి. దానికి శనగలు చక్కని పరిష్కారం.

ఇందులో మాంసకృత్తులతో పాటు, పీచు ఎక్కువగా ఉంటుంది. ఐరన్, కాల్షియం, జింక్, మెగ్నీషియంలాంటి సూక్ష్మపోషకాలూ అందుతాయి. నానబెట్టడం వల్ల ఇందులోని ఫైటిక్ యాసిడ్ స్థాయిలు తగ్గిపోతాయి. మాంసకృత్తుల్ని శరీరం శోషించుకోవడాన్ని ఈ యాసిడ్ తగ్గిస్తుంది. నానబెట్టి, ఉడికించి తింటే గ్యాస్ కూడా రాదు. ముఖ్యంగా శనగలు మొలకెత్తడం వల్ల అందులోని పోషక విలువలు అధికమవుతాయి. ఇక, శ్రావణ మాసంలో పూజలు, వేడుకలు అధికంగా ఉంటాయి. ఉపవాసాలు, వేళకు తినలేకపోవడాలు కూడా ఎక్కువే కాబట్టి.. శాకాహారులకు మరింత బలాన్ని చేకూర్చేందుకు శనగలను ఆహారంలో భాగం చేశారని చెప్పొచ్చు.

ఇక ఈ శనగల్ని ఎలా తిన్నా మేలే. కాస్త ఉడికించి కీర, క్యారెట్ ముక్కలు జతచేసి సలాడ్‌లాగా తినొచ్చు. లేదంటే పసుపు, జీలకర్ర, ఆవాలు, ఇంగువ, అల్లం ముద్దతో తాలింపు వేసి%ొ% గుగ్గిళ్లు చేసుకోవచ్చు. ఈ సమయంలో అల్లం, జీలకర్ర, ఇంగువలాంటివి జీర్ణాశయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. అలాగే హంగ్‌కర్డ్‌లో%ొ% ఉడకబెట్టిన శనగలు, క్యారెట్ తురుము, బీట్‌రూట్ తురుము, జీలకర్ర పొడి, ఇంగువ, ఉప్పు, మిరియాల పొడి కలుపుకొని తిన్నా రుచిగా ఉంటుంది. ఇలా రోజుకు ఒక చిన్నకప్పు తినొచ్చు. శనగలు పొట్ట నిండిన భావనను కలిగించి, బరువు తగ్గేందుకూ సాయపడతాయి.

# జలుబు, దగ్గు.. అపోహలు రోగ నిరోధక శక్తి

వానాకాలం మధ్యలోకి వచ్చేశాం. ముసుర్లు, ఓ మోస్తరు వానల్లో తడవాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా జలుబు, దగ్గు లాంటి సమస్యలు పట్టి పీడిస్తుంటాయి. అయితే, దగ్గు, జలుబులు మామూలు వ్యాధులే అయినా, వీటి చుట్టూ మనలో ఎన్నో అపోహలు ఉంటాయి. వాటిని నివృత్తి చేసుకుంటే మంచిది.

బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లకే యాంటిబయాటిక్స్ అవసరమవుతాయి. దగ్గు, జలుబులేవో వైరస్‌ల వల్ల వస్తాయి. కాబట్టి, యాంటిబయాటిక్స్ తరచుగా, క్రమరహితంగా తీసుకుంటే మన



ఆరోగ్యానికి మంచి కంటే చెడే ఎక్కువ.

పెరుగు, ఇతర పాల ఉత్పత్తులతో జలుబు వస్తుందా?

ఇన్ఫెక్షన్ కలిగించే బ్యాక్టీరియా, వైరస్‌ల కారణంగా రోగాలు వస్తాయి. సాధారణంగా, జలుబు కారణంగా మ్యూకస్ (శ్లేష్మం) ఉత్పత్తి అవుతుంది. ఇక పెరుగులో ప్రొబయాటిక్స్ ఉంటాయి. ఇందులో ఉండే బ్యాక్టీరియా నిజానికి మనిషి ఆరోగ్యానికి మేలుచేస్తుంది.

ఓవర్ ద కౌంటర్ టానిక్‌లు ఇన్ఫెక్షన్‌ను తొందరగా నయం చేస్తాయా?

డాక్టర్ సూచన లేకుండా మందుల దుకాణాల్లో కొనే టానిక్‌లు హానికరమైనవి. వీటి వాడకంతో సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. ముఖ్యంగా చిన్నపిల్లల విషయంలో. అవి కేవలం రోగ లక్షణాలను మరుగునపరుస్తాయి. అలా రోగం నుంచి ఉపశమనం కలగజేస్తాయి.

ఇవి పిల్లల్లో బలహీన రోగ నిరోధక శక్తికి సంకేతాలా?

పిల్లల్లో దగ్గు, జలుబు తరచుగా వస్తుంటే%ొ% అది అలర్జీకి సంకేతం. అంతేతప్ప బలహీనమైన రోగ నిరోధక శక్తికి సూచన కాదు.

జలుబులాగే అన్ని రకాల దగ్గులూ ఇతరులకు వ్యాపిస్తాయా?

బ్యాక్టీరియా లేదా వైరస్ ఇన్ఫెక్షన్ ద్వారా వచ్చిన దగ్గు ఇతరులకు వ్యాపిస్తుంది. అదే అలర్జీ, ఆస్తమా, శ్వాసనాళంలో మంట కారణంగా అయితే మాత్రం చాలావరకు ఇతరులకు వ్యాపించవు.

ఫ్లూ వ్యాక్సిన్ల వల్ల మళ్లీ ఫ్లూ దాడిచేస్తుందా?

ఏడాదికోసారి డాక్టర్లు సూచించే ఫ్లూ వ్యాక్సిన్లలో క్రియాశీలం కాని వైరస్‌లు ఉంటాయి. ఇవి మళ్లీ ఇన్ఫెక్షన్లకు ఎంతమాత్రం కారణం కాదు. కాబట్టి, ప్రతి ఏటా పిల్లలకు ఫ్లూ టీకాలు వేయించవచ్చు.

# ఇమ్యూనిటీ ఆరోగ్యానికి రక్షరేకు

ప్రతి మనిషిలో రోగ నిరోధక శక్తి (ఇమ్యూనిటీ) అనేది ప్రకృతి సిద్ధంగానే సమకూరి ఉంటుంది. మన రక్తంలోని తెల్ల రక్తకణాలు శరీరానికి సైనికుల్లా పనిచేస్తాయి. ఇవి బయటి పరిసరాల నుంచి దాడిచేసే ఇన్ఫెక్షన్లు, బ్యాక్టీరియాను శరీరంలోకి చొరబడకుండా రక్షిస్తాయి. ఒకవేళ కొవిడ్ 19 లాంటి వైరస్‌లు శరీరంలోకి ప్రవేశిస్తే, వాటితో తెల్ల రక్తకణాలు పోరాడతాయి. ఈ విధంగా పోరాడే తెల్ల రక్తకణాల సంఖ్యను లేదా శక్తినే రోగ నిరోధక శక్తి అని పేర్కొంటారు. ఇది మనం తీసుకునే రోజువారీ ఆహారం, శారీరక శ్రమతోనే లభిస్తుంది. అలా సమకూరని వారికి మాత్రం ఔషధాల రూపంలో ఇవ్వాల్సి వస్తుంది.

ఈ కాలాల్లో అత్యవసరం

రోగ నిరోధక శక్తి అనేది వర్షకాలం, శీతకాలంలో అత్యవసరం. ఎందుకంటే వానాకాలం, చలికాలంలో డెంగీ, మలేరియా, ఫ్లూ



వంటి సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలుతుంటాయి. వీటిని సమర్థంగా ఎదుర్కోవడానికి మన శరీరంలో తగినంత రోగ నిరోధక శక్తి ఉండాలి. ఈ పవర్ లేకపోతే వచ్చిన వ్యాధులు త్వరగా తగ్గకపోవడమే కాకుండా రోగి తీవ్ర అనారోగ్యానికి గురవుతాడు. తరచూ వ్యాధుల బారినపడాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. ప్రధానంగా వేసవి నుంచి వర్షకాలానికి మారుతున్న సంధి దశలో శరీరానికి ఇమ్యూనిటీ ఎంతో అవసరం. వానాకాలంలో సాధారణంగా డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు వస్తుంటాయి. రోగ నిరోధక శక్తి బాగా ఉన్నవారిలో బయటినుంచి యాంటి బయాటిక్స్ అవసరం లేకుండానే ఇలాంటి జ్వరాలను శరీరం తట్టుకుంటుంది. ఇక మనలో ఇమ్యూనిటీ పవర్ పెరగడానికి కొన్ని ప్రాథమిక జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. రోజువారి జీవనశైలి, ఆహారపు అలవాట్లలో స్వల్ప మార్పులు చేసుకోవడం వల్ల దీర్ఘకాలికంగా మంచి ఫలితాలు ఒనగూరుతాయి.

ఇమ్యూనిటీకి బాటలు

వ్యక్తిగత పరిశుభ్రత పట్ల శ్రద్ధ చూపాలి. బయటికి వెళ్లి వచ్చిన వెంటనే, భోజనానికి ముందు, మల, మూత్ర విసర్జన తర్వాత కాళ్లు, చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.

రోగ నిరోధక శక్తి పెరగడానికి ఆహారపు అలవాట్లతోపాటు వ్యాయామం, తగినంత నిద్ర కూడా చాలా అవసరం.

రోజుకు కనీసం 40 నిమిషాల చొప్పున వారంలో 5 రోజులు వ్యాయామం చేయడం మంచిది.

నడకకు వెళ్లే వాళ్లు రోజుకు కనీసం ఏడు వేల నుంచి ఎనిమిది వేల అడుగులు వేయాలి.

డెస్క్ ఉద్యోగాల్లో ఉన్నవాళ్లు గంటకు ఒక్కసారైనా కూర్చున్న చోటు నుంచి లేచి, కొంచెం దూరం నడవాలి.

స్కిప్పింగ్ వల్ల కాళ్ల కండరాలు, రక్త ప్రసరణ మెరుగుపడుతుంది.

60 ఏళ్లు దాటినవాళ్లు స్కిప్పింగ్ చేయలేని పరిస్థితుల్లో సైక్లింగ్ చేయవచ్చు.

వయసులో ఉన్నవాళ్లయితే జాగింగ్, రన్నింగ్, స్విమ్మింగ్ చేయడం ఉత్తమం. లేదంటే శారీరక, మానసిక ఉల్లాసాన్ని ఇచ్చే ఏవైనా క్రీడలు ఆడాలి.

యోగా చేస్తే శరీరం ఫ్లెక్సిబిలిటీ పెరుగుతుంది. ప్రాణాయామం వల్ల మెదడు, ఇతర అవయవాలకు తగినంత ఆక్సిజన్ అందుతుంది.

ఆహారంతో రోగ నిరోధకత

రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలంటే విటమిన్-సి, విటమిన్-ఇ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలి. వీటిలో యాంటిఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తి పెరగడంలో ఎంతో దోహదపడతాయి. పల్లీలు, పిస్తాపప్పు, ఎండుద్రాక్ష, కుంకుమపువ్వులో సరిపడా యాంటి ఆక్సిడెంట్స్ ఉంటాయి.

పసుపు, తులసి, అల్లం, వెల్లుల్లిలో యాంటి ఆక్సిడెంట్లతోపాటు యాంటిబ్యాక్టీరియల్ గుణాలు కూడా ఉంటాయి. ప్రతిరోజూ చాయ్‌లో అల్లం లేదా తులసి, పాలల్లో అయితే పసుపు వేసుకుని తాగడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దానిమ్మ, స్ట్రాబెర్రీ, కర్బూజ, తర్బూజ పళ్లు తింటే శరీరానికి తగినన్ని విటమిన్లు, యాంటి ఆక్సిడెంట్స్ పుష్కలంగా దొరుకుతాయి. ఇవి కూడా రోగ నిరోధక శక్తి పెరగడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. సమతుల ఆహారానికి పెద్దపీట వేస్తూనే, ధూమపానం, మద్యపానం లాంటి దుర్వ్యసనాలను వదిలించుకోవాలి.

విటమిన్-సి ఉన్న పదార్థాలు

నారింజ

బత్తాయిజి

నిమ్మ మొదలైన సిట్రస్ జాతి పళ్లు

విటమిన్-ఇ ఉన్న పదార్థాలు

అవకాడో

కివీజి

బాదం

పాలకూరజి

బొప్పడి పండు

ఆహారంతోపాటు హైడ్రేషన్..

వర్షకాలం, చలికాలంలో రోజుకు 2 నుంచి 3 లీటర్ల నీరు, వేసవిలో అయితే 4 లీటర్ల నీరు తప్పనిసరిగా తాగాలి. వానాకాలంలో కూరగాయలు, ఆకుకూరలు శుభ్రంగా కడిగాకే వాడుకోవాలి. వర్షకాలంలో టైఫాయిడ్ సహా వివిధ వ్యాధులు రావడానికి కలుషితమైన నీరే ప్రధాన కారణం. కాబట్టి వర్ష రుతువులో బయటి ఆహార పదార్థాలను సాధ్యమైనంత వరకు దూరం పెట్టడమే ఉత్తమం. ఇక మాంసాహారులు మాంసాన్ని చక్కగా శుభ్రం చేసి బాగా ఉడికించి తినాలి. చేపల్లో విటమిన్- ఇ, ఒమేగా- 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండెకు మేలుచేస్తాయి.

మంచి నిద్ర ఎంతో మంచిది

మనిషికి ఆహారం, వ్యాయామం ఎంత ముఖ్యమో నాణ్యమైన నిద్ర అంతే ప్రధానం. ప్రతిరోజూ వయసుతో నిమిత్తం లేకుండా కనీసం ఆరు నుంచి ఎనిమిది గంటల నాణ్యమైన నిద్ర అవసరం. రాత్రివేళ త్వరగా పడుకుని పొద్దునే తొందరగా లేచి చేసే వ్యాయామం మంచి ఫలితాలను ఇస్తుందని వివిధ అధ్యయనాలు వెల్లడించాయి. సరైన నిద్ర వల్ల శరీరంలో హార్మోన్ల సమతుల్యత ఏర్పడుతుంది. త్వరగా లేచి వ్యాయామం చేయడం వల్ల ఒత్తిడి కూడా తగ్గుతుంది. మన రోగ నిరోధక శక్తి తగ్గడంలో ఒత్తిడికీ పాత్ర ఉంటుంది. కాబట్టి మానసిక ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలి.

జాగ్రత్తలే కీలకం

ఫ్లూ వంటి విషజ్వరాలు వ్యాపించకుండా ఉండాలంటే బయటికి వెళ్లినప్పుడు మాస్క్ ధరించాలి.

ప్రతి సంవత్సరం ఫ్లూ లాంటి విషజ్వరాలకు టీకాలు వేయించుకుంటే ఇన్ఫెక్షన్ల వల్ల తలెత్తే ఇబ్బందులు చాలావరకు తగ్గుతాయి.

పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి.

జంతువుల ద్వారా సోకే ఇన్ఫెక్షన్ల గురించి అవగాహన పెంచుకోవాలి. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

రోజూ పొద్దునే ఓ ఇరవై నిమిషాలపాటు ఎండలో గడిపితే శరీరంలో విటమిన్ డి తగినంతగా ఉత్పత్తి అవుతుంది. రోగ నిరోధక శక్తి నిర్వహణలో విటమిన్- డి కూడా కీలకపాత్ర పోషిస్తుంది.

విటమిన్- డి తక్కువ ఉన్నవాళ్లు డాక్టర్ల సూచన మేరకు సప్లిమెంట్స్ తీసుకోవాలి.

జ్వరం, దగ్గు, జలుబు, ర్యాషెస్ వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

రోగ నిరోధక శక్తి పెరగడానికి వ్యాయామం, ఆహారం మాత్రమే కాకుండా ఇతర జాగ్రత్తలు కూడా

తీసుకోవాలి. ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలి.

# పసుపు.. పద్నాలుగు రోజులు

పసుపు భారతీయుల వంటల్లోనే కాకుండా, వివాహాది వేడుకల్లోనూ ప్రాముఖ్యం కలిగిన దినుసు. అయితే, ఆర్థరైటిస్, టెండనైటిస్, బర్సయిటిస్ లాంటి రోగ నిరోధక శక్తికి సంబంధించిన ఆటో ఇమ్యూన్ వ్యాధుల నివారణలో, కిడ్నీల పనితీరు మెరుగుపర్చడంలో, పాదాల వాపును తగ్గించడంలోనూ పసుపు



ఎంతో దోహదపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. పద్నాలుగు రోజులపాటు పసుపును ఆహారంలో, పాలు, మజ్జిగలో తగిన మోతాదులో భాగం చేసుకుంటే సానుకూల ఫలితాలు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

పసుపులో యాంటి ఇన్‌ఫ్లమేటరీ, యాంటి ఆక్సిడెంట్, క్యాన్సర్ నిరోధక గుణాలు ఉంటాయి. గాయాల చికిత్సలో, ఇన్ఫెక్షన్లను నియంత్రణలో ఇవెంతో సహకరిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు రుమటాయిడ్ ఆర్థరైటిస్ విషయంలో కూడా పసుపు ప్రయోజనకారిగా ఉంటుందట. ఇంకా జీర్ణ వ్యవస్థలో రసాల ఊటను పెంచడం, కడుపులో మంట తగ్గించడం, రక్తంలో చక్కెర స్థాయిలు ఆరోగ్యకరంగా ఉండటానికి, ఊబకాయం ముప్పు తగ్గడానికీ పసుపు సహకరిస్తుందట.

ఇందులో ఉండే కర్కుమిన్ శరీరంలో ఫంగస్, బ్యాక్టీరియా పెరుగుదలను అడ్డుకుంటుందట. అయితే, మంచిది కదా అని పసుపును ఎక్కువగా తీసుకుంటే మాత్రం అలర్జీలు, డయేరియా లాంటి సమస్యలకు దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పైగా పసుపులో కాల్షియం ఆగ్జలేట్ ఉంటుంది కాబట్టి, కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదం కూడా పొంచి ఉంటుందని పేర్కొంటున్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy